₹ 10/-

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్


సంపుటి- 8 సంచిక - 18
పక్షపత్రిక సెప్టెంబర్ 16-30, 2017

## సెప్టెంబర్ 15న విశాఖ నుంచి 'జనహితం కోసం జేపీ సురాజ్య యాత్ర' ప్రారంభం

అప్పులపాలై చితికిపోతున్న చిన్న రైతులారా...
గుర్తింపు లేని కౌలురైతులారా....
నెక్స్ట్ ఏంటో తెలియని విద్యార్థులారా..
నిరాశలో ఉన్న నిరుద్యోగులారా...
ఎదిగే అవకాశాల్లేని బీసీల్లారా, దళితులారా...
దిగువకు, ఎగువకు మధ్య నలిగిపోతున్న మధ్యతరగతి ప్రజలారా....

**మీ సమస్యలు, మీ అభిప్రాయాలు, మీ సూచనలు**
**వినడానికి పార్టీలకతీతంగా వస్తున్నాం... చెప్పడానికి రండి...**

**విని ఏం చేస్తాం ?**



విద్య, ఆరోగ్యం, నిరుద్యోగం
కులవివక్ష, రిజర్వేషన్ల ఘర్షణ
స్థానిక అధికారాలు లేకపోవడం,
లంచాలు, మహిళలపై వేధింపులు,
అప్పుల వ్యవసాయం....
ఏ ప్రభుత్వమున్నా దశాబ్దాలుగా చేసిన నిర్లక్ష్యం వల్ల
ఇలా కొనసాగుతున్న మన మౌలిక సమస్యలను శోధిద్దాం...
అందరికీ ఆమోదయోగ్యమైన, తేలిగ్గా అమలుచేయగలిగిన
పరిష్కారాల్ని నిగ్గుతేలుద్దాం....
వాటిని ప్రభుత్వాల దృష్టికి తీసుకెళదాం...
సమస్యల పరిష్కారం కోసం మీతో కలిసి ఉద్యమిస్తాం
మార్పును సాధిస్తాం....

**మన సమస్యల పరిష్కారం కోసం ఒక్కటిగా కదులుదాం**
**జనహితం కోసం లోక్‌సత్తా జేపీ చేస్తున్న ఈ సురాజ్య యాత్రలో పాల్గొందాం...**

## లోక్‌సత్తా 'పౌర సేవల' నమూనా చట్టాన్ని చంద్రబాబుకు పంపిన జేపీ



## మన ప్రజాస్వామ్యం సంక్షోభానికి నిలువెత్తు నిదర్శనం నంద్యాల అసెంబ్లీ ఉప ఎన్నిక

## సెప్టెంబర్ 17ను అధికారికంగా జరపడానికి భయమెందుకు ?




# చిట్టచివరి పౌరునీ ఎంపవర్ చేసే విధానాలు కావాలి : జేపీ



ఆత్మగౌరవం, సమాజ ఔన్నత్యం ప్రతి యువతీ యువకుని నడిపించే సూత్రాలు కావాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. మనదేశంలో అన్ని వనరులూ ఉన్నా కొందరే సంపద సృష్టిలో భాగమవుతున్నారని, ఇందుకు సమష్టి వైఫల్యమే కారణమని అన్నారు. అభివృద్ధి ఫలాలు అందరికీ అందేలా, చిట్టచివరి పౌరుని కూడా ఎంపవర్ చేసే విధానాలను తయారుచేసుకోవాలన్నారు. హైదరాబాద్ బాగ్‌అంబర్‌పేట్ శివం రోడ్డులోని షిర్డీ సాయిబాబా సంస్థాన్ మందిరంలో 'వియ్ ఎంపవర్ ఇంటర్నేషనల్' నిర్వహించిన సదస్సులో జేపీ ముఖ్య అతిథిగా మాట్లాడారు.



దేశభక్తి అంటే దేశమాతను పూజించటం మాత్రమేకాదని, సరైన విధానాలు, వ్యవస్థల కోసం కృషిలో భాగస్వాములవటమని జేపీ అన్నారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందన్నారు. అద్భుతమైన ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుని వారు పరిష్కారంలో భాగమైతే కచ్చితంగా చైనాకు దీటుగా ఎదగగలమన్నారు. స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుని యువత సమాజసేవకు పాటుపడాలని మహారాష్ట్ర అదనపు డీజీపీ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. దేశ సంస్కృతికి ప్రపంచంలో ప్రత్యేకస్థానముందన్నారు. వియ్ ఎంపవర్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు కొండూరి సాయిబాబా సదస్సుకు అధ్యక్షత వహించారు. ఐ ఫోకస్ వ్యవస్థాపకుడు ఎం. వాసుదేవశర్మ, ప్రొఫెసర్ దుర్గ తదితరులు ప్రసంగించారు. వీణా అమృత కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది.



జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

సెప్టెంబర్ 16-30, 2017 సంపుటి - 8 సంచిక - 18

## లోపలి పేజీల్లో...

సెప్టెంబర్ 15న విశాఖ నుంచి 'జనహితం కోసం'.. 5
మీ జనచైతన్య యాత్రలో మద్యంపై గళం.............. 6
నిరుద్యోగ భృతే శరణ్యమంటున్న ఏపీ ప్రభుత్వం....... 11
రైతు నుంచి దళారులు కొట్టేసిందే రూ॥................ 12
నంద్యాల ఉప ఎన్నిక మన ప్రజాస్వామ్య .............. 13
సురాజ్యం మన జన్మహక్కు............................. 17
'హేతుబద్ధంగా ' ఆలోచిస్తేనే..జీవితం................. 22
సెప్టెంబర్ 17ను అధికారికంగా ........................ 25
అద్భుత రాజధాని ఆర్డరేస్తే రాదు ........................ 27
9,000 కిలోమీటర్ల రోడ్లు... 18,000 ............. 29
'పౌరసేవల చట్టాన్ని అన్ని విభాగాలకు, ............... 30
(మీడియాలో) 'కీ' కామెంట్లు ! ......................... 32
ఇకనైనా మేలుకొంటారా ప్రధానీ ? .................... 33



## కార్టూన్ కార్నర్

### సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

విడి ప్రతి : రు. 10 ,
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.


బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి



# బతుకమ్మ!

ఈసారి బతుకమ్మ పండుగ సందర్భంగా తెలంగాణ వ్యాప్తంగా ఓటు హక్కు వయసున్న దాదాపు 1.04కోట్ల మంది పేద మహిళలకు చీరలను ఉచితంగా ఇస్తున్నట్టు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ప్రకటించారు. చేనేత, మరమగ్గాల కార్మికులకు ఉపాధి కల్పించేందుకు వారు తయారుచేసిన చీరలను ప్రభుత్వమే కొనుగోలు చేసి పంపిణీ చేస్తోందని తెలిపారు. దసరా పండుగ తరుణంలో జరిగే బతుకమ్మ వేడుకలు ఇతర ప్రాంతాల్లోనూ అక్కడక్కడా జరుగుతాయిగానీ, తెలంగాణకు మాత్రం ప్రత్యేకం. ప్రజల జీవన సంస్కృతిలో మమేకమై ఉండే అలాంటి వేడుకను ఓ పెద్ద ప్రయోజనానికి అవకాశంగా ఉపయోగించుకోవటం తెలివైన నాయకత్వ లక్షణమే. కానీ ఉచిత చీరల పంపిణీలో అలాంటి ప్రజా ప్రయోజనం కనిపించదు. నేత కార్మికుల సమస్యను పరిష్కరించటం, తెలంగాణ సంస్కృతిని పరిరక్షించడం, జనం సొమ్మును సొంత సొమ్మన్నట్లు దానం చేసైనా మనసున్న మారాజు అనే తన ఇమేజ్‌ను పెంచుకోవటాల్ని కేసీఆర్ అలవోకగా కలబోసి బతుకమ్మ కానుకను ప్రకటించారు. శతాబ్దాల చరిత్ర ఉన్న బతుకమ్మ పండుగ చుట్టూ అనేక కథలు, నమ్మికలు ఉన్నా.. ఆ పూలపండుగలోని అంతస్సూత్రం మాత్రం 'ఆరోగ్యం'! మనిషి ఆరోగ్యాన్ని, ఆయువును పెంచేలా ఔషధ గుణాలున్న పూవులను సేకరించటం, నిత్యజీవితావసరమైన జలాన్ని, పర్యావరణాన్ని శుద్ధి చేయటం వంటివి ఇందులో భాగంగా ఉంటాయి. బతుకమ్మ అంటూ గౌరీమాతను పూజించే ప్రతి ఆడపడుచూ తాను కూడా 'బతుకమ్మా' అని శుభాశీస్సును కుటుంబసభ్యులతో కలసి అందుకోవాలని, పూర్ణాయుషుతో మంగళకర జీవితం గడపాలని ఆశపడుతుంది. ఈ సాంస్కృతిక పరంపరను ఆధునిక ప్రజాస్వామ్య ప్రభుత్వం ఎలా మలచాలీ?.. తెలంగాణలో ప్రతి ఆడపడుచుకూ ఆయురారోగ్యాలు ఇచ్చేలా మంచి వైద్య విధానాన్ని కేసీఆర్ బహూకరించి ఉంటే తన ప్రభుత్వ బాధ్యతనూ నెరవేర్చినట్టూ ఉండేది, బతుకమ్మ పండుగకు నూతనోత్తేజమూ వచ్చేది. కేసీఆర్ కిట్లు, ఆరోగ్యశ్రీ వంటి స్కీములు చాలవు. నిజానికి మనం పూజించే వ్యక్తులు, దేవుళ్లు ఆ పునీత హోదా పొందటానికి ఇతరత్రా కారణాలున్నా.. ప్రజల వైద్య, ఆరోగ్య అవసరాలే అందుకు ప్రధాన కారణం. జబ్బులు నయం చేస్తారన్న ఆశతోనే పలు సందర్భాల్లో సాటి మనుషులను ప్రజలు దైవదూతలుగా భావిస్తుండేవారు, ఇప్పటికీ భావిస్తున్నారు. జీసస్ క్రీస్తు నుంచి మన గ్రామ దేవతల వరకూ ఇలా దైవదూతలను, దేవుళ్లను (దొంగ బాబాలను కూడా) నమ్మడానికి, పూజించటానికి, నోములు, ఉపవాసాలు, వ్రతాలు, దీక్షలు చేయడానికి, ముడుపులు కట్టటానికి, మొక్కులు చెల్లించడానికి, కానుకలు వేయటానికి ఓ ప్రధాన కారణం- హీలింగ్ టచ్ కోసం, ఆరోగ్యం కోసం మనిషి పడే ఆరాటం! తన జీవితమంతా సేవ కోసం ధారపోసిన మదర్ థెరెస్సాను మహిమాన్వితగా, సెయింట్‌గా గుర్తించడానికి కారణం ఆమె వైద్యసేవలే. పెద్ద అనారోగ్యాన్ని కనీసం రెండుసార్లు ఓ అద్భుతంలా నయం చేస్తేనే పునీత హోదా ఇస్తారు. 1998లో కడుపులో కణితితో బాధపడిన బెంగాలీ గిరిజన మహిళ మోనికా బెర్సాను, ఆ తర్వాత మెదడు ఇన్ఫెక్షన్ నుంచి బ్రెజిల్‌కు చెందిన ఆండ్రినోస్ అనే వ్యక్తిని అద్భుతరీతిలో కోలుకునేలా చేయటం ద్వారా సెయింట్‌హుడ్‌కు మదర్ అర్హత సాధించారు. వినాయకుడి పూజలో ఉపయోగించే పత్రిలో ఉండేవన్నీ ఔషధ గుణాలున్న పత్రాలే. మతాలతో సంబంధం లేకుండా ప్రతి దేవుడి పూజ వెనకా, ప్రతి పండగ జరుపుకోవటం వెనకా ఆరోగ్య లక్ష్యం ఉంటుంది. అందుకే వైద్యుడ్ని నారాయణుడితో పోలుస్తుంది భారతీయ సంస్కృతి. ఆరోగ్య తెలంగాణ నిర్మాణం లేకుండా ఓట్లు దండుకునేరీతిలో చీరలు పంచితే అది బతుకమ్మ తంతు అవుతుంది తప్ప పండుగ అవదు. నేతకారులను ఆదుకోవటం కోసం అనుకున్నా కూడా.. అందుకు చీరల పంపిణీలు వంటివి చాలా పేలవమైన పరిష్కారాలు. నేతకారులకు తగిన రాయితీలతో ఆధునిక మౌలిక వసతుల్ని కల్పించటం, మార్కెట్ డిమాండ్‌తో అనుసంధానం చేయటం, ప్రభుత్వ విభాగాలకు వారి నుంచి కొనుగోళ్లు తప్పనిసరి చేయటం, నేతకారుల పిల్లలకు నాణ్యమైన చదువును, ఉపాధి అవకాశాలను అందుబాటులోకి తేవటం వంటి చర్యల్ని చేపట్టాలి తప్ప వారేదో యాచకులన్నట్లు జనం సొమ్ముతో తాత్కాలిక పందేరాలు చేయటం తగదు. చీరలు ఒకసారి ఫ్రీగా ఇస్తే తర్వాత కొనుగోళ్లు పెరిగే అవకాశాలు కూడా లేవు. నేత చీరల గురించి కొత్తగా మనం ప్రజలకు చెప్పనక్కర్లేదు. మనిషి ఆలోచనాతీరును, డిమాండ్-సప్లయ్ ఫార్ములాను కట్టడిచేయడం ప్రపంచంలో ఇంతవరకూ ఎవరికీ సాధ్యం కాలేదు. ప్రజలకు, సమాజానికి మేలు చేసేలా వాటిని నియంత్రించే పరిస్థితుల్ని సృష్టించటమే సరైన సేవా నాయకులు చేయాల్సిన పని. ఇలా పండుగలకు కానుకల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న జాడ్యం ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఆనవాయితీగా మారిపోయింది. చంద్రన్న కానుకలు వంటివి తొలగించి ప్రజలకు ఆరోగ్యం, ఇతర కనీస సేవలు అందించటం మీద ప్రభుత్వం దృష్టి పెట్టకపోతే మున్ముందు మూల్యం ఇంకా పెరుగుతుంది. ఏపీలో పెద్దఎత్తున ఎన్నికల రాజకీయ కలాపాలకు సన్నద్ధమవుతున్న ఓ యువనాయకుడు "ప్రజల కంటే నాయకుడు నాలుగడుగులు ముందుండాలి. వంద అడుగులు ముందుంటే ప్రజలు అందుకోలేరు" అన్నట్టు ఇటీవల ఓ పత్రికలో కథనం వచ్చింది. నాలుగడుగులా, వందడుగులా అనేది ముఖ్యం కాదు.. ప్రజలు ఎంత దూరం నడవగలరో అంత ముందుండి నడిపించేవాడే నిజమైన నాయకుడు! ప్రజలు మంచి విద్య, ఆరోగ్యం, ఉపాధి, స్థానిక సాధికారత, అవినీతిలేని ప్రభుత్వ సేవలు వంటి ఎజెండాకు సంతోషంగా మద్దతిచ్చి కలిసి నడుస్తారనటంలో సందేహం లేదు. ప్రజల్లో మంచి పట్ల సానుకూలతే లేకుంటే.. ప్రజల్లోనే ఉన్నారనుకునేవాళ్లు ఎన్నికల్లో కోట్ల రూపాయల డబ్బు, మద్యం వెదజల్లుతూ కులం, మతం రెచ్చగొట్టటమెందుకు? ఇక ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యాటకులను ఆకర్షించేలా పండుగల్ని జరుపుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈసురోమంటూ ఇతరుల కాసుల కోసం చేసుకునే పండుగలు మన పేదరికాన్ని, అనారోగ్యాన్ని విదేశీ తెరల మీద ప్రదర్శించి కలెక్షన్లు రాబట్టుకునే బాలీవుడ్ సినిమాల్లాగానే ఉంటాయి తప్ప నిజమైన పండుగల్లా ఉంటాయా ప్రధానీ? ఆరోగ్య సేవలు వంటివి అందించే దొంగ బాబాలకు కోట్లమంది అనుచరులుండటం ప్రభుత్వాల వైఫల్యం కాదా? ఆరోగ్య సేవల కోసం జేబుల్లో నుంచి డబ్బు ఖర్చు చేయటం తెలుగు రాష్ట్రాల్లో, దేశంలో పేదరికానికి పెద్ద కారణాల్లో ఒకటిగా ఉంది. గ్రామీణ, పట్టణ తేడా లేకుండా దేశ జనాభాలో 7శాతం మంది ఆరోగ్య ఖర్చుల కోసం ఏటా అప్పులపాలవుతున్నారు. జిల్లా స్థాయి ఆసుపత్రుల్ని ఆధునీకరించటంతోనే సమస్య తీరదు. తమిళనాడులోని సీఎంసీలాంటి నాణ్యమైన స్పెషాలిటీ ఆసుపత్రిలో కూడా ఫలితాలు 50శాతం లోపే ఉంటున్నాయి. వైద్యానికి ప్రాథమిక స్థాయి, నిరోధం చాలా కీలకాంశాలు. నచ్చిన ఫ్యామిలీ డాక్టర్‌ను ఎంపిక చేసుకునే అవకాశాన్ని ప్రజలకే కల్పిస్తూ దేశ ఆదాయంలో రెండు శాతం ఖర్చుతోనే ప్రజల జేబుల్లో నుంచి రూపాయి ఖర్చు లేకుండా 'అందరికీ ఆరోగ్యం' ఎలా అందించవచ్చో లోక్‌సత్తా ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి అందించింది. అలాగే ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు వైద్యులు-రోగుల మధ్య ఉండాల్సిన విశ్వసనీయతను పెంచేందుకు, కేంద్ర క్లినికల్ ప్రాక్టీస్ చట్టంలోని లోపాల్ని సరిచేసేందుకు కూడా లోక్‌సత్తా కృషి చేస్తోంది. ఇలా ప్రతి ఇంటికీ ఓ డాక్టర్ పర్యవేక్షణని, ఉచితంగా జెనిరిక్ మందుల్ని రాష్ట్ర, కేంద్ర పాలకులు అందుబాటులోకి తెస్తేనే ప్రజలకు నిజమైన పండుగ సంబరాల్ని అందివ్వగలుగుతారు.

# సెప్టెంబర్ 15న విశాఖ నుంచి 'జనహితం కోసం జేపీ సురాజ్య యాత్ర' ప్రారంభం



అప్పులపాలై చితికిపోతున్న చిన్నరైతులారా..
గుర్తింపే లేని కౌలురైతులారా...
నెక్ట్స్ ఏంటో తెలియని విద్యార్థులారా..
నిరాశలో ఉన్న నిరుద్యోగులారా..
ఎదిగే అవకాశాల్లేని బీసీల్లారా, దళితులారా..
దిగువకు, ఎగువకు మధ్య నలిగిపోతున్న మధ్యతరగతి ప్రజలారా...

**మీ సమస్యలు, మీ అభిప్రాయాలు, మీ సూచనలు**
**వినడానికి పార్టీలకతీతంగా వస్తున్నాం .. చెప్పడానికి రండి..**

**విని ఏం చేస్తాం?**

విద్య, ఆరోగ్యం, నిరుద్యోగం,
కులవివక్ష, రిజర్వేషన్ల ఘర్షణ,
స్థానిక అధికారాలు లేకపోవడం,
లంచాలు, మహిళలపై వేధింపులు,
అప్పుల వ్యవసాయం...
ఏ ప్రభుత్వమున్నా దశాబ్దాలుగా చేసిన నిర్లక్ష్యం వల్ల
ఇలా కొనసాగుతున్న మన మౌలిక సమస్యలను శోధిద్దాం..
అందరికీ ఆమోదయోగ్యమైన, తేలిగ్గా అమలుచేయగలిగిన
పరిష్కారాల్ని నిగ్గుతేలుద్దాం..
వాటిని ప్రభుత్వాల దృష్టికి తీసుకెళదాం..
సమస్యల పరిష్కారం కోసం కలిసి ఉద్యమిద్దాం
మార్పును సాధిద్దాం...

**మన సమస్యల పరిష్కారం కోసం ఒక్కటిగా కదులుదాం**
**జనహితం కోసం లోక్‌సత్తా జేపీ చేస్తున్న ఈ సురాజ్య యాత్రలో పాల్గొందాం...**

(ఏ పార్టీ అధికారంలో ఉన్నా అమలు చేయాల్సిన, ఆచరణసాధ్యమైన కనీస మౌలికాంశాలను జనం భాగస్వామ్యంతో సాధించేందుకు జేపీ సెప్టెంబర్ 15న విశాఖపట్నంలో 'జనహితం కోసం జేపీ సురాజ్య యాత్ర'ను ప్రారంభించారు. జేపీ సురాజ్య యాత్ర నాలుగు రోజుల పాటు విశాఖ జిల్లాలో కొనసాగుతుంది. సెప్టెంబర్ 19 నుంచి తూర్పు గోదావరి జిల్లాలో ఐదు రోజులపాటు జరుగుతుంది. దసరా సెలవల అనంతరం తిరిగి అక్టోబర్ మొదటివారంలో మరో జిల్లాలో యాత్ర ప్రారంభమవుతుంది. ఇలా 100 రోజులపాటు దశలవారీగా ఆంధ్రప్రదేశ్‌లో, ఆ తర్వాత తెలంగాణలో జనహితం కోసం జేపీ సురాజ్య యాత్ర యువత, రైతులు, మహిళలు, ముఖ్యంగా బడుగు బలహీన వర్గాలతో మమేకమవుతూ కొనసాగుతుంది). ❖

# మీ జనచైతన్య యాత్రలో మద్యంపై గళం విప్పండి

## - జేపీకి ఓ జన సామాన్యుడి లేఖ -

**గౌరవనీయులైన జయప్రకాష్ నారాయణ్ గారికి,**

**అనేక హృదయపూర్వక ప్రణామాలతో ఒక జన సామాన్యుడు సి.హెచ్ సింహాచలం రాయునది.**

**ఆర్యా!**

సమాజ శ్రేయస్సుకు, సాటి మానవుని సౌభాగ్యానికి, దేశ ప్రగతికి మీరు పడే తపన.. మీ బంగారు భవిష్యత్తునూ, ఉన్నతాధికారాన్నీ, సుఖసౌఖ్యాలనూ తృణప్రాయంగా త్యాగం చేసి లోక్‌సత్తా రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభించినపుడే అందరికీ అర్థం అయినది. మీ ఆశయాలు, అభిప్రాయాలు చాలామందిని ప్రభావితం చేస్తున్నాయి. ప్రలోభాలకు లోనై, మీ ధర్మపథంలో కొంతమంది పయనించలేక పోతున్నారు. కానీ, మీరంటే, మీ మార్గమంటే చాలా గౌరవం, ఆరాధనా భావాలు నెలకొని ఉన్నాయి. అందుకే మీ మాట మంత్రంగా పనిచేస్తుందనేది మా విశ్వాసం. అందుకే మద్యం మహమ్మారిపై వ్యాసాన్ని మీకు పంపుతున్నాను.

వర్తమానంలో 'మద్యం' తెలుగు రాష్ట్రాల్లో ఒక వైరస్‌లా ప్రబలి ఎన్నో జీవితాలను, కుటుంబాలను బలిగొంటున్నది. జనాలు, ప్రభుత్వాలు "తన-ధన" మత్తుకు గురై తలో సమిధను ఆ మంటలో వేసి ప్రజ్వలింపచేస్తున్నారు. ఆ అగ్నిప్రమాదాన్ని ప్రమోదంగా పరికిస్తున్నారు. వినియోగదారుడు.. ఎంతటి మత్తును పొందుతున్నానని మోదమందుతున్నాడేగానీ తన జేబుకు ఎంత చిల్లుపడిందని పట్టించుకోవడం లేదు. ప్రభుత్వాలు.. ఎంతటి ఆదాయం 'సులువుగా' వస్తోందని అనుకుంటున్నాయేగానీ, సమాజాన్ని ఎంత దిగజారుస్తున్నాం, సంఘ శ్రేయస్సును ఎంత ప్రమాదంలోకి నెడుతున్నాం అని ఆలోచించటం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో మీలాంటి మార్గదర్శకులు ద్వారా మద్యానికి వ్యతిరేకంగా ఓ ఉద్యమం రావాలి. హేతుబద్ధ వాదనలతో, సాక్ష్యాధారాలతో ప్రజలకు అర్థమయ్యేలా మీరు చేసే ఉద్యమం మొదట్లో మందగమనంలో ఉన్నా, క్రమంగా పుంజుకుని కొంతకాలానికి అంతటికీ విస్తరిస్తుందనటంలో సందేహం లేదు.

రాజ్యాంగంలో పొందుపరిచిన శ్రేయోరాజ్యమంటే ప్రజలను మత్తుమందులకు అలవాటు చేసి, ఆలోచనాశక్తిని క్షీణింపచేయటం కాదు. విచ్చలవిడి మద్యం వల్ల ఇటీవల మాదక ద్రవ్యాల వినియోగం కూడా పెరిగిపోతోంది. ఈ చెడును అంచెలవారీగానైనా శుద్ధి చేసి సమాజానికి స్వస్థత చేకూర్చడం అవసరం. ఇందుకు మీలాంటి సద్భావకుల నాయకత్వం, అండదండలు, ప్రాతినిధ్యం ఎంతైనా అవసరం. ఇట్టి సంకల్పానికి, ఇట్టి సముచిత, సమున్నత యజ్ఞానికి కర్తృత్వం వహించాలని సవినయంగా హృదయపూర్వకంగా ప్రార్థిస్తున్నాను.

తమ జీవితాల్ని మెరుగుపరిచే మంచి రాజకీయం, పాలన, ఇతర సంస్కరణలపై జన చైతన్యాన్ని పెంచేందుకు మీరు తెలుగు రాష్ట్రాల్లో చేపడుతున్న 100 రోజుల ప్రచారయాత్రలో ఇందుకు నాంది పలకాలని, ప్రభుత్వాల మద్యం విధానాలకు వ్యతిరేకంగా కూడా గళం విప్పాలని, ప్రజలను సమీకరించాలని కోరుతూ ఈ వ్యాసం ద్వారా నా ఆలోచనలను మీ దృష్టికి తెస్తున్నాను..

# మద్యం మహమ్మారి

**- సి.హెచ్ సింహాచలం,**
**శ్రీకాకుళం**

మన సమాజంలో 'మద్యం' అన్ని తరగతుల ప్రజలనూ బహుగా పీడిస్తున్నది. బడాబాబులు, ఛోటాబాబులు, రాజకీయవాదులు, అరాచకశక్తులు, రిక్షావాలాలు, మోటారువాలాలు, ఉద్యోగులు, నిరుద్యోగులు, కర్షకులు, కార్మికులు, విద్యావంతులు, నిరక్షరాస్యులు, పూటకూలీలు, డాక్టర్లు, యాక్టర్లు, న్యాయవాదులు, ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు, ఆఖరికి స్త్రీలు, పిల్లలుకూడా ఈ వరసన చేరిపోతున్నారు. పైస్థాయిలో వారి గురించి, వైద్య అవసరంగా తీసుకునేవారి గురించి మనం ఆందోళన చెందాల్సిన పనిలేకపోయినా.. కింది, మధ్యతరగతి కుటుంబాలను మద్యం ఇంకా హీనస్థితికి

దిగజారుస్తున్న తీరు, మాదక ద్రవ్యాల వైపు కూడా మళ్లిస్తున్న తీరు, నేరాలు, ప్రమాదాలకు కారణమవుతున్న వైనం గురించి మాత్రం తీవ్రంగా పట్టించుకోవాల్సి ఉంది.



మద్యం దుర్వ్యసనానికి లోనైన సామాన్యుల్లో పలువురు, చోర, జార, హంతక మొదలైన దుర్గుణాలకు లంగిపోతున్నారు. కుటుంబంలోనూ, సమాజంలోనూ గుర్తింపును కోల్పోయి హీనస్థితికి దిగజారుతున్నారు. పరువు, ప్రతిష్ట, పరపతి, వంశగౌరవం, ఆత్మాభిమానం, విచక్షణ, జ్ఞానం మంటగలుస్తున్నాయి. కొన్ని సమయాల్లో ఆ మత్తులో ప్రాణాలు కోల్పోయిన దౌర్భాగ్యుల సంఖ్యా తక్కువేం కాదు! ఇవి మన కళ్ల ముందు రోజూ కనిపిస్తున్న నగ్న సత్యాలు. ఇలాంటి దయనీయ చిత్రాలు తెలుగునాట ప్రతీ పల్లెలోను, పట్టణంలోనూ చోటు చేసుకుంటున్నాయి. వాటిని అక్షరాలుగా మలిస్తే, ఒక్కో గ్రామానికి ఒక్కో గ్రంథం తయారవుతుంది. ఒకే ఒక్క దిక్కును కోల్పోయిన ముదిమి ముదిరిన ముదుసళ్లు ఎందరో! నల్లపూసల సౌరు గంగలో కలిసిపోయిన లేత ఇల్లాళ్లెందరో! అన్ని అతనే అనుకుంటూ సర్వస్వాన్ని కోల్పోయిన దౌర్భాగ్యులెందరో! నాన్న ఆధారంగా పెద్ద చదువులు చదివి ఉన్నత శిఖరాలు చేరి నాన్నకు, కుటుంబానికి బాసటగా ఉంటాననుకున్న ఆశలు అడియాసలైన చిన్నారులెందరో!

ఒకరిని వేరొకరు ఏ కారణాంతరానైనా కొట్టినా, తిట్టినా, హత్య చేసినా గొడవ జరుగుతుంది. హాని జరిగినవారు పోలీసు రిపోర్టు ఇస్తారు. కోర్టులనాశ్రయిస్తారు. హానికారకులను లేదా హంతకులను తగు విధముగా శిక్షించేలా చేయటానికి ప్రయత్నిస్తారు. మద్య రాక్షసుడు ఎన్నో హత్యలు గావిస్తున్నాడు. ఎన్నో అరాచకాలను సృష్టిస్తున్నాడు. ఎవ్వరూ వాణ్ణి శిక్షించడం లేదే? చివరకు ప్రభుత్వాలూ ఏమీ చేయలేక పోతున్నాయి. గూండాలు వెదజల్లిన డబ్బుతో తృప్తి పడుతూ అందరూ ఆనందిస్తున్నారు. వాణ్ణి విచ్చలవిడిగా విడిచిపెట్టేస్తున్నారు. వాడు విర్రవీగి వీరంగం సృష్టిస్తున్నాడు. ఎన్నో కుటుంబాలను కూలదోస్తున్నాడు. అందరూ వినోదభరితంగా తిలకిస్తున్నారు. బాధకు గురైనవారు కుంగిపోతున్నారు. చావుకు దరిలోనున్న శల్యరోగుల్లా ఏమీ చేయలేక, చెప్పుకునే దిక్కేలేక విలపిస్తున్నారు. ఏమిటీ దౌర్భాగ్యం? రేపు ఎలా ఉంటుందో! ఇదే తీరు కొనసాగితే అధోగతేనన్నది సుస్పష్టం. ఇంకా నిద్రలేవదా ప్రపంచం? వాతావరణ కాలుష్యం, శబ్ద కాలుష్యం గురించి ఆలోచిస్తున్నాము. మన శరీరంలో, మన ఇంట్లో, మన పరిసరాల్లో మద్యం కాలుష్యం గురించి పట్టించుకోరేమి?

## పర్యవసానం?

పర్యవసానంలోని మొదటి దశను ప్రపంచం చూస్తోంది. దొంగతనాలు, దౌర్జన్యాలు, మోసాలు, హత్యలు, మహిళలపై దాడులు, అత్యాచారాలు, ఇంట్లో పిల్లలపై దుష్ప్రభావాలు, వీధివీధినా ప్రజల వద్దకు మద్యం దుకాణాలు రావడం వెల్లివిరుస్తున్నాయి. ఇప్పటికే ప్రతీ పార్టీలో మందు, విందు అనివార్యమైన ఫ్యాషన్‌గా తయారయ్యాయి. ఒకప్పుడు ఇంటికి వచ్చిన అతిథికి మంచితీర్థం, మజ్జిగతో ఆతిథ్యమిచ్చిన పల్లెల్లో ఇప్పుడు మద్యం ఇవ్వటం మొదలైంది. కుటుంబ వాతావరణం కలుషితమవుతుండటం పిల్లల మనసులపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. సరైన వైద్యాన్ని, ఆరోగ్యాన్ని అందుబాటులోకి తేవటం చేతకాని పాలకులు మద్యం జీవనశైలిని జనం మీద రుద్దుతూ, ఉన్న అనారోగ్యాల్ని ఇంకా పెంచుతూ జేబులకు చిల్లు పెడుతున్నారు.

## నేరప్రవృత్తి కారకం!

జరిగిన నేరాల్ని విశ్లేషించగా, మద్యపానం చేసినవారే ఎక్కువ హత్యలు చేశారు, దొంగతనాలకు పాల్పడ్డారు, వాహన ప్రమాదాలకు కారకులయ్యారు, కలహాలకు చోదకులయ్యారు, మానభంగాలు చేశారు, దురుసుగా వ్యవహరించారు, కొట్లాడారు, పోట్లాడారు. తాగుడు వ్యసనానికి గురైనవారిలో చాలామంది విచక్షణను కోల్పోతారని, అరచేతిలో సెల్‌ఫోన్ యుగంలో అది నేరసంస్కృతికి దారితీసే ప్రమాదకర ధోరణి అని ఇంగితజ్ఞానంతో ఆలోచిస్తే ఇట్టే అర్థమవుతుంది.

కొంతమంది నాటుసారా, అక్రమ మద్యం బారినపడి మృత్యువాత పడుతున్నారు. కొంతమంది వారు సేవించిన మందులోకి కిక్ సరిపోలేదని చీడమందుల్లాంటివి కలుపుకుని మరణిస్తున్నారు.

**విచ్చలవిడితనానికి ఆమోదం**

నిషేధం స్థాయిలో మద్యాన్ని కఠినంగా నియంత్రించాల్సిన ప్రభుత్వాలు అబ్కారీ ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకుని 'మద్యపానాన్ని' విచ్చలవిడిగా ప్రోత్సహిస్తూ దాని అభివృద్ధికి ఇతోధికంగా దోహదపడుతున్నాయి. మద్యం ఎక్కడబడితే అక్కడ అందుబాటులోకి రావడం వల్ల ఎంతోమంది పెద్దలేకాక యువత, పిల్లలు సైతం ఏదో హోటల్‌కి వెళ్లి కాఫీ, టీలు సేవించినట్టు నిర్భయంగా, నిస్సంకోచంగా మద్యాన్ని సేవిస్తున్నారు. బాటిళ్లను ఇంటికి కూడా తెచ్చుకుని స్త్రీలతో పంచుకుంటున్నారు. మద్యం, మాదక ద్రవ్యాల అలవాట్లు పురుషుల మీద కంటే స్త్రీలపై వేగంగా దుష్ప్రభావం చూపిస్తాయన్న విశ్లేషణ గురించి వారిలో చాలామంది వినికూడా ఉండరు. మానసికంగా శక్తిని, విచక్షణను కోల్పోవటం నవనాగరికతకు చిహ్నమనుకోవటం ప్రతి భారతీయుడూ సిగ్గుపడాల్సిన విషయం.

ఎంతోమంది సంపాదనను ఇంటికి ఇవ్వకుండా.. 'సరుకు' కొనుగోలుకు, అందునిమిత్తం చేసిన అప్పులు (అధర్మ వడ్డీలతో) తీర్చడానికి వినియోగిస్తున్నారు. ఇంటి వద్ద పిల్లలు, ఇతర కుటుంబసభ్యులు చాలీచాలని ఆహారంతోనో, బట్టలతోనో, స్థితితోనో, వస్తులతోనో బాధపడుతున్నా తాగుడు కనికరించనివ్వదు.

"ఎన్ని బుద్ధులు చెప్పినా, ఎంత బతిమిలాడినా వినలేదు. చివరకు అర్థంతరంగా అందర్నీ విడిచి వెళ్లిపోయాడు" అని విలపించే తల్లిదండ్రులు, పెద్దలు, శ్రేయోభిలాషులకు ఈ ప్రభుత్వాలు ఏం సమాధానం చెబుతాయి? మందుదాసులు మరణించినపుడు లభించిన ఆర్థిక సహాయాన్ని అందుకొని "జీవించి ఉండగా చాలీచాలని స్థితిలో బతుకుభారంగా గడిచింది. అతను పోయాక అందరం కడుపు నిండా తింటున్నాము" అనుకునే కుటుంబాలు చాలా ఉన్నాయంటే, మనం భారతీయతకు, ధర్మానికి ఎలాంటి సందేశాన్ని ఇస్తున్నాం?

**సామాజిక సమస్యలు**

మందు బారిన పడ్డ అమీరులు గరీబులైన ఘటనలు కొన్నయితే, అధోగతికి చేరిన కిందివర్గాలవారు ఎందరో! "తాగుబోతు మామ వల్లే కుటుంబ పరిస్థితి దిగజారిందని కోడలంటే, తాగుబోతు కొడుకు వల్లే పరువూ, ప్రతిష్ఠ, గౌరవం గంగలో కలిసిపోయాయని తల్లిదండ్రులు, కొంతమంది.. ఫలితం అభిప్రాయభేదాలు, తగవులు, తంటాలు, సిగపట్లు, కొట్లాటలు, కుటుంబాలు విచ్ఛిన్నమయి వీధిపాలు కావడం, చిన్నచూపునకు గురికావడం. అప్పులతో, ఆకలితో, రుగ్మతలతో అలమటిస్తున్నవారు అనేకమంది.

**మనదేశంలో మందు అవసరమా?**

అత్యల్ప ఉష్ణోగ్రత గల దేశాల్లో, ప్రదేశాల్లో ఆరోగ్యరీత్యా శరీరంలో, నిర్ణీత ఉష్ణోగ్రతను కాపాడుకోవడానికి ఈ మందు అవసరమంటారు అక్కడివారు. డాక్టర్లు మాత్రం దీనితో పూర్తిగా ఏకీభవించరనుకోండి. కానీ మనదేశంలో అంత చర్చ కూడా అక్కర్లా. హిమవత్పర్వత ప్రాంతం తప్పించి మనది ఉష్ణదేశం. దక్షిణాది ఇంకా ఉష్ణం. ఉష్ణవాసులకు మద్యం విషం. కాబట్టి భారతీయులకు సాధారణ ఆరోగ్య పరిస్థితుల్లో ఇది అవసరం కాదు.

మద్యం భారతీయతలోని సత్సంప్రదాయాలను తుంగలో తొక్కే మహమ్మారి. ఇది చెట్టును చెరిచే చీడపురుగులాంటిది. మనిషి ఆరోగ్యాన్ని చెరిపే విషం. అందుకే 'తాగుడు ఆరోగ్యానికి చేటు' అని మందు సీను ప్రసారం చేసేటప్పుడు సినిమాల్లో హెచ్చరిక చూస్తుంటాము. 'పొగతాగుట ఆరోగ్యానికి చేటు' అని కూడా ప్రచారం చేస్తారు. అది సరిపోదు. ఆరోగ్యానికి హానికరమని ప్రభుత్వం, సమాజం చెప్పే వాటిని కఠినంగా నియంత్రించకపోతే ధర్మబద్ధం కాదు.

**ఆరోగ్య నష్టాలు**

అందరికీ అర్థమయ్యేలా చెప్పాలంటే ఈ మందు సేవించడం వల్ల నరాల్లో ఉత్తేజం కలుగుతుంది. ఈ మందు ఉత్ప్రేరకంలా పనిచేయటంతో ఉత్తేజం పొందిన నరాలు నిర్ణీత వ్యవధికన్నా ముందే బలహీనమవుతాయి. ఎలా అంటే- బల్బులోని ఫిలమెంటుపై నిర్ణీతమైన విద్యుత్తుకన్నా అధికంగా ప్రసరింపజేస్తే ఎక్కువ వెలుగునిచ్చి తన అధిక జీవనాన్ని (లాంగివిటీ)ని కోల్పోయి త్వరలో కాలిపోయినట్టు! మద్యసేవనం వలన కూడా అలాగే నరాల వ్యవస్థ ముందుగా (ప్రిమెచ్యూర్‌గా) దెబ్బతింటుంది. పర్యవసానంగా హై బీపీ ద్వారా అవయవాలు చచ్చుబడి పక్షవాతం రావచ్చు. రకరకాలైన ఇతర జబ్బులు రావచ్చు. చివరకు ప్రాణాలు పోవచ్చు. ఎన్ని ప్రాణాలు హారతి కర్పూరంలా గాలిలో కలసిపోతున్నాయో వినలేదా? కనలేదా? ఇన్ని తెలుసుకొని కోరుండి ఈ అనర్థాలను కొనితెచ్చుకోవడం ఇంగితమా?

## భారతీయ సంస్కృతి

బ్రిటిషర్ల పాలనలో భారతీయులు తీవ్ర ఆత్మన్యూనతకు లోనై బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నప్పుడు స్వామి వివేకానంద ఆత్మవిశ్వాసాన్ని పెంచాడు. కేవలం భారతీయుల 5,000ఏళ్ల సంస్కృతీసంప్రదాయాలను గుర్తుచేయటం ద్వారానే ప్రజల ధైర్యాన్ని ఆయన జాగృతం చేశాడు. భారతీయతలో అంతా మంచి ఉందన్న మూర్ఖత్వం అక్కర్లేదుగానీ, చాలా మంచి ఉంది. అలాంటి గర్వించదగ్గ భారతీయ సంస్కృతిని మన మద్యపాన వ్యసనం నిలబెడుతుందా? దిగజారుస్తుందా? ఆత్మవిమర్శ అవసరం. అత్యవసరం!

ఇది..

సదాచారమా?.. కాదు. దురాచారం

సద్గుణమా?.. కాదు. దుర్గుణం

ఆరోగ్యప్రదమా?.. కాదు. రోగకారకం

ఆనందప్రదమా?.. కాదు. భ్రమకారకం

కీర్తిదాయకమా?.. కాదు, అపకీర్తిదాయకం

సంప్రదాయమా?.. కాదు, దుస్సంప్రదాయం

శ్రేయస్కరమా?.. కానే కాదు

సోషల్ స్టేటస్‌ను పెంచుతుందా?.. నీచంగా చూసే పరిస్థితి వస్తుంది

మైత్రిని పెంచుతుందా?.. శత్రువుల్ని పెంచుతుంది

సంపదను, సంపాదనను పెంచుతుందా?.. లేదు, రెండూ తరుగుతాయి

ఐశ్వర్యం పెంచుతుందా?.. ఇల్లూ ఒళ్లూ గుల్లవుతాయి

కుటుంబీకులు, ఆత్మీయులు హర్షిస్తారా?.. అంతా అసహ్యించుకోవటం మొదలుపెడతారు

మద్యపానం సప్తవ్యసనాల్లో ఒకటి. కానీ అన్నిటికీ ఇది తోడు. ఇది అరిషడ్వర్గాల్ని ఆహ్వానిస్తుంది. మనిషి పతనానికి కారకమవుతుంది.

ప్రభుత్వానికి ఇంతకంటే ఆదాయవనరులు లేవా?

ప్రభుత్వాలకు కొన్ని వేలకోట్ల ఆదాయాన్నిచ్చే వనరు మద్యం కావచ్చు. ఈ డబ్బుతో ఎన్నో ప్రగతి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పుకోవచ్చు. కానీ ఆ సంక్షేమం మొత్తాన్నీ తినేస్తున్న మహమ్మారి మద్యం అన్న వాస్తవాన్ని ఎన్నాళ్లు తొక్కిపట్టగలరు? డబ్బు వస్తుంది గదా అని ఎన్ని వ్యసనాల్ని చట్టబద్ధం చేస్తూ పోతారు? ఆదాయాన్ని పెంచుకోవటానికి ప్రజలకు సక్రమంగా సేవలు అందించి పన్నులను విస్తరించుకునే సత్తా చూపండి. దుబారాలను, ఆర్భాటపు ప్రచారాల్ని తగ్గించుకుని పొదుపు చేయండి. అధికారాన్ని వికేంద్రీకరించి ప్రజలకు కూడా వాస్తవ వనరుల గురించి తెలియచేయండి. 'పరిమిత వనరులతో అపరిమిత అవసరాలను తీర్చటమే అసలైన రాజకీయం' అని లోక్‌సత్తా తొలి నుంచీ చెబుతోంది. ప్రభుత్వం ఇదే తీరును కొనసాగిస్తే మద్యనియంత్రణకు బదులు, మద్యప్రోత్సాహ విధానంలోనే సాగితే.. తాగనివారు కూడా తాగకపోవటం తప్పేమో అని భ్రమపడే దుస్థితి ఏర్పడుతుంది. మందు మంచినీటికి ప్రత్యామ్నాయంలా తయారవుతుంది. తాగుడు తప్పయితే ప్రభుత్వం ఎందుకు ప్రోత్సహిస్తోంది? అని తాగుబోతులు అడిగే ప్రశ్న ప్రభుత్వానికి చెంపపెట్టు కావాలి.

ఆర్థిక శాస్త్ర ప్రకారం అందుబాటులో ఉన్న వస్తువు వినియోగం హెచ్చుగా ఉంటుంది. పైగా మద్యానికి డిమాండ్ ఎక్కువ. ప్రభుత్వ ఆంక్షలు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో మద్యం వినియోగం వేగంగా విస్తరిస్తోంది. పంటలకు, వస్తువులకు కొరత, సీజన్లు ఉంటాయి. వీటిని నిల్వ చేసుకుని మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకోవడానికి గిడ్డంగులు, ప్రాసెసింగ్ చేయటానికి పరిశ్రమలు ఏర్పాటు చేయటం చేతగాని పాలకులు మద్యం విషయంలో మాత్రం ఎనీ టైం, ఎనీ వేర్‌కు పక్కా ఏర్పాట్లు చేశారు. ముమ్ముందు గాలి, నీరు కరవవుతాయోమేగానీ మద్యానికి మాత్రం కొరవుండదనేలా (అ)వ్యవస్థను నిర్మించారు.

మద్యం వల్ల కలుగుతున్న ప్రతి నష్టానికీ ప్రభుత్వాలే బాధ్యత వహించాలి.

ప్రభుత్వాలు మద్యాన్ని అందుబాటులో లేకుండా చేసే విధానాన్ని తూ.చ తప్పకుండా అమలు చేయాలి. ఆదాయాన్ని మాత్రమే దృష్టిలో పెట్టుకోకుండా అంతకన్నా విలువైన ప్రజారోగ్యాన్ని, సంక్షేమాన్ని, భావితరాల పట్ల బాధ్యతను దృష్టిలో పెట్టుకోవాలి. ప్రాధాన్యతల్ని ఆ రకంగా మలచుకోవాలి. తరతరాలు భారతీయ సంస్కృతీసంప్రదాయాలలోని మంచిని పరిరక్షించాలి. ఆదాయం సులభంగా వస్తుందని మందుబాబుల మానసిక దౌర్బల్యాన్ని సొమ్ము చేసుకోవడం ప్రభుత్వాలు చేయాల్సిన పనికాదు. వ్యక్తులైనా, సంస్థలైనా, చివరకు ప్రభుత్వమైనా 'సంపాదన' ధర్మబద్ధంగా ఉంటే సుఖసౌఖ్యాలు వెల్లివిరుస్తాయి. అధర్మంగా వ్యవహరిస్తే మనల్ని ధర్మం ఎలా రక్షిస్తుంది?.. శిక్షిస్తుంది! కర్మ సిద్ధాంతం ప్రకారం చూసుకున్నా, మనం సత్కర్మలు ఆచరిస్తేనే సత్ఫలితాల్ని పొందగలం. దుష్కర్మలకు అనుభవించకతప్పదు. మనం పొందుతున్న ఒడిదుడుకులకు, అశాంతి, అలజడులకు ఇటువంటి

'నివారించదగ్గ' అధర్మాలే కారణాంతరాలు.

శ్రేయోరాజ్యం- రాజ్యాంగపు ముఖ్యాశయం. మద్యాన్ని విస్తరించడం వల్ల ఆ ఆశయసిద్ధి లభిస్తుందా?

ఈ వ్యాపారం మీద ఆధారపడ్డవారి సంగతేంటి?

బెల్టుషాపులు, ఇతర అక్రమ వ్యాపారం మీద ఆధారపడి కొన్ని వేలమంది బతుకుతున్నారు. ప్రజలకు చదువు, ఉపాధి కల్పించే అలవాటు పాలకులకు లేదు గదా! మద్యాన్ని అందుబాటులో లేకుండా చేసే విధానాన్ని అమలుచేస్తే, వీరి పరిస్థితి ఏమిటన్న ప్రశ్న వస్తుంది. వారు వేరే వృత్తుల్లో ఉపాధి పొందేలా ప్రభుత్వమే తగిన సహాయసహకారాలను అందించాలి. అలాగే మద్యానికి అలవాటుపడ్డవారిని ఆ వ్యసనం నుంచి విముక్తి చేయడానికి డీ ఎడిక్షన్ కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో చేపట్టాలి. మత్తుపానీయాల్లో గో మూత్రాన్ని కలిపి తాగితే మద్యంపై కోరిక నెమ్మదిగా తగ్గుతుందట. ఆయుర్వేద పండిత ఏల్చూరిగారు ఇంకొన్ని చిట్కాలు చెప్పారు. మనసు మద్యంపై మరలినపుడు కొంచెం వాము అర్కం తాగితే క్రమంగా దురలవాటుకు దూరమవుతారట. వేప చెక్క కషాయాన్నిగానీ లేదా 2 చెంచాల నువ్వుల నూనెనుగానీ ఉదయాన్నే 10 నిముషాలు పుక్కిలించి ఉమ్మి వేయాలట. ఉల్లిగడ్డలను నిమ్మరసంతో రెండు పూటలా అన్నంతో తీసుకుంటే లోపలి మలినాలు బైటికిపోతాయట. అతిమధురం ముక్కలను బుగ్గన పెట్టుకుని ఆ రసాన్ని నెమ్మదిగా ఆస్వాదిస్తే నోరు సుగంధ పరిమళమై తాగుడు, గుట్కాలకు నెమ్మదిగా దూరం కావచ్చుట. ఇలా ఒక మండలం పాటిస్తే గుణం బాగా కనిపిస్తుంది. మంచినీటిని ఎక్కువగా.. సుమారు రోజుకు 5-6లీటర్ల చొప్పున తరచూ తీసుకుంటే మందు నుంచి మనసు మరలుతుందని ఓ ప్రకృతి వైద్యుని సలహా. ఇది ఎంతమాత్రం ఖర్చు లేకుండా చేసుకోగలిగిన పని. ప్రభుత్వం ఏర్పాటు చేసే డీ ఎడిక్షన్ సెంటర్లలో ట్రీట్‌మెంట్‌తోపాటు ప్రజలు తమకుతాముగా ఇళ్లల్లో పాటించగలిగే హానిలేని చికిత్సలివి. వ్యసనం మరీ ఎక్కువైతే సైకియాట్రిస్టుల సాయం కూడా తీసుకోవచ్చు. అన్నిటికంటే ముఖ్యం ప్రభుత్వ విధానం, ప్రజల దృఢసంకల్పం విదేశాల్లోనైనా, శీతల ప్రాంతాల్లోనైనా మద్యం జోలికిపోనని శపథం చేసి ఆచరణలో చూపిన గాంధీ మనలాంటి మనిషే గదా!

ట్రాఫిక్ ఆగకుండా, వాహనాలకు అంతరాయం లేకుండా, అద్దాలు పగలకుండా, రైళ్లు, బస్సులు బంద్ కాకుండా.. నిషేధం స్థాయిలో కఠిన మద్యనియంత్రణకు ఉద్యమం జరగాలి. ఇందుకు ప్రతి ఒక్కరూ కలసిరావాలి. అన్ని సంస్థలూ, పార్టీలూ, మీడియా ఇందులో భాగస్వాములు కావాలి.


మద్యాన్ని అందుబాటులో లేకుండా చేయాలి. ఇది జనం మాట- ప్రయోజనం బాట. ❖

## 'భారత్ యాత్ర'లో పాల్గొనండి..
## చిన్నారులకు దన్నుగా నిలవండి: కైలాష్ సత్యార్థి

దేశవ్యాప్తంగా చిన్నారులపై పెరిగిపోతున్న అత్యాచారాలు, లైంగిక వేధింపులు, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా చేస్తున్న యుద్ధంలో దేశంలోని అన్ని వర్గాలనూ భాగస్వామ్యం చేయటమే అక్టోబర్ 16 వరకూ జరిగే 'భారత్ యాత్ర' లక్ష్యమని బాలల హక్కుల పరిరక్షణ ఉద్యమ నేత, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి తెలిపారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యమైన భారత్‌లో చిన్నారుల బాల్యానికి రక్షణ లేకపోవడం దురదృష్టకరమన్నారు. చిన్నారులపై అకృత్యాలకు సంబంధించి గతేడాది దేశవ్యాప్తంగా 15వేల కేసులు నమోదుకాగా, అందులో 4శాతం కేసుల్లోనే దోషులకు శిక్ష పడిందన్నారు. 90శాతం కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దేశంలో అత్యాచారాలు జరిగిన చిన్నారులకు మానసికంగా, భౌతికంగా భరోసా ఇచ్చేందుకు కనీసం పూర్తిస్థాయిలో వైద్యసదుపాయాలు కూడా లేకపోవడం దురదృష్టకరమన్నారు. భయం నుంచి స్వేచ్ఛ కోసం చేస్తున్న ఈ ప్రయత్నానికి అందరూ మద్దతివ్వాలన్నారు. చిన్నారులపై లైంగిక వేధింపుల కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవ్యవస్థను మరింత పటిష్టం చేయాలన్నారు. శ్రేయస్కర బాల్యం ద్వారానే శ్రేయస్కర భారత్ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. ఎన్నో కలలు, అవకాశాలకు ప్రతిబింబమైన హైదరాబాద్ ఈ ఉద్యమంలో పాలుపంచుకోవాలని, తెలంగాణ అతి పెద్ద భాగస్వామి కావాలని విజ్ఞప్తి చేశారు. దేశంలోని 22 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 11వేల కిలోమీటర్ల మేర భారత్ యాత్ర జరుగుతుంది. ఇందులో భాగంగా ఆయా ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల విద్యార్థులతో మమేకమై చైతన్యం నింపుతారు. హైదరాబాద్‌లో సెప్టెంబర్ 21న భారత్ యాత్ర జరగనుంది. ❖

# నిరుద్యోగ భృతే శరణ్యమంటున్న ఏపీ ప్రభుత్వం

ఉద్యోగావకాశాన్ని అందివ్వలేకపోతే తాత్కాలిక ఉపశమనంగా అందుబాటులోకి తెచ్చే ఉపాధి హామీ పథకాన్ని విస్తరించటంతోపాటు నిరుద్యోగ భృతి పేరుతో అలాంటి మరో పథకాన్ని అమలు చేయాల్సిన 'ఉపాధి సంక్షోభాన్ని' ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొంటోంది. రాష్ట్ర విభజనతో హైదరాబాద్ ఆదాయాన్ని కోల్పోయే పరిశేష ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇవ్వాలని లోక్‌సత్తా జేపీ చేసిన ప్రతిపాదనను కేంద్రంలోని ప్రధానపార్టీలైన కాంగ్రెస్, బీజేపీ ఆమోదించి 2014 ఫిబ్రవరిలో ప్రధానమంత్రే పార్లమెంటుకు హామీ ఇచ్చినా.. దాని ద్వారా యువతకు ఉద్యోగావకాశాలనిచ్చే పారిశ్రామిక రాయితీల సాధనకు నూతన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు చొరవ చూపలేదు. ఏపీకి ప్రత్యేకహోదా అంటే మిగతా రాష్ట్రాలు అభ్యంతరం చెబుతున్నాయనుకుంటే కనీసం వెనకబడిన జిల్లాలకు పారిశ్రామిక రాయితీల్ని అడగాలని, ఈ నిర్ణయాన్ని కేంద్ర మంత్రివర్గం ఒక్క కలంపోటుతో తెచ్చేయచ్చని లోక్‌సత్తా చెప్పినా వినిపించుకోలేదు (అలాగే పోలవరంపైనా ఆలస్యంగా మేలుకొన్నారు). దీంతో ఆంధ్రప్రదేశ్ వృద్ధి రేటు వేగం దేశంలోనే అగ్రస్థానంలో డబుల్ డిజిట్‌లో ఉందంటున్నా ఆ మేరకు ఉద్యోగాలు పెరగడం లేదు. ఇటీవల పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు నాలుగు వేల ఖాళీలకుగాను నాలుగు లక్షలమందికి పైగా దరఖాస్తు చేయటం ఆంధ్రప్రదేశ్‌లో విద్యాప్రమాణాల స్థాయికి, నిరుద్యోగం తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ ఉద్యోగాలకు విద్యార్హత ఇంటర్మీడియెట్ అయితే.. దరఖాస్తుదారులలో దాదాపు 40శాతం మంది డిగ్రీ, పీజీ, ఆపై చదివినవారు ఉన్నారు. బీటెక్, ఎంటెక్, ఎంసీయే చదువుకున్నవారు సైతం దరఖాస్తుదారుల్లో ఉన్నారు. ఎస్సై (సివిల్, ఏఆర్), ఆర్ఎస్సై (ఎస్ఏఆర్ సీపీఎల్/ఏపీఎస్పీ), డిప్యూటీ జైలర్, అసిస్టెంట్ మాట్రిన్ ఉద్యోగాలకు ఎంపికైనవారిలో 38.62శాతం మంది బీటెక్, ఎంటెక్, ఎంసీఏ, ఎంబీయే వంటివి చదివినవారే ఉన్నారు. 707 పోస్టుల భర్తీ కోసం ఇచ్చిన నోటిఫికేషన్‌కి 31,370మంది ఈ కోర్సులు చదివినవారు దరఖాస్తు చేసుకున్నారు. మరో 30వేల మంది పీజీ చేసినవాళ్లు పోటీపడ్డారు. మరోవైపు, దూకుడు పెంచుతున్న ప్రతిపక్ష వైకాపా గాలానికి 2019 ఎన్నికల్లో యువత చిక్కకుండా కాపాడుకోవాల్సిన పరిస్థితి. దీంతో పరిమిత సంఖ్యలో ఉంటారని, ఎలాగోలా అధికారంలోకి వస్తే అప్పుడు చూద్దామనే దాటవేత ధోరణితో 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన 'చదువుకున్న నిరుద్యోగులకు భృతి' హామీకి తెదేపా ప్రభుత్వం బూజు దులుపుతోంది. ఏదోకరకమైన ఆకర్షణీయమైన




విధానంలో భృతి చెల్లించేందుకు ప్రయత్నిస్తోంది. అక్టోబర్ నాటికి దీనిపై ఒక స్పష్టత ఇవ్వాలని భావిస్తోంది.

ఇప్పటికే 10 రాష్ట్రాల్లో నిరుద్యోగ భృతి అమలవుతుండటంతో, అక్కడ అమలు జరుగుతున్న తీరును అధ్యయనం చేసి విధాన రూపకల్పన చేయాలని చంద్రబాబు భావిస్తున్నారు. ఆ రాష్ట్రాల్లో రూ.200 నుంచి 2500 వరకు భృతి ఇస్తున్నారు. 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు ఉన్నవారికి, టెన్త్, ఇంటర్, గ్రాడ్యుయేట్, దివ్యాంగులు కేటగిరీలుగా విభజించి ఆయా ప్రభుత్వాలు చెల్లింపులు చేస్తున్నాయి. ముఖ్యంగా తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లలో విధానాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సీరియస్‌గా అధ్యయనం చేస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నిరుద్యోగ భృతి కోసం రూ.500కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. వివిధ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్‌ల్లో దాదాపు 34లక్షలమంది తమ పేర్లు రిజిస్టర్ చేసుకున్నారు. ఇందులో 12 లక్షలమంది డిగ్రీ చదివినవారు, 10.45లక్షల మంది ఇంటర్, మరో 12 లక్షలమంది పదవ తరగతి పాసైనవారు ఉన్నారు. అయితే ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన ప్రజాసాధికార సర్వే ప్రకారం 9.4లక్షలమంది చదువుకున్న నిరుద్యోగులు ఉన్నట్టు తేలింది. నిరుద్యోగుల సంఖ్యలో భారీగా తేడా ఉండటంతో చదువుకున్న నిరుద్యోగుల సంఖ్యను ముందుగా ఖరారు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. నిరుద్యోగుల సంఖ్యను ధృవీకరించాకే పథకం అమలు చేయాలని భావిస్తున్నారు. 15 నుంచి 40 సంవత్సరాల యువతకు నెలకు రూ.2000 భృతిగా ఇచ్చేందుకు ప్రతిపాదిస్తున్నారు. అయితే ఒకే శ్లాబ్‌గానా, వివిధ కేటగిరీలగానా అనే తర్జనభర్జనలు జరుగుతున్నాయి. కుటుంబంలో ఎంతమంది నిరుద్యోగులున్నప్పటికీ ఒక్కరికే భృతి ఇవ్వనున్నారు. మూడు సంవత్సరాలపాటు మాత్రమే నిరుద్యోగ భృతిని ఇచ్చి, వారికి నైపుణ్యాలు పెంచుకునేందుకు వీలుగా శిక్షణనిచ్చే అంశం కూడా పరిశీలనలో ఉంది. భృతి చెల్లిస్తున్న సమయంలో వారి సేవలను సమాజ అభివృద్ధిలో వినియోగించుకోవాలని కూడా ప్రభుత్వం భావిస్తోంది. ❖

# రైతు నుంచి దళారులు కొట్టేసిందే రూ.2,400కోట్లు

ఆంధ్రప్రదేశ్‌లో 2016-17లో వ్యవసాయోత్పత్తుల విలువ రూ.65,549 కోట్లుగా అంచనా. ఇందులో దాదాపు రూ.47,000కోట్ల విలువైన ఉత్పత్తులను మార్కెట్‌లో అమ్మారు. మార్కెటింగ్ శాఖకు వచ్చే 1శాతం సెస్ ద్వారా ఈ గణాంకాల్ని ధృవీకరించారు. ఇందులో కమీషన్ ఏజెంట్ల ద్వారా చేసే అమ్మకాలు రూ.30,000కోట్ల దాకా ఉంటాయి. ఈ లెక్కన వారికి నిబంధనల ప్రకారం రూ.900 కోట్ల కమీషన్ రావాల్సుంటుంది (పత్తి, మిరప, అపరాలు తదితర ఉత్పత్తులపై 2శాతం, కూరగాయలు, పండ్లపై 4శాతం- సగటున 3శాతం). అయితే అనధికారికంగా వాళ్లు వసూలు చేసేది రూ.1200 కోట్ల వరకూ ఉంటుంది (మిరప, ఇతర ఉత్పత్తులపై 2శాతం, కూరగాయలు, పండ్లపై 6శాతం- సగటున 4శాతం). ఇది కాకుండా 'సూట్, జాక్‌పాట్, గేటు, తారం' పేర్లతో ఇంతే మొత్తాన్ని కొట్టేస్తుంటారు. కొలతల్లో మోసాలు అదనం. ఇలా మొత్తంగా చూస్తే, ఒక ప్రముఖ పత్రిక సేకరించిన వివరాల ప్రకారం, ఒక్క ఏడాదిలోనే రూ.2,400 కోట్లు ఏపీ రైతుల నుంచి కమీషన్ ఏజెంట్లు అక్రమంగా లాగేశారు.

జాక్‌పాట్ అంటే.. తరుగు పేరుతో టమాటా వంటి వాటిని పది పెట్టెలకు ఒక పెట్టె తీసుకుంటారు. సూట్ అంటే.. టన్ను బత్తాయిని అమ్మకానికి తెస్తే క్వింటాలు చొప్పున మినహాయించుకుంటారు. రాష్ట్రంలో 324 మార్కెట్ యార్డులుండగా, 95లో అమ్మకాలు అధికంగా జరుగుతుంటాయి. మార్కెటింగ్ శాఖ ఆన్‌లైన్ విధానాన్ని అమలుచేయకుండా కమీషన్ ఏజెంట్లకే పెద్దపీట వేస్తుండటంతో అరకొరగా వస్తున్న ధరల విషయంలోనూ రైతులు దోపిడీకి గురవుతూనే ఉన్నారు. మద్దతు ధరకు కొనుగోళ్లు జరిపే సమయంలోనూ అధికారులతో కుమ్మక్కయి రైతుల నుంచి తక్కువ ధరకు కొని బిల్లుల్ని మాత్రం మద్దతు ధరకు సమర్పించేవారిలో కమీషన్ ఏజెంట్లే ఎక్కువగా ఉంటారు. ఇలా 2015లో పత్తి పంట విషయంలో ఒక సీజన్‌లోనూ రూ.1000కోట్ల కుంభకోణం జరిగిందని లోక్‌సత్తా, రైతుసంఘాలు ఆధారాలతో సహా వెల్లడించాయి. ఇదికాక రైతులకు సంస్థాగత రుణాలు అందించటంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకుని ఏజెంట్లు అధిక వడ్డీలకు అప్పులిచ్చి దోచేస్తున్నారు. ఇవన్నీ లెక్కేస్తే రైతు నష్టపోతున్నది ఇంకొన్ని వేలకోట్లు నిగ్గుతేలుతుంది. రైతుకు-వినియోగదారునికి మధ్య గొలుసును తగ్గించి సాధ్యమైనంత నేరుగా ఉత్పత్తిదారులే అమ్ముకోగలిగే మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయటం, విత్తనాలు, ఉత్పాదకత పెంపు, సరైన పరపతి వ్యవస్థ, నిల్వ, శుద్ధి సౌకర్యాలు వంటివి అందుబాటులోకి తేవటం మీద పాలకులు నానుస్తూన్నంతకాలం రైతు నిత్య దోపిడీకి గురవుతూనే ఉంటాడు. ❖

## గురజాడ జాతీయ కవి




దేశమును ప్రేమించుమన్నా, మంచియన్నది పెంచుమన్నా..' అంటూ గురజాడ రాసిన ఒక్క పద్యాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుని ఆచరిస్తే చాలు.. లోక్‌సత్తా కలలుగన్న పౌరసత్వం, నాయకత్వం నిండిన భారతదేశం ఆవిర్భవిస్తుందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. గురజాడ అప్పారావును విజయనగరానికో, తెలుగువారికో పరిమితం చేయడం తగదన్నారు. ఆయన జాతీయ కవి అన్నారు. గురజాడ కాలాతీత రచన 'కన్యాశుల్కం'ను తొలిసారి ప్రదర్శించి 125 ఏళ్లు అయిన సందర్భంగా విజయనగరంలో ఆ మహాకవి విగ్రహం వద్ద నేతలు, పౌరప్రముఖులతో కలిసి బాబ్జీ నివాళులర్పించారు.

**గురజాడ కుటుంబసభ్యులకు అండగా నిలిచింది లోక్‌సత్తాయే**

మహాకవి గురజాడ ఇంటిని జాతి కోసం ఇచ్చినందుకుగాను ఆయన కుటుంబసభ్యులకు రావాల్సిన స్థలాన్ని లోక్‌సత్తా చొరవ వల్లే ప్రభుత్వం ఇంకా జాప్యం చేయకుండా అప్పజెప్పిందని, ఈ సేవను గౌరవంగా భావిస్తున్నామని లోక్‌సత్తా పార్టీ విజయనగరం పట్టణాధ్యక్షుడు మొల్లేటి చిన్నారావు, కార్యదర్శి తిప్పాన కోటేశ్వరరావు అన్నారు. తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ.. జిల్లా యంత్రాంగాన్ని, అమరావతిలో రాష్ట్ర యంత్రాంగాన్ని, మంత్రులను పలుమార్లు కలిసి గురజాడకు తగిన గౌరవం కోసం పోరాడిన సంగతిని వారు గుర్తుచేశారు. గురజాడ కుటుంబసభ్యులకు పురపాలక సంఘంవారు ఎట్టకేలకు స్థలాన్ని అప్పగిస్తూ రిజిస్ట్రేషన్ చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఆయన విగ్రహానికి దండవేసి 'మహాకవీ మన్నించు' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నేతలు ఆదీశ్వరరావు, భాస్కర్, శ్రీను, పోలిపర్తి అప్పారావు, రాజారావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు. ❖

# నంద్యాల ఉప ఎన్నిక.. మన ప్రజాస్వామ్య సంక్షోభానికి నిలువెత్తు నిదర్శనం!

ఆంధ్రప్రదేశ్‌లో అధికారాన్ని అందుకునేందుకు ఈవేళ గట్టి పోటీదారులుగా ఉన్న ముగ్గురు యువనాయకులు కేవలం పుట్టుక వల్లే ఆ అర్హతను సాధించారని, ఆయా కుటుంబాల్లో కాకుండా సాధారణ ఇళ్లలో పుట్టి ఉంటే వాళ్లది అనామక, రెక్కాడితేగానీ డొక్కాడని బతుకేనని ఇటీవల ఓ విశ్లేషకుడు గబుక్కున అనేశాడు. కాస్త అమర్యాదకరంగా అనిపించినా, వాళ్ల ఐక్యూ, నాయకత్వ సామర్థ్యం వంటి వాటి గురించి కొద్దిసేపు ఆలోచించాక.. ఆయన చెప్పింది నిజమే గదా అనిపించింది. కుటుంబ రాజకీయాల వల్లే ఆ యువనేతలు కోట్ల మంది తెలుగువాళ్లను ఏలే స్థాయికి పోటీపడగలుగుతున్నారు. పుట్టుకను బట్టి భవిష్యత్తు నిర్ణయమైపోవటం ప్రజాస్వామ్యంలో సిగ్గుచేటని వాళ్లు, వాళ్ల కుటుంబీకులు అనుకోరు. తరతరాలుగా ఎమ్మెల్యేలుగా గెలవటం రాజకీయంలో 'మామూలే' అనుకుంటారు. జిల్లాల స్థాయిలో కూడా కొన్ని కుటుంబాలు అలాగే నియోజకవర్గాలను సొంత అడ్డాల్లా భావిస్తుంటాయి. రాష్ట్ర స్థాయి వారసులకు, జిల్లా వారసులకు 'వంశపారంపర్య రాజకీయాలు ప్రాతిపదికన' గట్టి సంబంధబాంధవ్యాలు ఉంటాయి. పార్టీలు వేరైనా కుటుంబ రాజకీయాల విషయంలో మాత్రం అందరూ ఒకటే. అందుకే ఒక నియోజకవర్గంలో ఎవరైనా ఎమ్మెల్యే చనిపోతే వారి జీవిత భాగస్వామి లేదా కొడుకు, కూతురు, ఇతర కుటుంబ సభ్యుల్ని నిలబెట్టి ఏకగ్రీవంగా గెలిపించుకోవడానికి ఏకాభిప్రాయంతో కృషి చేస్తుంటారు. ఇది మీడియా కూడా చాలా ఇష్టపూర్వకంగా తలగ్గి ప్రోత్సహిస్తున్న సెంటిమెంట్‌గా, సాంప్రదాయంగా తెలుగునాట మారింది.

ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్టీల్లో ఎదగడానికి సమర్థత, నిబద్ధత తప్ప వంశపారంపర్యం అర్హత కాకూడదు అని వాదించే లోక్‌సత్తా 2008లో హైదరాబాద్‌లోని ఖైరతాబాద్, విజయనగరం జిల్లాలోని తెర్లాం అసెంబ్లీ నియోజకవర్గాల ఉప ఎన్నికలలో పోటీచేసింది. ప్రత్యర్థులమని చెప్పుకునే కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు వంశపారంపర్య రాజకీయాల కోసం ఆ రెండు నియోజకవర్గాలను ఏకగ్రీవం చేసి చెరొకటి పంచుకోవాలని నిర్ణయించుకున్నాయి. కానీ లోక్‌సత్తా పోటీ చేసి ఎన్నికలను అనివార్యం, చర్చనీయాంశం చేసింది. సమాజంలో ఆలోచనాపరులు, కాస్త వనరులున్నవాళ్లు ఓ 15శాతం మంది అండగా నిలబడి ఉంటే ఈ పాటికి లోక్‌సత్తా వంశపారంపర్య రాజకీయాల స్థానంలో సామాన్యుల రాజకీయాల్ని గణనీయ స్థాయిలో ప్రతిష్టించగలిగి ఉండేదనటంలో సందేహం లేదు. ఆశించిన ఓట్లు రాక ఎన్నికల రాజకీయాలలో లోక్‌సత్తా కొంత వెనక్కి తగ్గాల్సి రావటంతో.. వంశపారంపర్య సెంటిమెంట్ సెటిల్‌మెంట్లు తెలుగునాట నియోజకవర్గాలలో కొనసాగుతూనే ఉన్నాయి. ఇటీవల నంద్యాల అసెంబ్లీ ఉప ఎన్నికలో కూడా అదే తరహా సెటిల్‌మెంట్ జరిగేదిగానీ, వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్ దాన్ని 2019 ఎన్నికలకు సెమీ ఫైనల్‌గా భావించడంతో యుద్ధంగా మారింది.

వాస్తవానికి నందాల అసెంబ్లీ సీటు వైకాపాది. 2014 ఎన్నికల్లో వైకాపా అభ్యర్థిగా గెలిచిన భూమా నాగిరెడ్డి ఆ తర్వాత పార్టీ ఫిరాయించి అధికార



## 2019లో ఎన్నికలు ఇంకెంత భయంకరంగా ఉంటాయో!

నంద్యాల ఉప ఎన్నికలు రాజకీయ రాక్షసక్రీడను తలపించాయని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో వేసిన కమిటీ రూపొందించిన నివేదికలోని అంశాలను ఆయన తిరుపతిలో మీడియా ద్వారా వెల్లడించారు. తెదేపా, వైకాపా బెదిరింపు, బ్లాక్‌మెయిల్ రాజకీయాలతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశాయన్నారు. ఎందరో ఉన్నత నేతలు నంద్యాల నుంచి ఎన్నికై రాష్ట్రానికి, దేశానికి పేరు తెచ్చారని, అలాంటి క్షేత్రంలో ఒక ఉప ఎన్నిక కోసం పార్టీలు బరితెగించిన తీరు తెలుగువారి ఆత్మగౌరవాన్ని దిగజార్చేలా ఉందని అన్నారు. ఎంతో అనుభవమున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా హుందాతనాన్ని కోల్పోయి దిగజారారన్నారు. రాష్ట్రంలో రైతుల, ఇతర ప్రజాసమస్యలను పట్టించుకోవాల్సిన ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు నంద్యాలలో బస చేయటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందన్నారు. కులాల పేరుతో వీధివీధినా ప్రచారం చేశారని, చివరికి చిన్నపిల్లల చేత కూడా ప్రచారం చేయించారని అన్నారు. నీతిమాలిన చర్యలతో పార్టీలు నంద్యాలను ఆక్రమించుకున్నా ఎన్నికల కమిషన్ పేలవమైన చర్యలకే పరిమితమైందన్నారు. పేరుకే ప్రజాస్వామ్యం ఉన్నట్టుందన్నారు. 2019లో ఎన్నికలు ఇంకెంత భయంకరంగా ఉంటాయోనని ఆందోళన వ్యక్తం చేశారు. లోక్‌సత్తా చెబుతున్నట్టు ఎన్నికల వ్యవస్థలో మార్పులు వస్తే తప్ప ఈ రాక్షస ఎన్నికల రాజకీయానికి తెరపడదన్నారు. తమ నివేదికను ఎన్నికల సంఘానికి అందిస్తామన్నారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ నేతలు రామారావు, రెడ్డెప్ప, సత్యనారాయణ, బెల్లంకొండ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీలో చేరారు. రాజీనామా చేయలేదు. కానీ ఆయన అకాల మరణంతో ఉప ఎన్నిక వచ్చింది. జగన్ పట్టుదలతో అనివార్యమైంది.

జగన్ పట్టుదల, ముఖ్యమంత్రి చంద్రబాబు అభద్రత చివరికి 2017 ఆగస్టులో జరిగిన నంద్యాల ఉప ఎన్నికను భారత ప్రజాస్వామ్య సంక్షోభానికి నిలువెత్తు నిదర్శనంగా మార్చాయి.

### గుడివాడ - నంద్యాల

నంద్యాల కంటే ముందు ఏప్రిల్, 2017న కృష్ణా జిల్లా గుడివాడలో రెండువేల పైచిలుకు ఓటర్లున్న 19వ వార్డుకు జరిగిన ఉప ఎన్నికలో, ఎటువంటి అధికారాలూ లేని ఓ కౌన్సిలర్ పదవికి తెదేపా, వైకాపా కలిపి రూ. 3.5 కోట్లు నుంచి 4.5కోట్ల దాకా ఖర్చు చేశాయి. ఆ పార్టీలు ఓటుకు రూ. 15,000 వరకూ ఇచ్చాయని ప్రాథమిక సాక్ష్యాధారాలతో వార్తలచ్చాయి (నోట్లవాడ ఫోటో చూడవచ్చు). దేశవ్యాప్తంగా ప్రజాక్షేత్రంలో జరిగిన




ఎన్నికల్లో ఓట్ల కోసం వెదజల్లిన అక్రమ డబ్బులో బహుశా ఇదే రికార్డేమో. గుడివాడ 19వ వార్డును మునిసిపల్ కేటగిరీలోకి విభజిస్తే.. అసెంబ్లీ ఎన్నికల విభాగంలో నంద్యాల ఉప ఎన్నికను దేశంలోనే కొత్త రికార్డుగా భావించవచ్చు.

### ఎన్నికలు జరిగే రోజుదాకా పంచుడే పంచుడు

నంద్యాల ఉప ఎన్నికలో ఓటుకు రూ. 5,000 వరకూ చెల్లించారని, ఉమ్మడి కుటుంబాలకు లక్ష ఇచ్చారని ఫోటోలతో సహా వార్తలు వచ్చాయి. వైకాపా, తెదేపా నాయకులు పబ్లిగ్గా డబ్బు పంచుతూ వీడియో సాక్ష్యాలతో సహా దొరికారు. ఇలా దాదాపు రూ. 100-300 కోట్ల వరకూ నంద్యాలలో వెదజల్లినట్టు చెబుతున్నారు.

## పేద రాష్ట్రం, పేద ప్రజలు, సంపన్న రాజకీయనేతలు



మన చర్చంతా ఎలాగోలా ఎన్నికల్లో గెలవటంపైనే ఉండటం సిగ్గుచేటని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ప్రజలకు ఎలాంటి మేలు జరుగుతోంది, అందుకు తగిన విధానాలను పాలకులు అనుసరిస్తున్నారా లేదా అని కాకుండా, ఎవరు గెలిచారు అనే అంశం చుట్టూనే తిరుగుతుండటం వల్ల దేశం తీవ్రంగా నష్టపోతోందన్నారు. ఆ గెలుపు కోసం ఏం చేసినా పట్టించుకునే కనీస ప్రమాణాలను కూడా మనలో చాలామంది పాటించటం లేదన్నారు. కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగిన ఉప ఎన్నికలో గెలుపు కోసం పార్టీలు, అభ్యర్థులు రూ.100-300కోట్లు ఖర్చు పెట్టటం ఎలాంటి ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. పేద రాష్ట్రం, పేద ప్రజలు- కానీ ఎన్నికల్లో కోట్లు గుమ్మరించే సంపన్న రాజకీయ నేతలు.. ఈ వైరుధ్యాన్ని అర్థం చేసుకోవాలన్నారు. కులం, మతం, ప్రాంతం, ప్రైవేటు ఎస్టేట్‌లుగా మారిన రాజకీయ పార్టీలు, నేతల వారసులు, ఎలాగోలా అధికారం వంటి ఉన్మాదాల్ని వదిలేసి.. మనందరికీ మంచి జరిగే విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి అంశాల మీద, అందుకుతగ్గ రాజకీయం, వ్యవస్థల నిర్మాణం మీద చర్చ చేయాలని విజ్ఞప్తి చేశారు.

బెట్టింగులు అదనం. నేరుగా డబ్బు ద్వారా కాకుండా వివిధ రూపాలలో ఓటర్లను ప్రలోభపెట్టారు. పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్) తర్వాత నల్లడబ్బును కట్టడిచేశామని ప్రధాని నరేంద్రమోదీ చెప్పుకోవటం ప్రజల్ని ఎంత మభ్య పెట్టడమో యూపీ ఎన్నికల కన్నా నగ్నంగా నంద్యాల ఉప ఎన్నిక బైటపెట్టింది. ఇంత జరుగుతున్నా ఎన్నికల సంఘానికి పట్టుబడింది రూ.1.2 కోట్లేనట. ఓటుకు అధికార పార్టీ నేతలు రూ.4,000 చొప్పున ఇచ్చారని, 89కోట్లు ఖర్చు పెట్టారని తమిళనాడులోని ఆర్కేనగర్ ఉప ఎన్నికను రద్దుచేసిన ఈసీ.. నంద్యాల పట్ల మాత్రం మౌన ప్రేక్షక పాత్ర పోషించింది. ఒకరోజుకాదు, రెండ్రోజులు కాదు, ఎన్నికల రోజుదాకా డబ్బు, ఇతర ప్రలోభాల పంపిణీ యధేచ్ఛగా సాగింది.

### బహిరంగ చర్చ ప్రమాణాల దిగజారుడులోనూ రికార్డు

డబ్బు పంపిణీతోపాటు బహిరంగ చర్చ ప్రమాణాల దిగజారుడులో కూడా నంద్యాల రికార్డు సృష్టించింది. 'నేను మీకు రోడ్లేయించా, అవిచ్చా, ఇవిచ్చా.. నాకు ఓటేయకపోతే మీ సంగతి చూస్తా' అన్నట్టు చంద్రబాబు నాయుడు రాజ్యాంగ విరుద్ధంగా ముఖ్యమంత్రి స్థాయి దిగజారి మాట్లాడితే, ముఖ్యమంత్రిని నడిరోడ్డు



మీద కాల్చాలని, గుడ్డలూడదీయాలని జగన్ నోరుపారేసుకున్నారు. భూమా నాగిరెడ్డి కుమార్తె, మంత్రి అఖిలప్రియ ఆహార్యం మీద వైకాపా ఎమ్మెల్యే రోజా అభ్యంతరకర రీతిలో మాట్లాడారు. గెలిచేవారు మగవారు, ఓడేవారు ఆడవారు అంటూ మహిళలను కించపరిచారు ఇంకొందరు నేతలు. 'ఎనీ కవరేజ్ ఈజ్ గుడ్ కవరేజ్' అనే ముతకరీతిలో నేతలు మీడియాలో కనిపించేందుకు సర్వ శక్తులను, వనరులనూ ఒడ్డారు.

### బూత్ ఏజెంట్లలా మంత్రులు, ఎమ్మెల్యేలు

తెదేపా ఎమ్మెల్యేలు, మంత్రులు బూత్ ఏజెంట్లలా మారి నంద్యాలలో గెలుపు కోసం పోరాడారు. జగన్ 13 రోజులు అక్కడే మకాం వేశారు. చంద్రబాబు కూడా ప్రత్యక్షంగా, పరోక్షంగా రోజులతరబడి నంద్యాల మీద దృష్టి కేంద్రీకరించారు. నంద్యాలలో ఎలాగైనా గెలవాలనే అధికార, ప్రతిపక్ష నేతల ఆరాటంలో రాష్ట్రంలో పాలన కుంటుపడింది. పాలనా యంత్రాంగాన్ని ఉపయోగించుకోవటం, మైనారిటీలను ఆకట్టుకునే ప్రయత్నంలో ఆ వర్గాలకు చెందినవారిపై కేసుల్ని ఎత్తివేయటం వంటి అధికార దుర్వినియోగాలెన్నో.

### డబ్బుతో పాటు కులం, మతం

డబ్బు, ప్రలోభాలు చాలవన్న అనుమానం వచ్చింది. రిస్కు తీసుకో దల్చుకోలేదు. ఏ ఒక్క అవకాశాన్నీ వదలదల్చుకోలేదు. దీంతో కులం, మతం విపరీతంగా రెచ్చగొట్టారు. ఒకదశలో రెండు వర్గాల మధ్య ఉద్రిక్తతలను రెచ్చగొట్టి ఎన్నికలను వాయిదా వేసే ప్రయత్నం జరుగుతోందన్న వార్తలూ జోరందుకున్నాయి.

పట్టణ ప్రాంతంలో తెలుగుదేశంకి, గ్రామీణ ప్రాంతంలో వైకాపాకి ఆధిక్యం రావొచ్చని అంచనా వేశారు. రికార్డు స్థాయిలో దాదాపు 80శాతం పోలింగ్ జరిగింది. 2,18,858 మంది ఓటర్లలో 1,73,187మంది ఓటు హక్కును వినియోగించుకోగా, తెలుగుదేశానికి 97,076 ఓట్లు పోలయ్యాయి. 27,466 ఓట్ల మెజారిటీతో తెదేపా అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి తన ప్రత్యర్థి, వైకాపా అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డిపై గెలుపొందారు.

## 'టీనా ఫ్యాక్టర్‌'ని ఇంకా పటిష్టం చేస్తున్న జగన్

నంద్యాల వైకాపాకు బలమైన స్థానమే అయినప్పటికీ తొలి నుంచీ తెదేపాకే గెలుపు అవకాశాలున్నాయని విశ్వసనీయ ట్రాక్ రికార్డు ఉన్న ఓ సర్వే సంస్థ తెలిపింది. ప్రచారం మొదలైన దగ్గర్నుంచీ ఆ అవకాశాలు పెరుగుతూ తెదేపా ఆధిక్యత పెరుగుతూ వచ్చిందని ఆ సంస్థ ప్రతినిధి అన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు పట్ల సానుకూలతకన్నా జగన్ పట్ల భయం వల్లే ఓటర్లు తెదేపా వైపు మొగ్గు చూపారని ఓటుకు కోట్లు కేసు సమయంలో కూడా లోక్‌సత్తా స్పష్టం చేసింది. ఆ 'టీనా' (ప్రత్యామ్నాయం లేదు) ఫ్యాక్టర్ ఇప్పటికీ కొనసాగుతుండటం వల్లే ఎన్ని వైఫల్యాలున్నా చంద్రబాబుకు సానుకూల పరిస్థితి ఉంది. టీనా ఫ్యాక్టర్ సమసిపోకుండా ఇంకా ఇంకా గట్టిపడేలా నంద్యాల ఎన్నికల్లో జగన్ వ్యవహరించడంతో తెదేపా విజయం ఖాయమైంది. నీతికి-అవినీతికి మధ్య పోరాటం, వైకాపాకు సొంత మీడియా లేదు వంటి అబద్ధాల్ని అలవోకగా చెబుతూ, సొంత పత్రిక కూడా ప్రచురించలేనంత ఉన్మాద భాషని జగన్ ఉపయోగించటం చంద్రబాబు పాలిట ఒకరకంగా వరంగా మారింది. తెదేపా మెజారిటీ 10,000 దాటిందంటే, కచ్చితంగా అది సానుకూల ఓటు అని చెప్పుకోకతప్పదు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, బీజేపీ అండలేకుండానే తెదేపా ఈ ఎన్నికల్లో పోరాడి సాధించిన విజయమిది (కాకినాడ మునిసిపల్ ఎన్నికల ఫలితాల్లోనూ ఇది ప్రతిఫలించింది). అందుకే ప్రధాని మోదీ కూడా వ్యూహాత్మకంగా అభినందన ట్వీట్ చేశారు. శిల్పా మోహన్ రెడ్డి పట్ల ఉన్న వ్యతిరేకత, జగన్ అపరిపక్వత, ఇటీవలి కాలంలో మోదీ పార్టీకి సన్నిహితమయ్యే ప్రయత్నాల్ని చేయటం వల్ల ముస్లిం ఓట్లను కూడా తెదేపా అనుకున్న సంఖ్య కన్నా ఎక్కువగా కొల్లగొట్టగలిగింది.

## పవన్ కళ్యాణ్ సమీక్షించుకోవడం అవసరం

తెదేపా సొంతంగా గెలవగలదు, పవన్ కళ్యాణ్‌ది ఎన్నికల్లో సహాయక పాత్రే కావచ్చు అనే అభిప్రాయాలను నంద్యాల ఉప ఎన్నిక కలిగించింది. ఎన్నికల్లోనూ నేరుగా గెలిచే పరిస్థితి లేకపోవడం, ఎజెండానూ స్పష్టత లేకపోవడంపై పవన్ కళ్యాణ్ లోతైన మథనం చేసుకోవాలని ఈ ఎన్నిక సూచిస్తోందనుకోవచ్చు.

## మూడో పార్టీ కావడం వల్లే ఘోరంగా దెబ్బతిన్న కాంగ్రెస్

ఇక ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వచ్చిన ఓట్లు కూడా మన ఎన్నికల వ్యవస్థలో పెనులోపాలకు అద్దం పడుతున్నాయి. వాస్తవానికి కాంగ్రెస్ తన అభ్యర్థి ఎంపికను, ఎన్నికల ప్రచారాన్ని కూడా వ్యూహాత్మకంగానే చేసింది. ఆ పార్టీకి 5,000-10,000 ఓట్లు వస్తాయని అంచనా వేశారు. కాంగ్రెస్ పార్టీ వల్ల వైకాపా ఓట్లు తగ్గుతాయి అని తెదేపా కూడా లెక్కేసుకుంది. కానీ మన ఫస్ట్-పాస్ట్-ది-పోస్ట్ (ఎఫ్‌పీటీపీ) విధానంలో మూడో పార్టీకి అవకాశం ఉండదని కాంగ్రెస్ నిరూపించింది. గెలిచే అవకాశం లేకపోవడం, కాసిని అదనపు ఓట్లకు భారీ డిమాండ్ ఉండటంతో కాంగ్రెస్ ఓట్లు వైకాపాకు ట్రాన్స్‌ఫర్ అయినట్టు భావిస్తున్నారు. దీంతో భూమా నాగిరెడ్డికి వచ్చిన ఓట్లు కంటే నాలుగు శాతం ఎక్కువ ఓట్లు శిల్పా మోహన్‌రెడ్డికి లభించాయి. కాంగ్రెస్ ఘోరంగా డిపాజిట్‌ను కోల్పోయి కేవలం 1382 ఓట్లు పొందింది.

ఏతావాతా, భారతదేశంలో ప్రజాస్వామ్యం కేవలం శాంతియుతంగా అధికార మార్పిడి స్థాయిలోనే ఉందని నంద్యాల ఉప ఎన్నిక కూడా రుజువు చేసింది.

కొత్త పరిణామాలతో ఏపీలో 2019 నాటికి సమీకరణలు మారొచ్చు. కానీ తెదేపా, వైకాపాల్లో ఎవరు గెలిచినా పెనం, పొయ్యిల మధ్యే ప్రజలు ఎంచుకోవటమని నంద్యాల ఉప ఎన్నికలో ఆ పార్టీల డబ్బు ఖర్చు, రాజకీయ సంస్కృతి రుజువు చేస్తున్నాయి. తెదేపా, వైకాపాల నుంచి తమ జీవితంలో పెద్దగా వచ్చే మార్పేమీ కనిపించక పోవటంతో.. ఓట్ల సమయంలో వాళ్లిచ్చే డబ్బు, ప్రలోభాలు, అధికారంలో ఉన్నవారు అమలుచేసే తాత్కాలిక స్కీములైనా దక్కితే చాలన్నట్టు ప్రజలు భావిస్తున్నారు. ఈ డబ్బు, అధికార లాలస ఎన్నికల్లో ప్రజలు బాధితులే తప్ప బాధ్యులు కారు. మన ఎన్నికల వ్యవస్థలో దామాషా పద్ధతి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక వంటి మౌలిక సంస్కరణలు తేవటం, పార్టీ రాజకీయాలకతీతంగా ప్రజల్లో మంచి రాజకీయం, పాలన ఆవశ్యకతపై చైతన్యాన్ని పెంచటం కోసం ప్రభుత్వాలు, పార్టీలు, ఆలోచనాపరులు, పౌరసమాజం, మీడియా వేగంగా కృషి చేయటమే ఈ సంక్షోభానికి పరిష్కారం. ❖

***సురాజ్య ఉద్యమాన్ని లోక్‌సత్తా ఇప్పటికి రెండు దశలుగా నిర్వహించింది. 2008లో, 2012లో వివిధ సమావేశాలు, సభలు, కార్యక్రమాల ద్వారా సురాజ్య లక్ష్యం, ఆ లక్ష్యసాధనకు కావలసిన ఆచరణాత్మక విధానాలపై ప్రజల్ని, ముఖ్యంగా యువతను, చైతన్యపరిచేప్రయత్నం చేసింది. పార్టీలకతీతంగా తెలుగుగడ్డకు, దేశానికి అవసరమైన మౌలిక సురాజ్య ఎజెండాను రూపొందించి ప్రభుత్వాలను, రాజకీయ పార్టీలను, పౌరసమాజాన్ని ఒప్పించింది. 2014 ఎన్నికల తర్వాత మళ్లీ ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ సురాజ్య గురించి మాట్లాడుతున్నారు. 'సురాజ్యం ప్రతి భారతీయుడి జన్మహక్కు' అంటూ ఇటీవల దేశ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి పిలుపునిచ్చారు. ఎన్నికలస్తున్నాయి, అధికార మార్పిడులు జరుగుతున్నాయి.. కానీ జనం జీవితాల్లో ఆశించిన మార్పునిచ్చే సురాజ్యం రావడం లేదు. ఆటనియమాలు మారకుండా ఆటగాళ్లు మాత్రమే మారుతూండటం ఇందుకు ప్రధాన కారణం! అందుకే లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ సురాజ్య విధానాలపై చైతన్యం తేవటానికి మళ్లీ జనంలోకి బయల్దేరారు. 'జనహితం కోసం జేపీ సురాజ్య యాత్ర' పేరుతో 100 రోజుల ప్రచార కార్యక్రమాన్ని చేపడుతున్నారు. తొలుత ఆంధ్రప్రదేశ్‌లో, ఆ తర్వాత తెలంగాణలో జేపీ సురాజ్య యాత్రలు ఉంటాయి. మార్పు కోరుకునేవారందరూ ఈ యాత్రల్లో పాల్గనాలని ఆహ్వానిస్తున్నారు. సురాజ్యం గురించి జేపీ 2008, 2012లో పంచుకున్న ఆలోచనలు ఈ సందర్భంగా..***

# సురాజ్యం మన జన్మహక్కు.. సాధించుకుందాం!

**- డా॥ జయప్రకాష్ నారాయణ్**




'స్వరాజ్యం నా జన్మహక్కు' అని లోకమాన్య తిలక్ ఇచ్చిన నినాదం సుమారు శతాబ్దం క్రితం వాడవాడలా ప్రజల్ని ఉత్తేజపరిచింది. తెల్లదొరల పాలనపోయి స్వరాజ్యం వస్తే ఇక బాధలన్నీ తీరతాయని, చీకూచింతా లేకుండా తలెత్తుకుని బతకొచ్చని కోట్లాది భారతీయులు భావించారు. దేశ స్వాతంత్ర్యం కోసం రాజీలేని పోరాటంకు సమాయత్తమయ్యారు. సామాన్యులు సైతం స్వచ్ఛందంగా ఇళ్లనుంచి బైటికొచ్చి స్వరాజ్యపోరులో పాలుపంచుకున్నారు. లక్షలమంది యోధుల త్యాగఫలంగా స్వరాజ్యాన్ని సాధించుకోగలిగాం. మన జాతి నిర్మాతల కృషితో ఉదాత్తమైన మానవ విలువలకి ప్రతీకగా, స్వేచ్ఛకి, పౌరసార్వభౌమత్వానికి సంకేతంగా మనం గర్వించే రాజ్యాంగాన్ని పొందాం. స్వతంత్రం వచ్చాక 1952నుంచి ఇప్పటిదాకా ఎన్నికలు జరుపుకుంటున్నాం, ప్రభుత్వాలను మార్చుకుంటున్నాం, స్వేచ్ఛను అనుభవిస్తున్నాం... కొంతమేరకు అభివృద్ధి సాధించుకుంటున్నాం.

## నాటి కన్యాశుల్కంలో ప్రశ్నకు సమాధానమే నేటి సురాజ్య ఉద్యమం: జేపీ



"దేశానికి స్వాతంత్ర్యం వచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇక్కడున్న మన హెడ్‌కానిస్టేబుల్‌కి ట్రాన్స్‌ఫర్ అవుతుందా? ఆ పోలీసు కానిస్టేబుల్ తెగవేధిస్తున్నాడు..." అని మహాకవి గురజాడ అప్పారావు 1890ల కాలంలో రాసిన 'కన్యాశుల్కం'లో బండినడిపే వ్యక్తి అంటాడు. అప్పటికి కాంగ్రెస్ పుట్టి ఎనిమిదేళ్లు మాత్రమే అవుతుంది. గాంధీ ఎవరో కూడా తెలియదు. ఆ బండినడిపే వ్యక్తి ప్రశ్నకి సమాధానమే.. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయ్యాక లోక్‌సత్తా చేపడుతున్న సురాజ్య ఉద్యమం! సురాజ్యం లేకపోతే స్వరాజ్యం స్వాహారాజ్యం అయితీరుతుంది. కాళ్లుమొక్కే స్థాయి నుంచి తమ కాళ్ల మీద నిలబడి బతికే స్థాయికొచ్చేలా ప్రజల ఆకాంక్షల్ని ఎలా పెంచాలి? వారిని ఆత్మన్యూనత నుంచి ఎలా బైటపడేయాలి? అనేదే కీలకం. ప్రజల ఆకాంక్షల్ని పెంచేందుకే, వారి ఆకాంక్షల్ని నెరవేర్చేలా వ్యవస్థల్ని నిర్మించేందుకే సురాజ్య ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నాం. కులం, మతం, భాష, ప్రాంతం తదితర ఎటువంటి వివక్షలూ లేకుండా తలెత్తుకుని బతకటం నా జన్మహక్కు అని ప్రతి పౌరుడూ ధీమాగా భావించాలి. మానవనిర్మాణం ఏదీ పరిపూర్ణంకాదు. అయితే మనం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు భావితరాలకు లేకుండా.. వ్యవస్థల నిర్మాణం, ఇతర శాశ్వత పరిష్కారాలు చూపాల్సిన బాధ్యత ప్రతితరం మీదా ఉంటుంది.

**– డా॥ జయప్రకాష్ నారాయణ్**



... కానీ నాయకులు మారినా, ప్రభుత్వాలు వేరైనా పాలన పేరుతో దోపిడీ పెరిగిపోతున్నది. మన జాతీయ పోరాటనేతలు స్వరాజ్యాన్ని గూర్చి కన్న కలలు వమ్మయ్యాయి. స్వరాజ్యం 'స్వాహారాజ్యం'గా మారి పోయింది. కేవలం తెల్లదొరలని సాగనంపి, తరచు ఎన్నికల ద్వారా ప్రభుత్వాన్ని మార్చగానే స్వరాజ్యం వచ్చిందను కుంటే అది భ్రమేనని తేలి పోయింది. స్వాహారాజ్యాన్ని సమాధి చేసి సురాజ్యాన్ని సాధించేందుకు ఈరోజున మౌలిక పోరాటం ప్రారంభించకపోతే భవిష్యత్తు తరాలకు పేదరికం, వివక్ష, విద్వేషాలతో నిండిన సమాజాన్ని చేజేతులారా అందించినవారమవుతాం... మనకోసం, మన భావితరాల సంక్షేమం కోసం వ్యవస్థను ప్రక్షాళన చేసి సుపరిపాలనను అందించే లక్ష్యంతోనే లోక్‌సత్తా 'సురాజ్య'పోరును ప్రారంభించింది. సురాజ్యంను ఇంటింటికీ తీసుకెళ్లి, ప్రతి పౌరుడి హక్కుగా చేయటమే ధ్యేయం.

సురాజ్యకు తొలిమెట్టు కొత్త రాజకీయ సంస్కృతిని తెచ్చి అవినీతిని అంతంచేయటం... ఈరోజు దేశమంతటా అధికారాన్ని, రాజకీయాన్ని, పాలనని చూస్తే మూడు రీతులు స్పష్టంగా కానవస్తున్నాయి. స్వాహారాజ్యం ఎలా వ్యవస్థీకృతమైపోయిందో ఇవి తేటతెల్లంచేస్తాయి.

**మొదటిది:** రాజకీయాన్ని వ్యాపారంగా మార్చి, పాలనలో అంతులేని దోపిడీకి పాల్పడుతున్నారు. పార్టీలు కొందరు వ్యక్తుల, కుటుంబాల సొంత ఆస్తులుగా మారిపోయాయి. సభ్యులు కేవలం పల్లకీలు మోసే బోయీలుగా, జెండాలు పట్టే కూలీలుగా, అధికారంలో ఉన్నవాళ్లకి లంగిఉండే బానిసలుగా మారిపోయారు. పార్టీలలో పదవులు కేవలం అధినాయకుల అండ ఉన్న కొంతమందికి సొంతం. నాయకత్వం కుటుంబ




వారసత్వంగా సంక్రమించే హక్కు. అక్రమార్జన ద్వారా సేకరించిన డబ్బులో కొంతభాగం ఎన్నికలలో పెట్టుబడిగా పెట్టటం, బలవంతంగానో ప్రలోభాలతోనే డబ్బులు సేకరించి ఖర్చుపెట్టటమే నిధుల వినియోగం... ఇక పార్టీ తరుపున పోటీ చేసేవాళ్లు కేవలం రాజకీయ వ్యాపారంలో భాగస్వాములు. ఓటు పొందాలంటే నోట్లతో కొనుక్కోవటం, సారాయి మత్తులో ముంచి లొంగ దీసుకోవటం ఈనాటి సాంప్రదాయ రాజకీయానికి ఆనవాయితీ అయింది. ఒకసారి పదవు ల్లోకి వచ్చాక పెట్టిన పెట్టుబడికి పది, వంద రెట్లు ఆర్జించటమే రాజకీయం లక్ష్యం. ఈ అక్రమార్జన కోసం కాంట్రాక్టులలో కమీషన్లు, లైసెన్సులలో ముడుపులు, బదిలీలకు లంచాలు, పోలీసు కేసుల్లో పైరవీలు, భూముల కబ్జాలు, ప్రాజెక్టులలో వాటాలు, ప్రతి పనికి లంచాలు... ఇవన్నీ మన రాజకీయంలో, పాలనలో అంతర్భాగమయ్యాయి. చట్టాన్ని, రాజ్యాంగాన్ని నిలబెట్టవలసిన రాజకీయం వాటిని తుంగలోకి తొక్కుతున్నది. గూండాలు స్వైరవిహారం చేస్తున్నారు. నేరస్తులు నాయకులుగా చెలామణి అవుతున్నారు. ఇలా అక్రమార్జన, రాజకీయంలో నేరప్రవృత్తి, అవినీతి, దుష్పరిపాలన, అధికార దుర్వినియోగం, అమాయకులకు అడుగడుగునా అన్యాయం ఇవన్నీ విడదీయలేనంతగా కలిసిపోయాయి. డబ్బు పంపిణీ, మద్యం సరఫరా లేకుండా, అక్రమార్జన లేకుండా, అసలు రాజకీయం సాధ్యమేకాదనే పరిస్థితిని ఈనాటి సంప్రదాయ పార్టీలు 'కావాలని' సృష్టించాయి. స్వరాజ్యాన్ని స్వాహారాజ్యంగా మార్చాయి. గొర్రెలని తినేవాడు పోతే బర్రెల్ని తినేవాడు వస్తాడనే చందాన రాజకీయాల్ని తయారుచేశాయి.

**రెండవది:** ఒకవేళ ప్రజలంతా తాము కోల్పోతున్నదేమిటో తెలుసుకుని డబ్బుకి, మద్యానికి లోబడకుండా ఓటేస్తారేమో!... ఈ భయంతో సంప్రదాయ రాజకీయం సమాజాన్ని కులం, మతం, భాష, ప్రాంతం పేరుతో చీల్చటం, విభజించి పాలించటం నేర్చుకున్నది. జాతీయతని, పౌరసత్వాన్ని విస్మరించి ప్రజల మధ్య ద్వేషాన్ని, అసూయని రగల్చటం ఈ దివాళాకోరు రాజకీయానికి అవసరం. కులం పేరుతో రెచ్చగొట్టటం, మతం పేరుతో ద్వేషాన్ని నింపటం, ప్రాంతం పేరుతో ప్రజలను విడగొట్టటం ఎన్నో వైవిధ్యాలున్న ప్రాచీన సమాజంలో చాలా సులువు. ఇలాంటి కృత్రిమ అడ్డుగోడల్ని నిర్మించి సమాజాన్ని సంకుచితం చేస్తే, పాలకుల అన్యాయాన్ని ఎదిరించే శక్తి పౌరులకుండదు. ముక్కలయిన సమాజంలో ఎన్నికయిన వాడి అవినీతినిగాని, అధికారి దుర్మార్గాన్నిగాని ప్రశ్నించటం కష్టం. ఏం చేసినా 'మనవాడే గదా' అనే తత్వం ఉన్నప్పుడు దోపిడీకి గురవుతున్నవాళ్లు మౌనంగా అన్యాయాన్ని భరించాల్సిందే. మన 'స్వరాజ్యం'లో సంప్రదాయ రాజకీయం ప్రజలని ఇలా విభజించి పబ్బంగడుపుకోవటంలో ఆరితేరింది. అన్నివర్గాల ప్రజల ప్రయోజనాలను కాపాడటం, సంకుచితత్వాన్ని తొలగించి అందరినీ సమన్వయం చేయటం సరైన స్వరాజ్యంలో రాజకీయం చేయవలసిన పని. కానీ స్వాహారాజ్యంలో సంకుచిత రాజకీయం పని... ప్రజలలో అనుక్షణం విభేదాలను సృష్టించి పబ్బం గడుపుకోవటం.

**ఇక మూడవది:** రాజకీయాన్ని వ్యాపారంగా మార్చి ఓట్లని డబ్బుతో, ప్రలోభాలతో, సారాయితో కొన్న సమాజాన్ని చీల్చి ప్రజల్ని విభజించినా, ఎప్పుడోకప్పుడు తమ జీవితాలు బాగుపడాలన్న కోర్కె సామాన్యులకు కలిగితే స్వాహారాజ్యం ప్రమాదంలో పడుతుంది. అలాంటి ప్రమాదం లేకుండా ఉండాలంటే, ప్రజలని తాత్కాలిక తాయిలాలతో తృప్తి పరచాలి. అందుకే తాత్కాలిక రాయితీలతో ఓటర్లని మభ్యపెట్టటం ఈనాటి రాజకీయాల్లో ఆనవాయితీ అయ్యింది. బీదరికాన్ని తొలగించి

ప్రజల్ని వారి కాళ్ల మీద వారు నిలబడేలా చేయాలంటే మంత్రదండాలు, తాయెత్తులతో ఫలితాలు రావు... అందరికీ మంచి ప్రమాణాల విద్య, ప్రతి కుటుంబానికి మంచి ఆరోగ్యం, ప్రతి పౌరునికీ సంపదని సృష్టించే నైపుణ్యం, వ్యవసాయం, ఇతర సంప్రదాయ వృత్తులలో ఆదాయాన్ని పెంచే ఏర్పాట్లు... ఈ నాలుగే బీదరికాన్ని అంతంచేసి అందరికీ న్యాయం అందించే మార్గాలు. కానీ ఇవి జరిగితే ఈ దోపిడీ రాజకీయాన్ని, అవినీతి పాలనని స్వాహారాజ్యాన్ని కొనసాగించటం అసాధ్యం. అందుకే నేటి పాలనలో అడపాదడపా తాత్కాలిక రాయితీల ప్రకటన జరుగుతుంది. ప్రతి రూపాయిలో ముప్పావలాని దోచుకోవటం, వనరులని వృధా చేయటం, మిగిలిన కొద్ది మొత్తంతో ప్రజలకి ప్రత్యేక రాయితీలు ఇస్తున్నట్టు నటించి ఓట్లు రాల్చుకోవటం స్వాహారాజ్యంలో తరచూ కన్పించే ప్రక్రియలు. ఉచితంగా కలర్ టీవీలు, రుణాల మాఫీలు, తాళిబట్లు, హాజ్ యాత్రలు, మానస సరోవర్ సబ్సిడీలు, ఇంకెన్నో రాయితీలు- ఇలా ప్రజాధనంతో పౌరులను యాచకులుగా మార్చటం రాజకీయ చతురతగా మారిపోయింది. పౌరుల శక్తిసామర్థ్యాలు వికసించటం కోసం తప్ప, ప్రజలు తమ కాళ్ల మీద తాము నిలబడటం కోసం తప్ప మరే పనికైనా పన్నుల డబ్బుని ఖర్చు చేసి బీదరికాన్ని కొనసాగించటానికి నేటి పార్టీలు, ప్రభుత్వాలు విపరీతంగా పోటీపడుతున్నాయి. ప్రజలెంత అమాయకులుగా, అసహాయులుగా ఉంటే, పాలకులకి అంత ఆనందం. అప్పుడే స్వాహారాజ్యం యథేచ్ఛగా కొనసాగుతుంది.

మన స్వతంత్రయోధులు దశాబ్దాల తరబడి పోరాడి సాధించిన స్వరాజ్యం ఇలా స్వాహారాజ్యంగా మారిన నేపథ్యంలో లోక్‌సత్తా ఉద్యమం తొలినుంచి ఈ స్వాహారాజ్యం అంతం కావాలని పోరాడుతోంది. రాజ్యాంగఫలాలు పొందటం మనందరి జన్మహక్కు. పరాయివాళ్ల పాలనపోయి కేవలం వాక్స్వాతంత్ర్యం, ఓటుహక్కు, ఆటగాళ్ల మార్పు ఉంటే చాలదు. ఆట నియమాలు మారి అందరికీ రాజ్యాంగ ఫలాలు అందించటం కోసం 'సురాజ్య' ఉద్యమాన్ని ప్రతిపాదిస్తోంది.

### స్వాహారాజ్యం నుంచి సురాజ్యంకు...

స్వాహారాజ్యాన్ని సురాజ్యంగా మార్చాలంటే ఏం జరగాలి? సురాజ్యానికి నిర్దిష్టమైన లక్ష్యాలను ప్రతిపాదించినప్పుడే మరోసారి మోసపోకుండా కాపాడుకోగలం, ఆశించిన ఫలితాలను పొందగలం. లోక్‌సత్తా ఐదు ప్రాథమిక లక్ష్యాలను ప్రతిపాదిస్తూ ఆగస్టు 09, 2012 నుంచి మరోదశ సురాజ్య ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నది.

**1. కొత్త రాజకీయ సంస్కృతి:** ఈనాటి వ్యాపార, పెత్తందారీ రాజకీయ సంస్కృతిని అంతం చేసి ప్రజాస్వామ్య రాజకీయాన్ని ప్రతిష్ఠించాలి.

- కొందరి సొంత ఆస్తులుగా, ఆధునిక జమిందారీలుగా, కుటుంబ వారసత్వంగా మారిన పార్టీలను ప్రజాస్వామీకరించి సభ్యులు సంస్థలుగా, సమాజ సంపదగా నిలబెట్టాలి. వనరుల సమీకరణ, వినియోగం పారదర్శకంగా ధర్మబద్ధంగా, చట్టం పరిధిలో ఉండాలి.
- గూండాలను, నేరస్తులను, అక్రమార్జనపరులను, నాయకుల సంతానాన్ని ప్రజల నెత్తిన రుద్దే దారుణ సంస్కృతికి స్వస్తిచెప్పి సమాజంలో అత్యుత్తములను, నిజాయతీపరులను, సమర్థులు, అన్ని వర్గాల ప్రయోజనాలను కాపాడేవారిని ప్రజాజీవనంలోకి తేవాలి.
- ఎన్నికలలో ఓట్ల కొనుగోలు, సారా పంపిణీ, బల ప్రయోగం, దొంగ ఓట్లు అంతం కావాలి. ఇందుకోసం దామాషా ఎన్నికల పద్ధతి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక వంటి సంస్కరణలను ఏకాభిప్రాయ సాధనతో చేపట్టాలి.
- సమాజాన్ని చీల్చే దుష్టసంస్కృతి స్థానే ఒకే జాతి, ఒకే పౌరసత్వం రాజకీయానికి ఆలంబన కావాలి

**2. అవినీతి అంతం:** విశృంఖలంగా అడుగడుగునా రాజ్యమేలుతున్న అవినీతిని అంతం చేసి, స్వాహారాజ్యం స్థానంలో సురాజ్యాన్ని స్థాపించాలి.

- అవినీతిపరుల ఆస్తులని ప్రజల పరం చేసేందుకు చట్టాన్ని తెచ్చి, అక్రమార్జనతోపాటు ఇతర ఆస్తులు కుటుంబానికి అందకుండా చెయ్యాలి
- అవినీతిపరుల ఆటకట్టించటానికి స్వతంత్ర ప్రతిపత్తితో, సర్వాధికారాలు, సిబ్బందితో, పక్షపాతాలకతీతంగా ఉండే సంస్థని జాతీయ, రాష్ట్ర, జిల్లా, నగరస్థాయిలలో ఏర్పాటు చేయాలి
- ప్రతి జిల్లాకి ప్రత్యేక కోర్టులను ఏర్పాటుచేసి అవినీతిపరులకి త్వరితంగా జైలుశిక్షపడేలా చూడాలి
- ప్రజలను అవినీతిపై పోరాటంలో భాగస్వాములను చేయటం కోసం, కొనుగోళ్లలో, కాంట్రాక్టులలో, పథకాల

అమలులో ప్రజల నిఘా, అజమాయిషీ ఉండటం కోసం తగిన చట్టాలను చేసి, వాటి సత్వర అమలుకి సంస్థాగత ఏర్పాట్లు చేయాలి.

- ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు హక్కుగా సేవలందించేలా 'పౌర సేవల' చట్టాన్ని అమలు చేయాలి. కార్యాలయంలోని సిటిజన్ ఛార్టర్‌లో చెప్పిన గడువులోగా పని పూర్తిచేయకపోతే రోజుకు కనీసం రూ. 250 పరిహారాన్ని దరఖాస్తు చేసుకున్న ప్రజలకు చెల్లించాలి.

**3. అందరికీ ఎదిగే అవకాశాలు:** ఆధునికయుగంలో పుట్టుకతో వివక్ష లేకుండా ప్రతి బిడ్డకీ విద్య, ఆరోగ్యాన్ని అందించటమే రాజకీయానికి, రాజ్యవ్యవస్థకీ నైతిక పునాది. అందరికీ ఎదిగే అవకాశాలనివ్వని వ్యవస్థ ప్రజలను కేవలం ఓటుబ్యాంకుగా, చేయిచాచి అర్థించే యాచకులుగా మారుస్తుంది. సురాజ్యంలో అందరి శక్తిని వికసింపచేయటం, నివారించదగ్గ బాధలను నిర్మూలించటం, ఆర్థికవ్యవస్థలో పాలుపంచుకునే నైపుణ్యాన్నివ్వటం మౌలికలక్ష్యాలు కావాలి.

- ప్రతి బిడ్డకి పన్నెండేళ్లపాటు మంచి ప్రమాణాల విద్య అందించటం కోసం సర్వశక్తుల్ని కేంద్రీకరించి ప్రతి పౌరుడి శక్తిసామర్థ్యాలను వెలికితీయాలి
- ప్రతి కుటుంబానికి పూర్తి ఆరోగ్యభద్రతను కల్పించి ఏ వ్యాధికైనా సొంత ఖర్చులేకుండా నచ్చిన ఆసుపత్రిలో చికిత్స అందే ఏర్పాటుచేయాలి
- రైతు (కౌలుదారు)కు ఆదాయాన్ని పెంచేలా ధరల స్థిరీకరణ నిధి, నిల్వ సౌకర్యాలు, ప్లెడ్జి రుణాలు, సాంకేతికత, స్వేచ్ఛా మార్కెట్ అనుసంధానంతో నూతన వ్యవసాయ విధానాలను అమలుచేయాలి, గ్రామాలకు-పట్టణాలకు మధ్య అంతరాన్ని తగ్గించాలి.
- ప్రతి పౌరునికీ ఉపాధి నైపుణ్యాన్ని పెంచి సంపద సృష్టిలో పాలుపంచుకునే అవకాశాన్ని కల్పించాలి

**4. అందరికీ ఒకే న్యాయం:** మనది పేరుకు స్వరాజ్యమైనా వాస్తవానికి చట్టం ఉన్నవారికి చుట్టమయింది. ఉన్నవారికో న్యాయం, లేనివారికో న్యాయం సర్వత్రా అమలవుతోంది. బడితె ఉన్నవాడిదే బర్రె కావటంతో నేరస్తులకి గిరాకీ పెరిగింది. అందరికీ సమానన్యాయం అందించటం, ప్రతి పౌరుడూ తలెత్తుకుని హుందాగా తిరిగే పరిస్థితి కల్పించటం సురాజ్యానికి ప్రాతిపదిక కావాలి.


- పోలీసు యంత్రాంగానికి స్వయంప్రతిపత్తినిచ్చి, నేర పరిశోధనను నిష్పాక్షికంగా, సమర్థంగా జవాబుదారీతనంతో చేపట్టే విధంగా ఏర్పాట్లు చేసి, సామాన్యులకు రక్షణ కల్పించాలి. చట్టాన్ని ఉల్లంఘించే వాళ్లు ఎంత బలవంతులైనా వారిని శిక్షించగలగాలి. పౌరుడు నిర్భయంగా పోలీసు అండని కోరే స్థితిని, కోటీశ్వరుడైనా, అధికారంలో ఉన్నవాడయినా చట్టాన్ని ఉల్లంఘించటానికి భయపడే వాతావరణాన్ని సృష్టించాలి.
- న్యాయవ్యవస్థను ప్రజలకు అందుబాటులోకి తెచ్చి, సకాలంలో సమర్థన్యాయం అందరికీ సులభంగా అందే మార్పులు తేవాలి.

**5. ఇంటి ముంగిట ప్రభుత్వం, కంటి ముందు పాలన :** పేరుకి స్వపరిపాలన అయినా పాలన ప్రజలకు దూరంగా ఉంటే ఫలితాలు రావు. అధికారాన్ని పూర్తిగా వికేంద్రీకరించటం, పౌరుణ్ణి పాలనకు కేంద్ర బిందువు చేయటం, ప్రజలకు వీలైనంత చేరువగా బాధ్యతను నిర్వహించే ఏర్పాట్లు చేయటం, పౌరులు నిరంతరం నిలదీసే అవకాశాన్ని కల్పించటం, జవాబుదారీతనం కోసం ఏర్పాట్లు చేయటం చెయ్యటం... సురాజ్య నిర్మాణంలో కీలకమైనవి. రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు, స్థానిక ప్రభుత్వాల సాధికారత, పౌరుల సార్వభౌమత్వం సురాజ్యానికి పునాదులు.

- జిల్లా ప్రభుత్వాల ఏర్పాటు
- నగరాలు, పట్టణాలు, గ్రామాల స్వయంపాలన
- వనరులు, బాధ్యతలు స్థానికంగా ప్రజల చేతుల్లో ఉంచటం
- పోలీసు, న్యాయవ్యవస్థలలో వికేంద్రీకరణ
- పాలనాసమాచార హక్కు పూర్తి అమలు
- సకాలంలో సేవల కోసం విధిగా అమలయ్యే పౌరసేవాపత్రాలు
- స్థానికంగా అవినీతిని అంతంచేసేందుకు సంస్థాగత ఏర్పాట్లు

మన రాజ్యాంగ నిర్మాతలు, స్వాతంత్ర్య సమరయోధులు ఆశించిన లక్ష్యాలు సాధించటమే సురాజ్య పోరాట లక్ష్యం. ప్రతి పౌరుడూ సార్వభౌముడయ్యే నిజమైన ప్రజారాజ్యాన్ని సాధించటమే మన కర్తవ్యం. లోక్‌సత్తా చేపట్టిన ఈ సురాజ్య ఉద్యమం జాతి మొత్తానికీ వర్తించేది. ఇది రెండవ స్వాతంత్ర్యపోరాటం. ❖

# 'హేతుబద్ధంగా' ఆలోచిస్తేనే.. జీవితం సంతోషం, భవిష్యత్ భద్రం : ఫౌండేషన్ ఫర్ ది ఫ్యూచర్



*మనందరికీ సంతోషం కావాలి. హ్యాపీనెస్ కోసం భూటాన్, మధ్యప్రదేశ్ బాటలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక మంత్రిత్వశాఖను కూడా ప్రారంభించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీన్ని పర్యవేక్షిస్తున్నారు. ఆనందం లేకుండా అభివృద్ధికి అర్థముండదని చెబుతున్నారు. కానీ ఇప్పుడున్న ఆలోచనాతీరుతోనే తెలుగువారు సంతోషమయ జీవితాల్ని సొంతం చేసుకోగలరా? భావితరాలకు భద్రత గల మెరుగైన జీవితాల్ని అందించగలరా?.. అంటే లేదనే చెప్పాలి. ఎందుకంటే, మనలోని ఆటవిక ఉద్వేగాలను దాటి హేతుబద్ధ ఆలోచన చేయకుండా.. మనం ఆశిస్తున్న నిరంతర ఆనందమయమైన, భద్రమైన జీవితాన్ని పొందటం సాధ్యం కాదు.*

*మనిషిలో ఆలోచనను పెంచి నాగరికునిగా చేయటానికి ప్రయత్నపూర్వక కృషి అవసరం అని అనేకమంది పెద్దలు చెప్పారు. వ్యక్తిగత స్థాయిలో ఆలోచనను పెంచటంతోపాటు.. ఆ ఆలోచనాశక్తిని, విలువల్ని నాగరిక ప్రజాస్వామ్యం స్థాయికి వ్యవస్థీకృతం చేయటం కోసమే లోక్‌సత్తా బృహత్ ప్రయత్నమంతా. అలా సుఖసంతోషాలతో బతకటానికి ఈ వ్యవస్థీకృత పరివర్తన ఎంత అవసరమో హైదరాబాదీ, ఫౌండేషర్ ఫర్ ది ఫ్యూచర్ శాస్త్రవేత్త శేష్ వెలమూర్ మరోసారి గుర్తుచేస్తున్నారు. ఆయన భూగోళమంతటనీ పరిగణలోకి తీసుకుంటూ మాట్లాడినా.. ఇందులోని ప్రతీ వాక్యం తెలుగువారికీ వర్తిస్తాయి. ముఖ్యమంత్రులు నేరుగా విదేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్న కాలంలో, ఎక్కడో ఏదో చిన్న దేశం చేసిన మిస్సైల్ ప్రయోగాలు మన స్థానిక మీడియాలోనూ హెడ్‌లైన్స్‌గా మారిన ప్రస్తుత యుగంలో.. శేష్ మాటలు చిరపరిచితమన్నట్టుగానే తెలుగువారికి వాస్తవాల్ని తెలియచెబుతాయి.*

మానవాళి భవిష్యత్ ఎలా ఉంటుంది? ప్రపంచవ్యాప్తంగా ప్రతి శాస్త్రమూ దీని గురించి పరిశోధన చేస్తూనే ఉంది. అన్ని అంశాలలోని బుద్ధిజీవులను ఒకచోటికి చేర్చి.. మానవాళి భవిష్యత్ గురించిన అవగాహన, జ్ఞానాన్ని ప్రపంచవ్యాప్తంగా అందరికీ పంచుతున్న వేదిక అమెరికాలోని ఫౌండేషన్ ఫర్ ఫ్యూచర్. హైదరాబాద్‌లో ఎదిగి.. అమెరికాలో వృత్తిరీత్యా స్థిరపడిన శేష్ వెలమూర్ గతంలో ఈ వేదికకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా, ఛైర్మన్‌గా 15 సంవత్సరాలు సేవలందించారు. ఇప్పటికీ ఈ వేదిక తరపున ఆయన కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ఇంజినీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ డిగ్రీ చేసిన ఆయన 30 సంవత్సరాలుగా వివిధ సంస్థల్లో ఉన్నత స్థానాలను అలంకరించారు. చైనాలోని సుప్రసిద్ధ పెకింగ్ యూనివర్సిటీకి సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచ ఆర్ట్స్ అండ్ సైన్స్ అకాడమీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. మానవాళి సాధించిన ప్రగతి, భవిష్యత్తు, భారతదేశ పురోగతిపై శేష్ వెలమూర్ 'ఈనాడు'కిచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు..

**భవిష్యత్ ప్రణాళిక అంటే ఏంటి? మీ వేదిక ప్రత్యేకత ఏంటి?**

భవిష్యత్ అంటే వచ్చే పదేళ్లో, 20 ఏళ్లదో కాదు.. వందల, వేల ఏళ్లు! మన తర్వాతి తరాలను దృష్టిలో ఉంచుకుని చేసేది. ఆ దిశగా ఆలోచించాలంటే మన మూలాల్ని బాగా లోతుగా చూడాలి. ఎక్కడ నుంచి ఎక్కడకు వచ్చామో.. ఏం సాధించామో విశ్లేషించుకుంటే భవిష్యత్ గురించి ఆలోచించగలుగుతాం. గతాన్ని అర్థం చేసుకుంటేనే భవిష్యత్‌ను చూడగలుగుతాం. అసలు మనమెలా వచ్చాం.. మన పారిశ్రామిక కార్యకలాపాలు చేసిందేమిటి? భవిష్యత్ దిశగా మనుషుల్ని నడిపించిన సాధనాలేంటి? ప్రేరకాలేంటి.. వీటి ఆధారంగానే మన భవిష్యత్ దారి ఆధారపడి ఉంది.

**అనాగరికులమనుకునే గతంలోకి చూసి.. మరింత నాగరికమైన భవిష్యత్‌ని ఎలా నిర్మించుకోగలం?**

పాతకాలంవాళ్లు అనాగరికులని ఇప్పుడు మనం అనుకోవచ్చు! కానీ ఎంత పరిణామం చెందినా నాటికీ నేటికీ మన మౌలిక ప్రవృత్తి పెద్దగా మారలేదు. నాటి ఆదిమానవులు అడవుల్లో తిరిగి, జంతువుల్ని వేటాడి ఉండవచ్చు! నాగరికులం అని పిలుచుకునే మనమిప్పుడు పెద్దపెద్ద పట్టణాల్లో నివసిస్తున్నాం. వ్యవసాయాన్ని కనుగొన్నాం. అనేక పరికరాలను కనిపెట్టాం. మౌలికమైన ప్రవృత్తి ప్రకారం చూస్తే మనం ఇప్పటికీ ఆనాటి అనాగరికుల మాదిరిగానే ప్రవర్తిస్తున్నాం. మన వ్యక్తిగతం గురించి, మన కుటుంబం, మన

ఊరు గురించి యోచిస్తున్నాం. అప్పట్లో ఆదిమానవుల బృందాల నాయకులు కూడా ఇలాగే ఆలోచించేవారు. బయటి నుంచి ఎవరైనా తనపై దాడి చేస్తే రక్షించుకోవటానికి అందరినీ కలిపి ఉంచుకునేవాళ్లు! మనం ఇప్పుడు చేస్తున్నదేమిటి? దేశాల పేరు పెట్టుకుని ఆదిమ తండాల్లాగే వ్యవహరిస్తున్నాం.

**పరిణామ క్రమంలో మనిషి ప్రగతి సాధించలేదంటారా?**

మౌలికమైన ప్రవృత్తి (నేచర్) పరంగా ప్రగతేమీ సాధించలేదు. అంతా సవ్యంగా ఉన్నంతసేపు బాగానే ఉంటాం. మన ఆర్థికవ్యవస్థకో, భౌగోళిక వ్యవస్థకో ఏదైనా ముప్పు వాటిల్లగానే ఆదిమానవుల్లానే ఆవేశంగా ప్రవర్తిస్తున్నాం. ఆదిమానవులు కేవలం తమను రక్షించుకొని, శత్రుగణాన్ని తమలో కలుపుకునేవారు! మనం శత్రువును గెలవటం కాదు.. ఏకంగా పది నిముషాల్లో ఈ భూగోళాన్ని వల్లకాడు చేసే థర్మో న్యూక్లియర్ ఆయుధాలను సమకూర్చుకున్నాం. మరి ఇదేనా నాగరికత? ప్రగతి అంటే.. అపరిమితంగా వస్తువులు, సేవల్ని వాడేయటమా? భూమ్మీదున్న వనరులన్నింటినీ తర్వాతి తరాలకు మిగలకుండా వాడేసేలా జనాభాను పెంచుకుంటూ పోవటమా? ఇదేనా ప్రగతంటే? అసలైన ప్రగతి భావనల్ని, సూచికల్ని వదిలేసి జరిగిందే ప్రగతని భ్రమిస్తున్నాం. పేదరికం, పర్యావరణం, ప్రజాభద్రత.. ఇలా ప్రతి దాంట్లో మానవులుగా విఫలమయ్యాం. తప్పుడు జీడీపీ లెక్కలతో అభివృద్ధిని అంకెల్లో చూసుకుంటున్నాం. అభివృద్ధికి పరిమితులున్నాయనే సంగతిని మనిషి గుర్తించాలి.

**మరి అసలైన ప్రగతంటే ఏమిటి?**

వనరులు, డబ్బు, శాస్త్రసాంకేతికతల దృష్ట్యా ఈ భూమ్మీదున్న ప్రతి మనిషికీ కనీస అవసరాలైన కూడు, గూడు, బట్ట కల్పించగలుగుతాం! కానీ అది సాధించామా? ఇవాళ్టికీ ఈ భూమ్మీద మూడొంతుల మంది రోజూ కూటి కోసం అల్లాడుతున్నారు. పోనీ రాబోయే తరాలకు ఈ భూమ్మీదేమైనా వనరుల్ని మిగులుస్తున్నామా అంటే అదీ లేదు. ఉన్న వనరుల్ని తోడేస్తున్నామే తప్ప వాటికి మనం జత చేయటం లేదు. కాబట్టి – ప్రగతి అంటే ఏంటో మనం పునరాలోచించుకోవాలి. ప్రతి మనిషికీ అవసరాల్లో ప్రాథమ్యాలుంటాయి. 1. భౌతిక అవసరాలు 2. భద్రత అవసరాలు 3. ప్రేమ 4. స్వాభిమానం 5. ఆత్మపరిశీలన! కానీ మనలో చాలామందికి తొలి రెండే అందుబాటులో లేవు. నిజంగా ప్రగతి సాధించాలంటే – తొలుత అందరికీ భౌతిక, భద్రత అవసరాలను తీర్చాలి. ఆ తర్వాత మిగిలినవాటి గురించి మాట్లాడొచ్చు.

**శాస్త్రసాంకేతికంగా సాధించిన ఆవిష్కరణలు కూడా ప్రగతి కాదా?**

నిజమే. గతంలో కంటే ఎంతో గొప్పగా శాస్త్రసాంకేతికతలు మనందరికీ అందుబాటులో ఉన్నాయి. వాటితో ఏం చేస్తున్నాం? అవి మనకు స్వచ్ఛమైన మంచినీటిని అందిస్తున్నాయా? సౌరపద్ధతిలో సరిపడినంత విద్యుత్‌ను అందిస్తున్నాయా? మన రోజువారీ అవసరాలకు అండగా ఉంటున్నాయా? నిజానికి శాస్త్రసాంకేతికాభివృద్ధితో ప్రతి పల్లెనూ స్వావలంబన సాధించేలా చేయగలుగుతాం. మరి అలాంటప్పుడు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే పట్టణాలకు రావాల్సిందేననే భావన పెంచటమెందుకు? అక్కడే ఆర్థికంగా ఎదగొచ్చు, సంతోషంగా ఉండొచ్చు! గాంధీజీ కూడా చెప్పిందదేగా. పల్లెల్ని పట్టించుకొమ్మన్నారు! అలాకాకుండా భారత్‌లోని పల్లెలు ఖాళీ అయి పట్టణాలకే వలసపోతుంటే.. వినాశనమే!

**సూపర్‌పవర్ అనే భావన గురించి మాట్లాడుకోవాలంటే..**

సూపర్ పవర్ అనేదే మూర్ఖత్వపు భావన! అసలు సూపర్‌పవర్ అంటే ఏంటో కూడా చాలామందికి తెలియదు. రాజకీయ నాయకులు ఆవేశంగా సూపర్‌పవర్ అంటూ నినాదాలివ్వగానే.. ప్రజలంతా ఉద్వేగంగా తలూపటం కాదు. వాస్తవాల్ని విశ్లేషించాలి. నిజంగా సూపర్‌పవర్‌గా ఎదిగామని భావించిన దేశాలు, సమాజాలు, నాగరికతల రికార్డేంటి? అవెక్కడున్నాయిప్పుడు? ఒక్కసారి గతంలోకి తొంగిచూస్తే.. ఈజిప్షియన్లు, రోమన్లు, ఇంగ్లిష్‌వారు, ఫ్రెంచివారు.. సూపర్‌పవర్లుగా ఎదిగారు. వారి పరిస్థితేంటిప్పుడు? అంతెందుకు ఇప్పుడు సూపర్ పవర్ అనుకుంటున్న దేశం కూడా జారుడుమెట్లపై ఉంది! కాబట్టి ఆ తరహా సూపర్‌పవర్ అవటమంటే.. భవిష్యత్‌లో కన్పించకుండా పోవటమే! మరి ఎందుకా కోరిక? కాబట్టి ఆ మూర్ఖపు సూపర్‌పవర్ ఆలోచనను వదిలేసి.. మానవాళికి మేలుచేసే, సగటు జీవికి భద్రత కల్పించే పనుల గురించి ఆలోచించటం, ఆచరణలో పెట్టటం మేలు!

**ఇది ఆచరణలో సాధ్యం కావాలంటే ఏం చేయాలి?**

వేల సంవత్సరాల క్రితం గణితం, ఖగోళం గురించి మన సమాజానికెంతో వైజ్ఞానిక భావనలుండేవి. సున్నాను కనుగొనటం, అనేక గణిత భావనలు, వైద్యరంగంలో శస్త్రచికిత్స పరికరాల వినియోగం.. ఇవన్నీ మన ఫిలాసఫీలో ఉన్నాయి. అలాగే చైనీయులు కూడా! ఇప్పుడు ఆధునికం అనుకుంటున్న అనేక పదార్థాలను (గన్‌పౌడర్, కాగితం..) చైనీయులు ఆవిష్కరించారు. కానీ మనంగానీ, చైనీయులుగానీ ఎప్పుడూ ప్రపంచాన్ని ఆక్రమించుకోవటానికి, కాలనీలు ఏర్పాటు చేసుకోవటానికీ ఈ విజ్ఞానాన్ని ఉపయోగించలేదు. పాశ్చాత్య నాగరికత మాత్రం తమ విజ్ఞానాన్ని సామ్రాజ్య విస్తృతికి, భూమండలంపై తమ ఆధిపత్యాన్ని పెంచుకోవటానికి వినియోగించాయి. ఆక్రమించిన ప్రతి దేశాన్నీ దోచుకుని.. స్వల్పకాలంపాటు ఆ ఆధిపత్యాన్ని ప్రదర్శించగలిగారు. కానీ ఇప్పుడు? ద్వితీయ, తృతీయశ్రేణి దేశాల సరసన ఉన్నారు. కాబట్టి.. మన మానవ విజ్ఞానాన్ని ప్రాధాన్యక్రమంలో మనందరి కనీస అవసరాలను తీర్చేందుకు వాడాలి! మిగిలిన దేశాలన్నీ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) పెంపు లక్ష్యంగా పరిగెడుతుంటే, భూటాన్‌లాంటి దేశం – స్థూల జాతీయ సంతోషాన్ని (గ్రాస్ నేషనల్ హ్యాపీనెస్) తన లక్ష్యంగా చేసుకుంది.

ఆ లక్ష్య సాధనలో మంచి చదువు, మంచి పర్యావరణం, శాస్త్రసాంకేతికాభివృద్ధి.. కూడా సమ్మిళితమై ఉన్నాయి. అంతిమంగా వీటన్నింటివల్లా తమ ప్రజలు సంతృప్తితో.. సంతోషంగా ఉండాలని కోరుకుంటోంది. ఎక్కువ ఖర్చు చేస్తేనో.. మూడునాలుగు కార్లుంటేనో.. కోట్ల రూపాయలుంటేనో.. సంతృప్తి, సంతోషం లభించవు. పల్లెల్లో ఏమీ లేకుండా ఉన్నా.. పట్టణాల్లో కోట్ల రూపాయలు కూడబెట్టుకున్నా – మనిషికి సంతోషం, కోపం, బాధ లాంటి ఉద్వేగాలు సమానమే! ఆ ఉద్వేగాల నాణ్యతేంటన్నదే ప్రధానం! పల్లెటూర్లో ఉంటూ హాయిగా నవ్వే ఓ పిల్లాడి సంతోషం.. కోట్ల రూపాయలకు పడగెత్తి పట్టణంలో ఉండేవారి సంతృప్తికి ఏమాత్రం తీసిపోదు. చాలాకాలంగా.. మన భారతదేశంలో ఒక ప్రయత్నం సాగుతోంది! ఎంతగా భౌతిక వస్తువులు, ఆస్తులుంటే అంత గొప్ప అనే పాశ్చాత్యభావన వెనక పరుగెడుతూ.. ప్రజలపై కూడా అదే భావనల్ని రుద్దే ప్రయత్నం జరుగుతోంది. సెల్‌ఫోన్లు, కార్లు, కోట్ల డబ్బులుండాలి.. పట్టణాలకు వలసపోవాలనే ఆలోచనల్ని అందరిపైనా రుద్దుతున్నారు.

**మరి భారత్ ముందున్న కర్తవ్యం?**

గారడీవాళ్లు ఓ కర్రను పట్టుకుని తీగపై నడుస్తూ విన్యాసాలు చేస్తుంటారు. మనదేశం పరిస్థితిప్పుడు ఆ తీగపై మధ్యలో ఉన్నట్టుంది. మనకున్నదాన్ని వదిలేసి.. అగ్రదేశాలనుకునేవారి ఎండమావి వెంట పరిగెడుతున్నాం. ఆ 'అగ్ర' పేరు సంపాదించినవారేమో.. వాతావరణ మార్పులనే నినాదంతో మా దారికి రాకండని వారిస్తున్నారు. వెనక్కి వెళ్లలేం.. ముందుకు కదల్లేని పరిస్థితి! తీగపై కిందపడకుండా స్థిరపడ్డాక.. జాగ్రత్తగా ఆలోచించి.. ముందుకెళ్లే బదులు హేతుబద్ధమైతే అడుగులు వెనక్కి వేసినా మేలే!

**ఇంతకూ మానవాళి భవిష్యత్ ఎలా ఉండబోతోంది?**

ప్రపంచంలోని, ఈ భూమి మీదున్న మిగిలిన అన్ని జీవులతో మనం ఎలా సహవాసం చేస్తామనే దాన్ని బట్టే మన భవిష్యత్ ఆధారపడి ఉంటుంది. సాంకేతికంగా వచ్చిన వాట్సప్ తదితర సామాజిక మాధ్యమ వేదికలు.. ప్రపంచంలో ఎక్కడున్నా ఒకరినొకరం పలకరించుకోవటానికి, మాట్లాడుకోవటానికి వీలు కల్పించే అద్భుత సాధనాలు. వీటిని గంటలు గంటలు అనవసర కార్యక్రమాలకు వృధా చేయకుండా, ప్రాంతాలు దేశాలు అనే సరిహద్దులను దాటి మనుషులమంతా కలిసి మానవాళికి మేలు చేసే పనులకు ఉపయోగించాలి. ఆలోచనలను పెంచుకోవాలి, పంచుకోవాలి. ❖

# ఉత్తరాంధ్ర సుజల స్రవంతిపై ఉలుకూ పలుకూ లేదే?

**కో**టి మందికిపైగా ప్రజలకు తాగు, సాగునీరందించే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జలవనరుల మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఆయా జిల్లాల మంత్రులు కనీసం మాట్లాడకపోవటం దారుణమని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

పురుషోత్తపట్నం ఎత్తిపోతలపై పదేపదే మంత్రులు, అధికార యంత్రాంగం ప్రకటనలు చేస్తున్నారని, దీనివల్ల ఉత్తరాంధ్ర ప్రజలకు తాగు, సాగు అవసరాలు పూర్తిస్థాయిలో తీరవని బాబ్జీ అన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తయితే విశాఖపట్నంలోని 3.21 లక్షల ఎకరాలు, విజయనగరం జిల్లాలోని 3.94లక్షల ఎకరాలు, శ్రీకాకుళం జిల్లాలోని 0.85లక్షల ఎకరాలు మొత్తం 8లక్షల ఎకరాలకు సాగునీరు, 1200 గ్రామాలకు తాగునీరు లభిస్తుందని తెలిపారు. ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి కూడా దీన్ని నెరవేర్చటం లేదన్నారు. ఇటీవల లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించినప్పుడు కూడా.. ప్రాజెక్టు పనులు చురుగ్గా, సంతృప్తికరంగానే సాగుతున్నా పోలవరం ఎడమ కాలువ పనులు ఇంకా చేపట్టలేదని గుర్తించామన్నారు. ఉత్తరాంధ్ర అవసరాలకోసం ఉద్దేశించిన ఎడమ కాలువ పనుల్ని పోలవరం తొలిదశలోనే 58 కిలోమీటర్ల మేర పూర్తిచేయాల్సి ఉందన్నారు. అవసరమైన చిన్న ఎత్తిపోతల్ని కూడా చేపట్టాల్సుందన్నారు. పోలవరం పనుల్ని ఆపొద్దని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వాన్ని, విడిపోయాక చంద్రబాబు ప్రభుత్వాన్ని లోక్‌సత్తా పలుమార్లు గట్టిగా డిమాండ్ చేసినా తాత్సారం చేశారన్నారు. పోలవరం పూర్తి చేసేట్టయితే పట్టిసీమ అనవసరమని తొలినుంచీ తాము చెబుతున్నామన్నారు. రాజకీయ అవసరాల కోసం పోలవరాన్ని జాప్యం చేసి, పట్టిసీమను కట్టి ప్రజల మీద పెనుభారం మోపారని, రైతులకు నష్టం కలిగించారని అన్నారు. గిరిజనుల కోసం ఎంతో చేస్తున్నామని చెప్పుకుంటున్న చంద్రబాబు ఏజెన్సీ ప్రాంతాల్లో సరైన వైద్యం అందక వారు నరకయాతన పడుతున్నా తగిన చర్యలు తీసుకోలేకపోయారన్నారు. ఒక్క గిరిజన మంత్రిని కూడా ఎందుకు నియమించలేదో జవాబు చెప్పాలన్నారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ నేతలు సాంబశివరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు. ❖

# సెప్టెంబర్ 17ను అధికారికంగా జరపడానికి తెరాస ప్రభుత్వం ఎందుకు భయపడుతోంది?

- సాతులూరి గోవిందరావు,
లోక్‌సత్తా పార్టీ తెలంగాణ ప్రధాన కార్యదర్శి,
ఫోన్ : 99853 46047

దేశానికి స్వతంత్రం వచ్చిన ఆగస్టు 15ను ఎలాగైతే జాతీయ పండుగగా జరుపుకుంటామో అదేరీతిలో దానికి కొనసాగింపుగా సెప్టెంబర్ 17ను కూడా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరపాలని లోక్‌సత్తా తొలి నుంచీ డిమాండ్ చేస్తోంది. ఇది జాతీయ పండుగ కాబట్టి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా తెలంగాణతోపాటు కోస్తాంధ్ర, రాయలసీమల్లో కూడా లోక్‌సత్తా కార్యాలయాల్లో జాతీయజెండాను ఎగురవేసి పండుగ జరుపుకున్నారు. భారత్‌లో విలీనమైన చిట్టచివరి సంస్థానం విలీనమైన ఈ సందర్భాన్ని జాతీయ సమైక్యతకు సంకేతంగా పేర్కొంటూ, సెప్టెంబర్ 17ను జాతి ఐక్యతా దినోత్సవంగా లోక్‌సత్తా భావిస్తుంది. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరపాలని ఉద్యమ సమయంలో తెరాస వ్యవస్థాపకుడు కె.చంద్రశేఖరరావు కూడా డిమాండ్ చేశారు. కానీ ముఖ్యమంత్రి అయ్యాక గమ్మునుండిపోయారు. సెప్టెంబర్ 17ను విమోచనదినోత్సవమనాలా? విముక్తిదినోత్సవమనాలా? అన్న దిక్కుమాలిన చర్చ అక్కర్లేదు. 1947లో ఆగస్టు 15న దేశమంతా బ్రిటిష్ పాలన నుంచి స్వేచ్ఛావాయువుల్ని పీల్చుకుంటే, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 13నెలల 2రోజులకుగానీ తెలంగాణ ప్రజలకు స్వాతంత్ర్యం రాలేదు. దేశమంతా జెండా ఎగరవేస్తూ సంబరాలు జరుపుకుని స్వేచ్ఛావాయువులు పీలుస్తుంటే, ఇక్కడి ప్రజలు మాత్రం దుర్భర అణచివేతకు గురవుతూ పోరాడారు. సుదీర్ఘ ప్రజాపోరాటంతో నిజాం రాచరిక కబంధ హస్తాల నుంచి 1948 సెప్టెంబర్ 17న ప్రజలు స్వేచ్ఛ సాధించి జాతీయజెండాను ఎగురవేశారు. ఆరోజున దాదాపు మూడువేల గ్రామాలు విముక్తి చెందాయి. నియంతృత్వాన్ని కూల్చి అంతిమంగా విజయం సాధించాయి. ఈ మహోద్యమాన్ని గుర్తించకపోతే ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరచటమే. అలాంటి విశిష్ట సందర్భాన్ని గౌరవించటం ప్రభుత్వ విధి. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి సంకేతమైన ఈరోజును స్వాతంత్ర్యదినోత్సవంలాగా తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి. తెరాస ప్రభుత్వానికి భయమెందుకు? అప్పటి హైదరాబాద్ రాష్ట్రంలో ఉంటూ విముక్తమైన మహారాష్ట్రలోని ఐదు జిల్లాల్లో, కర్ణాటకలోని మూడు జిల్లాల్లో సెప్టెంబర్ 17న అధికారికంగా ఉత్సవాలు నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది.

స్వాతంత్ర్యపోరాటాన్ని, హైదరాబాద్ సంస్థాన విమోచనను



హైదరాబాద్ విమోచనతో భారతదేశం సంపూర్ణంగా స్వతంత్రమైందని గోలకొండ పత్రిక ప్రచురించిన కథనం

హేళన చేసేవారు మూర్ఖులు. నిజాంపాలనను అంతంచేసిన సెప్టెంబర్ 17న ఉత్సవాలు జరపటం మతసామరస్యాన్ని దెబ్బతీస్తుందంటూ వీటికి దూరంగా ఉండాలని చేస్తున్న వాదనలు చరిత్రను అర్థంచేసుకోకపోవటమే. భారతదేశాన్ని ఏకం చేసిన రోజు ఇది, నిజాం భారత పౌరుడు.. ఈ వాస్తవాలను గుర్తించాలి.

ఒకే జాతి, ఒకే భాష, ఒకే మతం కలిగి, మనదేశంలో ఓ రాష్ట్రం కంటే చిన్నదైన ఇటలీ ఏకీకరణకు 19వ శతాబ్దంలో 23ఏళ్ళు పట్టింది. జర్మనీ ఏకీకరణకు బిస్మార్క్ రక్తం ఏరులై పారించినా ఏకీకరణకు 9ఏళ్ళు పట్టింది. అయితే అనేక వైవిధ్యాలున్న భారతదేశంలోని 545కు పైన సంస్థానాలను కేవలం ఏడాది కాలంలో సర్దార్ పటేల్ రక్తంచిందించకుండా ఏకంచేశారు., ఇది ప్రపంచచరిత్రలోనే గొప్పవిజయం.. ఈ విలీనంలో చిట్టచివరిదైన హైదరాబాద్ సంస్థానాన్ని ఏకంచేసే సమయంలో మాత్రమే ఐదుగురు మరణించారు. మిగిలిన ప్రక్రియంతా శాంతియుతంగానే సాగింది. ఈ మహత్తర క్షణాన్ని హిందూ-ముస్లిం మతసమస్యగా మార్చాలనుకోవటం మూర్ఖత్వం. ఈ దేశం ఎవరిసొత్తూ కాదు. 3,500ఏళ్ళుగా ప్రపంచం నలుమూలల్నుంచీ వచ్చిన వివిధ మతాలు, జాతుల వారంతా కలిస్తేనే భారతదేశం ఏర్పడింది. మతాలకతీతంగా అందరూ ఈ దేశస్వాతంత్ర్య వేడుకలను జరుపుకోవాలి.

### జనహితం కోసం సాగే రాజకీయాన్ని తిరిగి ప్రతిష్ఠించాలి

మరోవైపు, ఇది సమీక్షా సందర్భం కూడా. హైదరాబాద్ సంస్థాన విముక్తికోసం, విలీనం కోసం పోరాడిన నేతల తీరును, ప్రస్తుత నేతల తీరును పరిశీలించుకుని రాజకీయాల్లో ఆధునిక రాచరికాన్ని అంతంచేసేందుకు ప్రతి ఒక్కరూ

## రాచరికం నుంచి ప్రజాస్వామ్యానికి.. పరిణామక్రమం

మొగల్ రాజ్య సుబేదార్‌గా దక్కన్ ప్రాంతంలోకి ప్రవేశించిన అసఫ్‌జాహి రాజులు 1720లో రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకున్నాక 1748 వరకు రాజ్యసుస్థిరత కోసం విశేషంగా కృషి చేశారు. అప్పటి నుంచి 1948 సెప్టెంబర్ 17 వరకు సుమారు రెండువందల సంవత్సరాలు హైదరాబాద్ దక్కన్ ప్రాంతాన్ని అప్రతిహతంగా ఆ వంశానికి చెందిన ఏడుగురు రాజులు పాలించారు. భారత స్వాతంత్ర్యం తర్వాత హైదరాబాద్‌కు స్వాతంత్ర్యం ప్రకటించుకున్న ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ కాలంలో రజాకార్ల దురాగతాలు పెచ్చరిల్లిపోయాయి. పట్టణాల్లో పాగా వేసి రజాకార్లు గ్రామాలపై పడి బీభత్సం సృషించేవారు. వీరికి పటేల్ పట్వారీలు, దేశ్‌ముఖ్‌లు వత్తాసు పలికేవారు. ఈ దారుణాలు, అణచివేత పాలన వల్ల.. సంపన్న, కొన్ని రంగాలలో మేలిమి కృషి చేసిన పాలన గల సంస్థానంగా హైదరాబాద్‌కున్న పేరు మరుగునపడిపోయింది. భారత్‌కు స్వతంత్రం వచ్చాక సర్వస్వతంత్రుడిగా హైదరాబాద్‌ను పరిపాలించే కాంక్షతో మీర్ అలీఖాన్ ఐక్యరాజ్యసమితిని కూడా ఆశ్రయించారు. బ్రిటన్‌తోపాటు మరికొన్ని దేశాలు నిజాంకు అనుకూలంగా వ్యవహరించేందుకు సిద్ధంగా ఉన్నాయి. కానీ భారత హోం మంత్రి వల్లభాయ్ పటేల్ పరిస్థితిని అంచనా వేసి జాప్యం చేయకుండా హైదరాబాద్ విముక్తికి ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌పై సైనికచర్య ప్రారంభిస్తే ఇక్కడ నివసిస్తున్న 164లక్షలమంది ప్రజలను ఎక్కడికక్కడ తగులబెడతానని మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లమీన్ అధ్యక్షుడు, రజాకార్ల నాయకుడు కాశీం రజ్వీ హెచ్చరించాడు. వీటిని లెక్కచేయకుండా వల్లభాయ్ పటేల్ ఆదేశాల మేరకు భారత సైన్యాధిపతి లెఫ్టినెంట్ జనరల్ రాజేంద్రసింగ్ 'ఆపరేషన్ పోలో' పేరుతో సైనికచర్యకు ఆదేశాలు జారీ చేశారు. 1948, సెప్టెంబర్ 13న షోలాపూర్, విజయవాడ మార్గాల గుండా భారత సైన్యాలు ప్రవేశించాయి. ఎటువంటి ప్రతిఘటన లేకుండానే యూనియన్ సైన్యాలు హైదరాబాద్‌ను ఆక్రమించాయి. సైన్యాల అకృత్యాలకు పెద్దసంఖ్యలో ముస్లింలు బలయ్యారని కొందరు ప్రాథమిక సాక్ష్యాలున్న వాదనలు వినిపిస్తున్నారు. వీటిని వెలుగులోకి తెచ్చి దోషులను బైటపెట్టాల్సిన అవసరం ఉంది. ఆ మేరకు చరిత్రను సరిచేయాల్సి ఉంది. సెప్టెంబర్ 17వ తేదీన నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ ఆదేశాల మేరకు హైదరాబాద్ సంస్థానం ప్రధాని లాయక్ అలీ మంత్రివర్గం రాజీనామా చేసింది. అనంతరం ఆయన దక్కన్ రేడియోలో ప్రసంగిస్తూ 'హైదరాబాద్ ప్రభుత్వ బాధ్యతలు స్వీకరించవలసిందిగా గవర్నర్ జనరల్ సి.రాజగోపాలాచారికి విజ్ఞప్తి చేశాను. ఈ పని ముందుగానే చేయనందుకు విచారిస్తున్నాను. చాలా ఆలస్యం జరిగింది. క్లిష్టపరిస్థితుల్లో తగిన చర్య తీసుకోలేకపోయారు. బల్లారం, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లను స్వాధీనం చేసుకునేందుకు యూనియన్ సైన్యానికి అనుమతి ఇచ్చాను" అని ప్రకటించారు. అనంతరం 1950 జనవరి 26న నిజాంను భారతదేశ రాజ్‌ప్రముఖ్‌గా గుర్తించి కేంద్ర ప్రభుత్వం గౌరవించింది.

నడుంబిగించాల్సిన సందర్భమిది. సంస్థానాల్ని విలీనం చేసి దేశాన్ని ఏకం చేసిన సర్దార్ పటేల్ పిల్లలు ఏమయ్యారో తెలియదు. సంస్థానానికి తొలి గవర్నర్‌గా పనిచేసిన కె.ఎం మున్షీ వారసులు ఎవరో ఎవరికీ తెలియదు. ఆ తర్వాత వచ్చిన వెల్లోడీ పిల్లలూ సామాన్యుల్లో కలిసిపోయారు. బూర్గుల రామకృష్ణారావు వారసులూ చెట్టుపేరు చెప్పుకుని కాయలమ్ముకునే పనిచేయలేదు. అలాగే స్వాతంత్ర్య సంబరాలలో గాంధీజీ తిరగాడలేదు. కోల్‌కతాలో ఏదో కార్యక్రమంలో ఉన్నారు. ఆయన వారసులు రాజకీయపదవుల కోసం వెంపర్లాడలేదు. రాజ్‌మోహన్ గాంధీ ఎంపీ అయ్యారంటే కేవలం వ్యక్తిగత అర్హతలతోనే. అదేబాటలో చిత్తరంజన్‌దాస్, ప్రకాశం పంతులు, రాజాజీ వంటివారూ పయనించారు. రాజకీయం అంటే మందిహితం కోసం, బిడ్డల భవిష్యత్తు కోసం అని భావించి కృషి చేయటం తప్ప సొంత సంపాదనకు, కుటుంబం ఎదుగుదలకు మార్గం అనుకోవటం తీవ్ర తప్పిదం. ఆ తప్పిదాన్ని చేస్తున్న ఈతరం నేతల నుంచి జాతిని రక్షించాలి. ఈరోజు స్వాతంత్ర్యాన్ని తాకట్టుపెడుతున్నది నక్సలైట్లో, టెర్రరిస్టులో కాదు. మన రాజకీయనాయకులే అధికారం కోసం, అక్రమార్జన కోసం దేశభవిష్యత్తును ఉద్దేశపూర్వకంగా నాశనం చేస్తున్నారు. అందుకోసమే అధికారాన్ని కేంద్రీకరించుకుని, ప్రజల మధ్య చిచ్చుపెడుతూ, రాజకీయాన్ని వ్యాపారంగా మార్చి, వారసత్వాన్ని పెంచిపోషిస్తున్నారు. ఈ ఆధునిక రాచరికాన్ని అంతం చేసి జనహితం కోసం సాగే రాజకీయాన్ని తిరిగి ప్రతిష్ఠించాలి.

స్వాతంత్ర్య ఫలాలు, రాజ్యాంగ ఫలాలు అందరికీ అందలేదని లోక్‌సత్తా మొదట్నుంచీ చెబుతోంది. అంతమాత్రం చేత స్వాతంత్ర్యం, రాజ్యాంగాన్ని కించపరచటం మూర్ఖత్వమే అవుతుంది. వాటి కోసం పోరాడిన యోధుల త్యాగాల్ని మనం అపురూపంగా గౌరవించాలి. గతం అనే పునాదిమీదే భవిష్యత్తు నిర్మితమవుతుంది. గత 5,000 ఏళ్ళ వైవిధ్యభరితమైన మన సంస్కృతిని సమ్మిళితం చేసి ఈరోజు మనం కొత్త రాజకీయాన్ని నిర్మించుకోవాలి. చైనా సహా ప్రపంచంలో ఏదేశానికీ ఇలాంటి విశిష్ట అవకాశం లేదు. నాటి విమోచన సమరయోధుల స్ఫూర్తితో సమాజంలో అన్నివర్గాల నుంచీ ప్రజలు ముందుకు రావాలి. రాజ్యాంగ విలువలను కాపాడుతూ, ఆచరణలో చూపుతూ, కులం, మతం, డబ్బు వివక్షలు లేకుండా అందరికీ ఎదిగే అవకాశాలుండే విధంగా రాజకీయాన్ని మలిచేందుకు కొంత సమయం, వనరులు కేటాయించాలి. ❖



# అద్భుత రాజధాని ఆర్డరేస్తే రాదు..!
# కొమ్మినేని శ్రీనివాసరావు (సాక్షి టీవీ)తో జేపీ

**రాజధాని విషయంలో అద్భుతాలు చేస్తామనడం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దూరదృష్టి లోపమని లోక్‌సత్తా సంస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. విద్య, ఆరోగ్యం, ఉపాధి, సంస్కృతి ఇవన్నీ ఒకదానికి ఒకటి సమకూరితేనే ఆధునిక రాజధాని వస్తుంది తప్ప, ఆర్డర్ వేస్తేనే, భూమి రేట్లు రూ.5కోట్లకు వెళ్లిపోతేనో అకస్మాత్తుగా రాజధాని ఏర్పడదన్నారు. పుష్కరాలు, ఉత్సవాలు వంటి ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లోనే పాలకులు కాలం గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్‌ని పాలకులే కులాల కంపుతో మురికి చేయడం అభివృద్ధికి, ఆధునిక సంస్కృతికి చిహ్నం కాదన్నారు.**

**వాగ్దానాలు, మాటల గారడీలు మాని అధికార వికేంద్రీకరణ, సమర్థ పాలన, ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు లేని సేవలందించటం, విద్య, ఆరోగ్యం ప్రతి బిడ్డకూ అందే ఏర్పాటు చేయడమే తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి మార్గమంటున్న జేపీ అభిప్రాయాలు కొన్ని..**

**చంద్రబాబు ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని పడగొట్టినప్పుడు మీరెలా ఫీలయ్యారు?**

జేపీ: ఒక నాయకుడికి, మిత్రపక్షాలకు 225 సీట్లను కట్టబెడుతూ జనం తీర్పునిచ్చినప్పుడు అర్థరాత్రిపూట ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తిని దింపేస్తే అది ఏరకమైన ప్రజాస్వామ్యం అవుతుంది? ఎలా రాజ్యాంగబద్ధమవుతుంది? సాంకేతికంగా అది చట్టబద్ధం కావచ్చు, కానీ అలాంటి పనిని ఏ పార్టీ చేసినా నైతికంగా తప్పే.

**తెలంగాణ విషయంలో మీరు సరైన వైఖరి తీసుకున్నారా తీసుకోలేదా?**

అప్పటికీ ఇప్పటికీ ఒకటే చెబుతున్నాను. ఆనాడు నేను చెప్పింది వాస్తవం అని రుజువవుతోంది. రాజ్యవ్యవస్థ మారకుండా రాజధాని మారితే ప్రయోజనం లేదు. రాష్ట్రం పేరు మారితే పెద్దగా ఏమీ ఒరగదు. తెలంగాణ కావాలంటే తెచ్చుకుందాం కానీ అదొక్కటే సరిపోదు అని ఆనాడే చెప్పాను.

**సోనియా గాంధీ తెలంగాణ ఇవ్వడం కరక్టని తేలిందా లేదా?**

పార్టీ కోణం నుంచి అయితే రెండు చోట్లా చతికిలపడిపోయారు కదా. ఏపీలో ఒక తరం వరకు కాంగ్రెస్ పార్టీ పుంజుకోకపోవచ్చు. తెలంగాణలోనూ ఆ పార్టీ నుంచి చాలామంది జారుకుంటున్నారు. రాజకీయంగా అద్భుతాలు సాధిస్తామనుకుని, ఓడిపోయారు. అయితే తెలంగాణ ప్రజలు దేశాన్ని కాపాడారు. తెలంగాణ సాధించిన కీర్తిని ప్రజలకు కాకుండా సోనియాకు కట్టబెట్టినట్లయితే బీజేపీ లేదా కాంగ్రెస్.. రాష్ట్ర శాసనసభతో, ప్రజల మనోభావాలతో నిమిత్తం లేకుండా ఓట్ల కోసం, సీట్ల కోసం ఈ దేశంలో అన్ని చోట్లా ఇదే ప్రయోగానికి ఒడిగట్టేవాళ్లు. ఇప్పుడిక ఈ సాహసాన్ని ఎవరూ

చేయరు. ప్రజలు తమకు తాముగా కోరుకుని, వారి మధ్య సంఘీభావంతో ఒక ఒప్పందానికి వస్తే తప్ప ఢిల్లీలో బలవంతంగా విభజన చేస్తామనే ప్రయత్నం ఇక ఎవరూ చేయరు.

**కేసీఆర్, చంద్రబాబు పాలన ఎలా ఉంది?**

కేసీఆర్ పాలనలో రెండు మూడు అంశాలు నాకు నచ్చాయి. సింగపూర్ నుంచి, బ్రిటన్ దాకా గృహనిర్మాణం ఆధునిక ప్రపంచంలో చాలా కీలకమైనది. అలాగే ఇరిగేషన్, నీటి సంరక్షణ వగైరా. అధికార వికేంద్రీకరణ చేస్తామన్నారు. పంచాయతీలకు ఏడాదికి 5వేల కోట్లు ఇస్తానని కేసీఆర్ అన్నప్పుడు నా గుండె ఉప్పొంగింది. తొలి నుంచి మేం పోరాడుతున్నది దాని మీదే కదా. కానీ ఆయన ఇప్పుడు అలా చేయడం లేదు. ఏపీ విషయంలో బాబుకు గతంలో ఉన్న విస్తృతస్థాయి దృక్పథం కనుమరుగైంది. పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తున్నారు కానీ, అధికార వికేంద్రీకరణపై దిశానిర్దేశం లేకుండా కులాల జంజాటంతోనే కాలం గడిపేస్తున్నారు. తాత్కాలికమైన కానుకలు, పుష్కరాలు, అమరావతికి శంకుస్థాపనలు.. ఇలా ఈవెంట్ మేనేజ్‌మెంట్ తప్ప మరేమీ జరగటం లేదు.

**అమరావతి ప్రపంచంలోనే నెంబర్‌వన్ రాజధాని అంటున్నారు. నిజమేనా?**

ప్రజల హృదయాలు కాస్త గాయపడ్డాయి కాబట్టి, హైదరాబాద్‌కు దీటుగా ఏర్పాటు చేసుకుంటామనటంలో తప్పు లేదు. కానీ రాజధాని సహజంగా నిర్మాణం కావాలి. దీన్నే ఆర్గానిక్ గ్రోత్ అంటాం. విద్య, ఆరోగ్యం, ఉపాధి, సంస్కృతి ఇవన్నీ ఒకదానికి ఒకటి సమకూరాలి. దాంతోనే ఆధునిక రాజధాని వస్తుంది తప్ప.. మీరు ఆర్డర్ వేస్తేనో, భూమి రేట్లు 5కోట్లకు వెళ్లిపోతేనో ఆకస్మికంగా జరగదు. ఒక యాభై ఏళ్లు, వందేళ్లు పడుతుందని భావించి దానికనుగుణంగా పునాదులు వేస్తే మీరనుకున్నది జరుగుతుందికానీ పాలకుడు ఆదేశిస్తే జరిగేది కాదు. అమరావతిలో రాజధాని విషయంలో ఏం జరుగుతోందో నాకు అర్థం కావటం లేదు. అద్భుతాలు చేస్తాం అన్నారు. ల్యాండ్ పూలింగ్ చేశారు. ఇచ్చినవారు సంతోషంగా ఇచ్చారు. భూమి ఇస్తే పెరిగే విలువలో రైతుకు వాటా ఉంటుందంటే సంతోషమే కదా. రేపు పొద్దున భూమి రేటు పెరిగితే నాకు కూడా వాటా ఉంటుందనే భావన కలగాలి గానీ.. నేను తీసేసుకున్నాను, మీ చావు మీరు చావండి, నేను అమ్మేసుకున్నాను అంటే పద్ధతి కాదు.

**ఓటుకు కోట్లు కేసుపై మీ అభిప్రాయం?**

కౌన్సిల్‌కు ఉన్న ఒకే ఒక్క అధికారం ఏమంటే, అసెంబ్లీ చేసిన నిర్ణయాలను 90 రోజులపాటు ఆపగలగటమే. ఇది తప్పితే దానికి ఏ అధికారమూ లేదు. దాంట్లో ఒక కౌన్సిల్ సభ్యుడి విషయంలో మీకు అధికారమే లేని రాష్ట్రంలో ఇంత రాద్ధాంతం ఏమిటి? ఓటుకు డబ్బులిస్తే, పార్టీ ఫిరాయింపులు చేస్తే తప్పకుండా రాజ్యాంగ విరుద్ధమే. ఆ టేపులో గొంతు మీదా కాదా అని బాబును నేను ఎన్నడో ప్రశ్నించాను. కానీ ఇలాంటి వ్యవహారాల్లో పవిత్రులెవరు? అపవిత్రులెవరు? ఎన్నికలలో పోటీచేసినప్పుడు బీజేపీ ఇతర పార్టీలు ఎంపీ సీటుకి 20, 30 కోట్లు ఖర్చుపెట్టలేదని ఎవరైనా గ్యారంటీ ఇవ్వగలరా?

**రెండు రాష్ట్రాల తెలుగు ప్రజలకు మీ సందేశం?**

తొలుత మనందరి మనసుల్లో కాస్త భయం ఉండింది. రెండు రాష్ట్రాలు వచ్చేశాయి. ఈ ఆంధ్ర, తెలంగాణ భావం జనం మనసుల్లో ఉండి కలుషిత వాతావరణం సృష్టిస్తే గందరగోళం నెలకొంటుందని అనుకున్నాం. అలా జరగనందుకు ప్రధానంగా కేసీఆర్‌ని, తెలంగాణ ప్రభుత్వాన్ని అభినందించాలి. రాజకీయం కోసం గతంలో ఏం జరిగినప్పటికీ ఒక సామరస్య వాతావరణం మాత్రం తీసుకొచ్చారు. దానికి మనం సంతోషపడాలి. రెండోది, ఆంధ్ర ప్రజలేమో మాకు అన్యాయం జరిగిపోయిందని అనుకున్నారు. కానీ మన సమస్యలకు ఇంకొకళ్లు కారణం కాదు అని గ్రహించాలి. తెలంగాణ ప్రజలు గతంలో ఈ వాదన చేశారు. ఆ వాదన తప్పని ఆనాడూ చెప్పాను. ఇప్పుడు ఆంధ్ర ప్రజలు ఆ వాదన చేస్తున్నారు. అది తప్పని ఇప్పుడు చెబుతున్నాను. మన సమస్యలకు పరిష్కారాలు మన చేతుల్లోనే ఉన్నాయి. మన పరిపాలనలో, మన రాజకీయంలో, మన సమాజం నడిచే తీరులో, మనందరి ఆలోచనలలో ఉన్నాయి తప్పితే ఇంకెక్కడి నుంచో సమస్యలు రావు. పై నుంచి ఏమిచ్చినా పుచ్చుకుందాం. అది మన హక్కు. వాళ్లేం దానంగా ఇవ్వటం లేదు. ప్రత్యేక రాష్ట్రం వచ్చేస్తే అద్భుతాలు జరిగిపోతాయి, పదో తరగతి చదివితే చాలు ప్రతి ఇంటికీ ఉద్యోగం వచ్చేస్తుంది, అందరికీ మూడు ఎకరాలు వచ్చేస్తాయి అంటూ తెలంగాణ ప్రజలు రకరకాల కలలు కన్నారు. ఇప్పుడు మీకు అర్థమైంది. కాబట్టి ఇప్పుడు అధికార వికేంద్రీకరణ, సమర్థ పాలన, ప్రజలకు సేవలందించటం, మంచి ప్రమాణాలతో విద్య, ఆరోగ్యం ప్రతి బిడ్డకూ అందే ఏర్పాటు చేయడం మీద దృష్టి పెట్టండి. ❖

# 9,000 కిలోమీటర్ల రోడ్లు.. 18,000 గుంతలు



వానలు సరిగా పడటంలేదని తెలంగాణ అంతా తెగ ఆందోళన పడుతుంటే, పడిన కాస్త వర్షానికి కూడా గ్రేటర్ హైదరాబాద్ సతమతమైంది. వానలు పెరిగాక ఉక్కిరిబిక్కి రయింది. గుంతలకు దొరక్కుండా, దుమ్ము పీల్చ కుండా ప్రయాణించే క్రమంలో హైదరాబాదీలు అలసిసొలసిపోతున్నారు. 'ఆ సిటీ బస్సులేంటి, ఆ రోడ్లేంటి?.. ఏమైంది హైదరాబాద్‌కి' అని రోజుకి ఒక్కసారైనా అనుకోనివారుండరేమో! రోడ్లు బాగాలేదని ట్రిప్పుల్ని కట్ చేయటం, ప్రజలు గంటల తరబడి బస్సుల కోసం స్టాపుల వద్ద ఎదురుచూడటం ఆనవాయితీగా మారింది. ప్రయాణీకుల్ని తీసుకెళ్లి డిపోలో బస్సుల్ని రిపేరు చేయిస్తున్న ఘటనలూ చోటు చేసుకుంటున్నాయి. దారినపోయే దానయ్యనని స్వయంగా చెప్పుకున్న ముఖ్యమంత్రి హయాంలో కూడా నగరంలో ప్రయాణం ఇంత అధ్వాన్నంగా లేదు.

గ్రేటర్ హైదరాబాద్‌లో సుమారు 9,000 కిలోమీటర్ల రోడ్లు ఉంటే ప్రతి వర్షాకాలంలో 1,500 కిలోమీటర్ల మేర డ్యామేజి అవుతుంటాయట. ఇందుకోసం ఏటా రూ.400 కోట్లు బడ్జెట్ చూపుతున్నారు. ఫుట్‌పాత్‌లు, ఫుటోవర్ బ్రిడ్జీలకు ఇంకో రూ.200-300కోట్లు వెచ్చిస్తుంటారు. కానీ ఇంత చేస్తున్నామని అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పుకుంటున్నా గత రెండేళ్లుగా పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారైంది. ఈ ఏడాది ఇప్పటికే రూ.60కోట్లు ఖర్చు చేశామని చెబుతున్నా, గుంతలతో ఖరాబు కానీ రోడ్లు కనిపించవు.

ఓ ఆంగ్ల పత్రికకు అధికారులిచ్చిన సమాచారం ప్రకారం.. జూబ్లీ హిల్స్, బంజారాహిల్స్, హిమాయత్‌నగర్, బషీర్‌బాగ్, ట్యాంక్‌బండ్, దోమల్‌గూడ, కింగ్‌కోఠి, చందానగర్, బేగంపేట్, సైదాబాద్, చాదర్‌ఘాట్, చార్మినార్, ధూల్‌పేట ఇలా హైదరాబాద్ రోడ్ల మీద జులై-ఆగస్టునాటికి 18,568 గుంతలు ఉన్నాయి. అంటే, ప్రతి కిలోమీటరుకూ సరాసరిన రెండు గుంతలు! టెలిఫోన్, ఇంటర్నెట్ ప్రొవైడర్లు తవ్వుతున్నారని, మెట్రో రైలు పనులు జరుగుతుండటం వల్లే రోడ్లు తరచూ దెబ్బతింటున్నాయని అధికారులు చెబుతున్న కారణాలను తొలుత ప్రజలు నమ్మినా ఇప్పుడిప్పుడు వాస్తవాల్ని గుర్తిస్తున్నారు. వెన్నుపూస, మెడ నొప్పులు తదితర అనారోగ్య సమస్యలు, వాహనాల రిపేరు ఖర్చుల భారంతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్న రాజకీయాన్ని, పాలనను నిస్సహాయంగా భరిస్తున్నారు. గుంత కనపడితే ఊరుకోనని సాక్షాత్తూ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు చెప్పినా, మునిసిపల్ శాఖా మంత్రి కె.తారకరామారావు భరోసా ఇస్తున్నా క్షేత్రస్థాయిలో మార్పు రావటం లేదు. రోడ్ల రిపేరు కాంట్రాక్టర్లకు వరంగా మారింది. ప్రామాణికంగా వేసిన రోడ్డు దాదాపు మూడేళ్ల నాణ్యతతో ఉండాలి. కానీ నాసిరకం తారు వేయటం, రోడ్ల నిర్మాణంలో స్లోపులు సరిగా లేకపోవడంతో నీళ్లు చేరి గుంతలు ఏర్పడుతున్నాయి. ఆ గుంతల్ని పూడ్చడానికి కూడా సరైన ప్రమాణాలు పాటించకపోవటంతో అదో నిరంతర సమస్యలా కొనసాగుతోంది. ప్రమాదాలకూ కారణమవుతోంది.

రోడ్డుపై తారు వేసే ముందు ఉన్న పొరను తొలగించి (మిల్లింగ్) కొత్త పొర వేయకుండా ఉన్నదాని మీదే వేసేయటంతో రోడ్లు చిన్నవర్షాలకే ఖరాబవుతున్నాయి. వర్షాలేకాదు, కొంతమంది ప్రజలు కూడా బాధ్యతారహితంగా రోడ్ల మీదకు నీళ్లు వదులుతున్నారని ఇటీవల జీహెచ్ఎంసీ మేయర్ బంతు రామ్మోహన్ బైటపెట్టారు. దోషులకు జరిమానా విధించేలా చేశారు. కానీ మేయర్, కార్పొరేటర్లు రెగ్యులర్‌గా ఇలా చొరవ తీసుకుని పనిచేసేందుకు తగిన అధికారాలు, వనరులు లేవాయె! మెట్రో పనులంటూ ఎల్ అండ్ టీ అలా రోడ్ల మీదకు నీళ్లు వదులుతుంటే మేయర్ కూడా ఏమీ అనలేని పరిస్థితి. వార్డు కమిటీలు మొక్కుబడిగానే ఉన్నాయి.

మేయర్ నుంచి వార్డు స్థాయి వరకూ అధికారాలు, నిధులు లేకపోవడం, జవాబుదారీతనం కొరవడటం, అవినీతి తదితరాలన్నీ కలిసి 90లక్షల జనాభా వున్న హైదరాబాద్‌ని నరకప్రాయంగా చేస్తున్నాయి. నేతలు చెబుతున్నట్టు భవిష్యత్తులో మెట్రో ప్రారంభమై పరిస్థితి మెరుగుపడినా, ఆటనియమాల్ని మార్చుకుంటే.. ఎలాగోలా అంతా బాగుందనిపించేలా నగరాన్ని నడిపించటానికి కూడా అవసరానికి అనేకరెట్లు ఎక్కువ నిధుల్ని (ప్రజల పన్నుల డబ్బును) పారించాల్సి ఉంటుంది.

కొసమెరుపు: మ్యాన్‌హోళ్లు, నాలాలు పొంగిపొర్లటం, నాలాలపై ఆక్రమణల్ని తొలగించటం మొదలుపెట్టగానే నేతలు, అధికారులు రంగంలోకి దిగి వాటిని నిలుపు చేయటం, చెరువుల్లోకి రసాయన వ్యర్థాలు వెళ్లి నురగలు ఏర్పడటం, కాలుష్యం కూడా జీహెచ్ఎంసీలో షరా మామూలుగానే కొనసాగుతున్నాయి. ❖



# 'పౌరసేవల చట్టాన్ని అన్ని విభాగాలకు, ప్రజలందరికీ విస్తరించండి' ... నమూనా చట్టాన్ని చంద్రబాబుకి పంపిన జేపీ



ఆంధ్రప్రదేశ్‌లో వ్యాపార కలాపాలు చేసేవారికి చకచకా పనులు జరగటం కోసం 40 సేవలలో పబ్లిక్ సర్వీస్ డెలివరీ గ్యారంటీ (పౌర సేవల చట్టం/పీఎస్‌డీ) చట్టాన్ని తేవాలని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం అభినందనీయమని, ఇదే పౌర సేవల చట్టాన్ని అన్ని ప్రభుత్వ విభాగాలకు, ప్రజలందరికీ వర్తించేలా విస్తరించాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు, ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) ప్రధాన కార్యదర్శి డా|| జయప్రకాష్ నారాయణ్ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి లేఖ రాశారు.

రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు, వేధింపులు లేకుండా నిర్ణీత గడువులోగా హక్కుగా పనులు జరిగేలా చేసేందుకు ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా ఇప్పటికే రూపొందించిన 'హక్కుగా పౌరసేవల చట్టం' (ఆర్‌టీపీఎస్/సర్వీస్ గ్యారంటీ) ముసాయిదా బిల్లును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వినియోగించుకోవాలని జేపీ కోరారు.

**ఆర్‌టీఐ, లోక్‌పాల్ కన్నా శక్తిమంతమైన ప్రజా చట్టమిది, ఆంధ్రప్రదేశ్ సుపరిపాలన ప్రస్థానంలో మైలురాయి అవుతుంది.**

ప్రభుత్వ కార్యాలయంలో ప్రతి పనికీ నిర్దిష్ట గడువు, చెప్పిన సమయంలోగా పని చేయకపోతే ప్రతి రోజూ దరఖాస్తు చేసుకున్న ప్రజలకు నష్టపరిహారం.. వంటి ఏర్పాట్లతో పకడ్బందీగా, ఆచరణాత్మకంగా ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా రూపొందించిన సర్వీస్ గ్యారంటీ చట్టం ఆంధ్రప్రదేశ్ సుపరిపాలన ప్రస్థానంలో మైలురాయి అవుతుందని జేపీ అన్నారు. ప్రతిపాదిత 40 సేవలకు ఏపీ బిజినెస్ యాక్షన్ సంస్కరణ ప్రణాళిక, 2017లో భాగంగా పబ్లిక్ సర్వీస్ డెలివరీ గ్యారంటీని వర్తింపచేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్టు వార్తా కథనాలు చదివానని, ఆ చట్టాన్ని ఇదే తరహాలో గడువు, నష్టపరిహారం వంటి నిబంధనలతో రూపొందించి ఇతర ప్రభుత్వ సేవలకూ వర్తింప చేస్తే.. సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ), లోక్‌పాల్ చట్టంకన్నా చాలా శక్తిమంతమైన ప్రజా చట్టం అవుతుందన్నారు.

**చంద్రబాబుకు రాసిన లేఖతో పాటు ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా రూపొందించిన 'పౌర సేవల' చట్టం నమూనాను కూడా జేపీ జత చేశారు. లేఖను లోక్‌సత్తా వర్గాలు మీడియాకు విడుదల చేశాయి.**

**ఆన్‌లైన్ సేవలు సహా అన్నిటికీ ఒకే చట్టం**

సిటిజన్స్ ఛార్టర్లు, సర్వీస్ గ్యారంటీ చట్టంపై ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ఉద్యమం ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్నాయని జేపీ తెలిపారు. ఈ అంశంపై పార్లమెంటరీ కమిటీ ముందు కూడా చర్చించామన్నారు. పార్లమెంటరీ కమిటీ కోరిక మేరకు సాధారణ

ప్రభుత్వ సేవలను, ఎలక్ట్రానిక్ సేవలను కలిపి సింగిల్ బిల్లుగా రూపొందించి ముసాయిదాను అందించామన్నారు. కంప్యూటరీకరణ పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో అన్ని రకాల సేవలనూ ఒకే గొడుగు కిందకు తెచ్చి సామాన్య ప్రజలకు అవసరమైన చాలా సేవలను తేలిగ్గా, నాణ్యమైన రీతిలో అందించే ఒకే చట్టాన్ని అమలు చేయటం అవసరమన్నారు.

**హక్కుగా పౌరసేవలు బిల్లులోని 5 ముఖ్యాంశాల్ని లేఖలో జేపీ పేర్కొన్నారు..**

**1) అన్ని ప్రజాసేవలకు చట్టబద్ధ గ్యారంటీ ఉన్న సిటిజన్స్ ఛార్టర్ల ఏర్పాటు :** ప్రతి రాష్ట్ర ప్రభుత్వ అథారిటీ/సంస్థ తాను అందించే వస్తువులు-సేవలు, బాధ్యులైన అధికారుల పేర్లు ఉన్న జాబితాతో పాటు సిటిజన్స్ ఛార్టర్లను రూపొందించి ప్రకటించాలి. ప్రజలు దరఖాస్తు చేసిన ప్రతి పనిని పూర్తి చేయటానికి నిర్ణీత కాలవ్యవధిని పేర్కొనాలి. ఆలస్యం జరిగినా, ఆ పనిచేయటం సాధ్యం కాదన్నా ఫిర్యాదు చేసుకోవటానికి పటిష్ఠ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. అలాగే ఎల్లకాలం పాత ఛార్టర్లనే కొనసాగించకుండా.. నిర్ణీత కాలవ్యవధిలో సిటిజన్స్ ఛార్టర్లను సమీక్షిస్తూ అప్‌డేట్ చేస్తుండాలి.

**2) ప్రజా ఫిర్యాదుల తక్షణ పరిష్కార యంత్రాంగం:** ఫిర్యాదుల తక్షణ పరిష్కారానికి యంత్రాంగంలో భాగంగా ప్రతి ప్రభుత్వ సంస్థ సమాచార, సహాయ కేంద్రాలను, వినియోగదారుల హెల్ప్ లైన్లు ఏర్పాటు చేయాలి.

దీంతోపాటు పౌరుల నుంచి ఫిర్యాదులు తీసుకుని, విచారణ చేసి పరిష్కరించేందుకు తగినంతమంది అధికారులను ఏర్పాటు చేయాలి. ఫిర్యాదులపై ఇప్పుడు జరుగుతున్నట్టు వ్యాజ్యాల పేరుతో బోలెడంత సమయం, డబ్బు వృధా కాకుండా ఈ చట్టంలో నిర్ణీత గడువులోగా పరిష్కరించే ఏర్పాటు ఉంటుంది. ఉద్యోగి వల్ల తప్పు జరిగి ప్రజలకు సేవ అందలేదనో, జాప్యం జరిగిందనో నిర్ధారించుకుంటే.. జరిమానా, పరిహారంపై స్వతంత్ర అప్పీలేట్ అథారిటీకి పరిష్కార యంత్రాంగం అధికారి సిఫార్సు చేస్తారు.

**3) పరిష్కార యంత్రాంగం నిర్ణయంపై కూడా అప్పీలుకు అవకాశం:** తన ఫిర్యాదుపై విచారణ సక్రమంగా జరగలేదని పౌరుడు/పౌరురాలు భావించినప్పుడు ముప్పై రోజుల గడువులోగా స్వతంత్ర నిర్దేశిత అథారిటీ (ఐడీఏ)కి అప్పీలు చేయవచ్చు. కార్పొరేషన్/జిల్లా స్థాయిలో ఇది మొదటి అప్పీలేట్ అథారిటీ. ముప్పై రోజులలోగా ఐడీఏ ఈ అప్పీలును పరిష్కరించాలి.

ఆ తర్వాత కూడా పౌరుడు/పౌరురాలికి అసంతృప్తి ఉంటే లోకాయుక్త వద్ద రెండవ అప్పీలును దాఖలు చేయవచ్చు. బిల్లులో లోకాయుక్త అత్యున్నత అప్పీలేట్ అథారిటీగా ఉంటుంది.

**4) జరిమానా, పరిహారం చెల్లింపు విధానం:** దరఖాస్తు చేసుకున్నవారికి సకాలంలో వస్తువులు, సేవలు అందించకుండా విధి నిర్వహణలో తప్పు చేసిన ప్రభుత్వోద్యోగి, ఫిర్యాదు పరిష్కార యంత్రాంగ అధికారి మీద జరిమానా విధించే అధికారాన్ని ముసాయిదా బిల్లు ఐడీఏ, లోకాయుక్తకి కల్పిస్తోంది. సంబంధిత అధికారిపై ఎంత జరిమానా విధిస్తారో అంత మొత్తాన్నీ బాధితునికి చెల్లించాలి. జరిమానా, పరిహారాలకు పరిష్కార యంత్రాంగం చేసిన సిఫార్సులను కూడా పరిశీలించి అప్పీలేట్ అథారిటీ పరిధిలో ధృవీకరిస్తారు.

**5) నిరూపించాల్సిన బాధ్యత అధికారిదే:** ఫిర్యాదు పరిష్కరించాల్సినది కాదని నిరూపించాల్సి వస్తే ఆ బాధ్యత దరఖాస్తుదారుని మీద కాకుండా ఫిర్యాదు పరిష్కార అధికారి మీదే ఉంటుంది.

**లోకాయుక్తదే అత్యున్నత బాధ్యత.. కాబట్టి ఖజానాపై భారం కూడా ఉండదు**

పారదర్శకంగా, జవాబుదారీతనంతో, సేవాభావంతో ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు జరిగేలా చూడాలన్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పాన్ని లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ అందించిన హక్కుగా పౌరసేవల బిల్లు సాకారం చేస్తుందన్న ఆశాభావాన్ని జేపీ వ్యక్తం చేశారు. చట్టం పర్యవేక్షణ, అమలును ఇప్పటికే ఉన్న లోకాయుక్త పరిధిలోకి తేవటం వల్ల ప్రభుత్వ ఖజానాపై ఆర్థికభారం కూడా తగ్గుతుందని, లోకాయుక్త పరిధిలోని న్యాయయంత్రాంగం కూడా బలోపేతమవుతుందని జేపీ అన్నారు.

"పాలన, ప్రభుత్వోద్యోగ వ్యవస్థ అందరికీ అందుబాటులో, పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఉండేలా చేసే ఒక పకడ్బందీ చట్టాన్ని అమల్లోకి తెచ్చేందుకు మీతో, మీ అధికారులతో చర్చించటానికి మేం సంతోషంగా సిద్ధం" అని చంద్రబాబుకు రాసిన లేఖలో జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు.

*(లేఖ ప్రతుల్ని సంబంధిత శాఖల ఆంధ్రప్రదేశ్ మంత్రులు యనమల రామకృష్ణుడు, నారా లోకేష్, కొల్లు రవీంద్ర, ఎన్.అమరనాథరెడ్డి, పితాని సత్యనారాయణ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి సతీష్ చంద్ర, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శి జి. సాయి ప్రసాద్‌లకి పంపారు).* ❖

# (మీడియాలో) 'కీ' కామెంట్లు !

❐ *డీమానిటైజేషన్ (పెద్ద నోట్ల రద్దు) వల్ల వేలాది ఉద్యోగాలు పోయాయి. రోగులకు తగిన వైద్యం అందలేదు. ప్రజలు గంటలకొద్దీ వరుసలో నిలుచున్నారు. ఎంతో వేదన కలిగింది. వీటన్నింటి ప్రతికూల మనకు గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం (జనవరి-మార్చి) స్థూల జాతీయోత్పత్తి - జీడీపీ వృద్ధి రేటు (6.1శాతం) రూపంలో కనపడింది. డిజిటలైజేషన్ వైపు నడకకూ-డీమానిటైజేషన్‌కూ సంబంధం లేదు. డీమానిటైజేషన్ అవసరం లేకుండానే డిజిటలైజేషన్ చర్యలు పటిష్టంగా చేపట్టవచ్చు. నోట్ల రద్దు ప్రయోజనాలు దీర్ఘకాలంలో కనిపిస్తాయని ఆశిద్దాం.*

**- దువ్వూరి సుబ్బారావు,** ఆర్‌బీఐ మాజీ గవర్నర్

భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ కమ్యూనిస్టులు పోటీ చేయకుండా ఉంటేనే మేలనిపిస్తోంది. నంద్యాల అసెంబ్లీ ఉప ఎన్నికలో, కాకినాడ మునిసిపల్ ఎన్నికల్లో ప్రధాన పార్టీలు ఎక్కడికక్కడ పోటీపడి కోట్ల రూపాయలను వెదజల్లాయి. ఓటర్లను కొనుగోలు చేశాయి. వార్డు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలను కొనుగోలు చేసే దుస్థితి దాపురించడం దారుణం. అభివృద్ధిని చూసి ఓటేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతూనే తన పార్టీ నేతలకు నోట్ల కట్టలను ఎందుకు పంచుతున్నారు? ఎన్నికలు లేకుండా ఎవరు ఎక్కువ ఖర్చు పెడితే వారికి పదవులు ఇచ్చేస్తే తేలిగ్గా ఉంటుంది గదా!

**- రామకృష్ణ,** సీపీఐ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి

❐ ***స్ఫూర్తి పరాయిదైనా, మార్గాన్ని అంగీకరించలేకున్నా, ప్రాణాల్ని పణంగా పెట్టగల నక్సలైట్ల విలువలను శంకించలేం. నక్సల్బరీ ఉద్యమం 50 ఏళ్లు పూర్తి చేసుకున్న ఈ తరుణంలో అయినా మావోయిస్టు పార్టీ దృక్పథం సమూలంగా మారాల్సిన అవసరం ఉంది. ఎల్‌టీటీఈ మొదలుకుని ఐసిస్ దాకా ప్రపంచంలో ఎక్కడా సాయుధ పోరాటాలు సఫలమయ్యే సూచనలు కనిపించడం లేదు. అదే సమయంలో పార్లమెంటరీ పార్టీలన్నీ అవినీతికి, సత్యానంతర రాజకీయాలకు కేరాఫ్‌గా మిగిలిపోయాయి. వాస్తవ, శాస్త్రీయ, క్షేత్రస్థాయి పరిస్థితులు, గణాంకాలు, అంచనాలపై కాకుండా వ్యక్తిగత విశ్వాసాలు, ఉద్వేగాలపై ఆధారపడి 'ప్రజాభిప్రాయాన్ని' నిర్మించే రాజకీయ శకం నడుస్తోంది. ఇది తప్పని దీటుగా చెప్పేవారు లేరు. దేశంలో ప్రత్యామ్నాయ రాజకీయ శూన్యత ఏర్పడింది. నెహ్రూ కుటుంబమే ఆలంబనగా బతికిన కాంగ్రెస్, చిట్టచివరి వారసుడిపై ఆధారపడి, అవసాన దశకు చేరింది. కులరాజకీయాలకు కాలం చెల్లింది. సోషలిస్టులు అవకాశవాదులయ్యారు. జాతీయస్థాయిలో పోటీ రాజకీయ శిబిరం కనుచూపు మేరలో కనిపించడం లేదు. మైదాన ప్రాంతాల్లో సామాజిక వ్యవస్థకు 'బలమైన చెక్' లేకుండా పోయి, ఇష్టారాజ్యమైంది. కమ్యూనిజం పోయి కన్జ్యూమరిజమే యుగధర్మంగా మారిన కాలంలో, మా నాన్న 20 ఏళ్ల క్రితం చెప్పినట్టు పోరాటాలు జరగాల్సింది మారుమూల పల్లెలోనో, అడవిలోనో కాదు.. మైదానంలో! ఇప్పుడు సమాజానికి ఒక భయం, ఒక చెక్, ఒక డిటరెంట్ ఫోర్స్ అవసరం. సోషల్ మీడియా ఉన్మాదం బదులు సోషలాజికల్ చైతన్యం అవసరం.***

**- తిగుళ్ల కృష్ణమూర్తి,** సీనియర్ జర్నలిస్టు

కిందిస్థాయి కేసుల పరిష్కారం కోసం కేంద్ర గ్రామీణ న్యాయాలయాల చట్టాన్ని తీసుకువచ్చారు. కానీ అవి పూర్తిస్థాయిలో అన్ని రాష్ట్రాల్లో అమలుకు నోచుకోలేదు. ప్రస్తుతం 8 రాష్ట్రాల్లో 240 మాత్రమే ఏర్పాటై ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఒక్కటీ ఏర్పాటు చేయలేకపోయారు. గ్రామీణ (స్థానిక) న్యాయాలయాలను తక్షణమే ఏర్పాటు చేయాలి. వీటివల్ల కేసుల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుంది. లేదంటే కోర్టుల భారం, నిరవధిక వాయిదాల వల్ల పేదవర్గాల ప్రజలు ఆర్థికంగా చితికిపోతుంటారు.

**- డాక్టర్ సిలువేరు హరినాథ్**

(కర్టెసీ: ఆంధ్రజ్యోతి, నమస్తే తెలంగాణ, సోషల్ మీడియా) ❖

# ఇకనైనా మేలుకొంటారా ప్రధానీ?




నల్లధనాన్ని నిర్మూలించటానికి తొలి అడుగుగా డీమానిటైజేషన్ (పెద్ద నోట్ల రద్దు)ను ఎంచుకున్న నరేంద్రమోదీ ప్రభుత్వం.. ఏమాత్రం ప్రణాళిక లేకుండా అసమర్థంగా అమలు చేయడంతో దేశ ప్రజలకు కష్టాలు, దేశానికి ఆర్థికనష్టం వాటిల్లాయి. డీమానిటైజేషన్‌తో ఆగకుండా వెంటనే రియల్ ఎస్టేట్ రంగంలో పన్ను సంస్కరణల నుంచి ఎన్నికల సంస్కరణల దాకా చర్యల్ని చేపట్టాలని లోక్‌సత్తా, కొందరు పౌరప్రముఖులు సూచించినా మోదీ ఉదాసీనంగా వ్యవహరించడంతో నల్లధనంపై యుద్ధం ఓ ప్రహసనంలా మారింది. ప్రాచుర్య మీడియాను గుప్పెట్లో పెట్టుకుని డీమానిటైజేషన్‌ను కాలామనీ సంపన్నులపై యుద్ధంగా మోదీ పెద్దఎత్తున ప్రచారం చేసుకోవటంతోపాటు కాంగ్రెస్ సహా పలు ప్రత్యర్థి పార్టీల నగదు నిల్వల్ని దెబ్బతీయటంతో.. నోట్ల రద్దు మోదీకి, ఆయన పార్టీకి మాత్రం తక్షణ లాభాల్ని చేకూర్చింది. పలు ఎన్నికల్లో విజయాల్ని అందించింది. ముమ్ముందు పన్నుల వసూళ్లు, ఆన్‌లైన్ సేవలు పెరగటం, సంఘటితరంగంలో పారదర్శకత వంటి లాభాలు డీమానిటైజేషన్ వల్ల వచ్చే అవకాశమున్నా.. ప్రజలకు అందించే సేవల్లో నాణ్యత, అవినీతిరహిత సేవలు లేనంత వరకూ అవి జనానికి భారాలే అనుకోవాలి. దేశ జనాభాలో అత్యధికులు అసంఘటితరంగం లోనే అభద్రతతో బతుకుతున్నారు. నేతల విలాసాలకు, దుబారాలకు, ప్రభుత్వోద్యోగుల జీతాల పెంపునకు పన్నుల డబ్బును వినియోగించేకాడికి.. డీమానిటైజేషన్ దీర్ఘకాల ప్రయోజనాల ప్రయోజనాల గురించి వారెందుకు ఆలోచించాలి? చెలామణిలో ఉన్న కరెన్సీలో 86శాతం నోట్లను రద్దు చేయడంలో మోదీ ధైర్యాన్ని, నిజాయతీని ప్రదర్శించినా, నల్లడబ్బు పోగేసుకునేవారికి బలమైన హెచ్చరికను ఇవ్వగలిగినా.. పార్టీ రాజకీయాలను దాటని సంకుచిత్వం, దీర్ఘకాలిక పరిణామాలను ఆలోచించలేని తెలివిమాలినతనం, తనకు తెలియని విషయాలను చెప్పగల జనహిత టీంని నిర్మించుకోలేని అభద్రత వంటి లక్షణాలు ఆందోళనకరమని డీమానిటైజేషన్ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

ఇటీవల రిజర్వుబ్యాంకు ప్రకటించిన లెక్కలు కూడా ఇవే వాస్తవాలకు అద్దం పడుతున్నాయి.

నోట్ల రద్దు వివరాలను ఆర్బీఐ తన 2016-17 వార్షిక నివేదిక ద్వారా వెల్లడించింది. నోట్ల రద్దును ప్రధాని మోదీ ప్రకటించిన 2016 నవంబర్ 8నాటికి దేశంలో చెలామణిలో ఉన్న కరెన్సీ విలువ రూ.15.44లక్షల కోట్లు కాగా.. వెనక్కి తిరిగి వచ్చిన నోట్ల విలువ రూ.15.28లక్షల కోట్లు అని పేర్కొంది. అంటే.. ప్రభుత్వానికి నికరంగా మిగిలింది కేవలం రూ.16,050 కోట్లు. అంటే దాదాపు 1శాతం మాత్రమే. అందులోనూ కొత్త నోట్ల ముద్రణకు రూ.7,965కోట్లు పోయాయి. ఇతరత్రా కలిపి నోట్ల రద్దు వల్ల రూ.21,000 కోట్లు బ్యాంకింగ్ వ్యవస్థ నష్టపోయిందని అంచనా. ఏతావాతా డీమానిటైజేషన్ ప్రభుత్వ అంచనాలకు విరుద్ధంగా దేశానికి ఆర్థికనష్టాన్నే కలిగించింది. నల్లధనం రూపం మార్చుకోవడం, మోదీ అండ, అవినీతి అధికారుల వల్ల పలువురు రాజకీయ నేతలు (ఇందులో కొందరు ముఖ్యమంత్రులు కూడా ఉన్నారని వినికిడి), సంపన్నులు, పలుకుబడిగలవారు కూడా నల్లడబ్బును దిగ్విజయంగా తెలుపుగా మార్చేసుకోవడం, రోజుకో కొత్త నిబంధన వల్ల కూడా తొలుత ఆశించినట్టు డీమానిటైజేషన్ వల్ల లక్షల కోట్లు ఖజానాకు మిగలలేదనే వాదననూ తోసిపుచ్చలేం. ఈ క్రమంలో నిల్వ ఉన్న డబ్బు చెలామణిలోకి వచ్చిందనుకున్నా.. వ్యాపార మందగమనం వల్ల దాని వల్ల కూడా జనానికి లాభం కలగని పరిస్థితి నెలకొంది.

### రూ.1000 నోట్ల ద్వారా రూ.8,900కోట్లు

- కేంద్రప్రభుత్వం గత ఏడాది నవంబర్‌లో పెద్ద నోట్ల రద్దు నిర్ణయం తీసుకునేనాటికి దేశవ్యాప్తంగా చెలామణిలో ఉన్న నోట్ల విలువ రూ.17.54లక్షల కోట్లు. ఇందులో రూ.500 నోట్ల వాటా దాదాపు 46శాతం, 1000నోట్ల వాటా 40శాతం.
- అంటే రద్దయిన పెద్ద నోట్ల వాటా మొత్తం కరెన్సీలో 86శాతం.
- అప్పటికి చెలామణిలో ఉన్న రూ.500 నోట్ల సంఖ్య 165 కోట్లు కాగా, రూ.1000 నోట్ల సంఖ్య 670 కోట్లు. రద్దయిన ఈ నోట్లను బ్యాంకుల్లో జమ చేసే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించింది.

- రూ.1000నోట్లలో తిరిగిరానివి కేవలం 1.4శాతం నోట్లేనని స్పష్టమైంది. మొత్తం 670 కోట్లు రూ.1000నోట్లలో బ్యాంకుల్లో జమకానివి 8.90 కోట్లు మాత్రమేనని ఆర్‌బీఐ పేర్కొంది. అంటే రూ.8,900కోట్ల మొత్తం మిగిలినట్టు స్పష్టమవుతుంది.
- బ్యాంకుల్లో జమకాని రద్దయిన జమకాని రూ.500నోట్ల సంఖ్య ఇంతకంటే ఎక్కువగా ఉండకపోవచ్చు (ఈ లెక్కను ఆర్‌బీఐ వెల్లడించలేదు).
- వెనక్కిరాని రూ.1000, రూ.500 నోట్ల రూపంలో ఆర్‌బీఐకి రూ.16,000కోట్ల మేరకు (రూ.8,900కోట్ల విలువైన రూ.1000నోట్లు, మిగిలినవి రూ.500నోట్లు) మిగిలినట్టు ఆర్థిక నిపుణుల అంచనా.

ఈ మొత్తం ముందుగా మిగులుతుందని అంచనా వేసిన రూ.3లక్షల కోట్లతో పోలిస్తే ఎంతో తక్కువ.

**నకిలీ నోట్లు**

- 2016లో గుర్తించిన నకిలీనోట్ల సంఖ్య 6.32 కోట్లుకాగా, 2017లో అది 7.62కోట్లు
- ఆర్బీఐ శాంపిల్ సర్వేలో నోట్ల రద్దునాటికి చెలామణిలో ఉన్న పదిలక్షల రూ.500నోట్లలో సగటున 7.1నోట్లు, 10లక్షల రూ.వెయ్యినోట్లలో 19.1నోట్లు నకిలీవిగా తేలాయి.

**ముద్రణ ఖర్చుకు అదనంగా రూ.4,544కోట్లు**

నిరంతర ప్రక్రియగా సాగే నోట్ల ముద్రణకు 2015-16లో ఆర్‌బీఐ రూ.3,421కోట్లు వెచ్చించింది. కానీ 2016-17లో ఈ ఖర్చు రెట్టింపయింది. దీనికి కారణం రద్దయిన పెద్ద నోట్ల స్థానంలో కొత్తగా ప్రవేశపెట్టిన రూ.500, రూ.2000నోట్లను ముద్రించడమే. అందువల్ల 2016-17 ఆర్థిక సంవత్సరంలో నోట్ల ముద్రణకు అయిన ఖర్చు రూ.7,965కు పెరిగింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే అదనంగా రూ.4,544కోట్లు ఖర్చు చేయాల్సి వచ్చింది. ఇదంతా కొత్త నోట్ల ముద్రణ ఖర్చే.

బంతి ఇంకా మీ కోర్టులోనే ఉంది, ఇకనైనా మేలుకొని కీలక సంస్కరణలను తెస్తారా ప్రధానీ? ❖

# ఖరీఫ్ సాగు తగ్గింది

దేశవ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పత్తి, చెరకు మినహా అన్ని పంటల సాగు విస్తీర్ణం తగ్గింది. గత ఏడాదితో పోలిస్తే మొత్తంగా 5.77లక్షల హెక్టార్ల మేర తగ్గుదల కనిపిస్తోంది. అయితే పత్తి (సుమారు 17లక్షల హెక్టార్లు), చెరకు (దాదాపు 4లక్షల హెక్టార్ల మేర) పంటల సాగు విస్తీర్ణం మాత్రం పెరిగింది. వరి, పప్పు దినుసులు, చిరుధాన్యాలు, నూనెగింజలు, జనుము (జ్యూట్) వంటి పంటల సాగువిస్తీర్ణం గుర్తించదగ్గ స్థాయిలో తగ్గింది.

# ఆర్ఎంపీల గుర్తింపును వ్యతిరేకిస్తున్న అల్లోపతి వైద్యులు

ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఆర్ఎంపీలు (రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టిషనర్స్), పీఎంపీల (ప్రైవేట్ మెడికల్ ప్రాక్టిషనర్స్) గుర్తింపు అంశం మళ్లీ అయోమయంలో పడింది. ఆర్ఎంపీలు, పీఎంపీలకు శిక్షణనిచ్చి వైద్యం చేసేందుకు అవసరమైన గుర్తింపునివ్వాలనే పాత ప్రతిపాదనను మూడేళ్ల పాలన అనంతరం తెలుగుదేశం ప్రభుత్వం తెర మీదికి తెచ్చింది. దీనిపై అల్లోపతి వైద్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికీ రాష్ట్రంలో 60శాతం మంది ప్రజలు ఆర్ఎంపీలు, పీఎంపీలనే వైద్యానికి ఆశ్రయిస్తున్నారని అంచనా.

# ప్రైవేటు పాఠశాలల్లో పెరుగుతున్న చేరికలు

విద్యాహక్కు చట్టం అమల్లోకి వచ్చాక 2010-14లో ప్రభుత్వ పాఠశాలలు దేశంలో 13,500 మేర పెరగ్గా, విద్యార్థుల చేరిక 1.13కోట్ల మేర పడిపోయింది. ప్రైవేటు పాఠశాలల్లో చేరికల సంఖ్య 1.85కోట్ల మేర పెరిగింది. 2014-15లో యాభై మందికన్నా తక్కువ విద్యార్థుల సంఖ్యను కలిగిన ప్రభుత్వ పాఠశాలల సంఖ్య 3.7లక్షల మేర ఉంది. మొత్తం ప్రభుత్వ పాఠశాలల్లో ఇవి 36శాతంగా ఉన్నాయి. ఉపాధ్యాయుల గైర్హాజరు పెరగడం, బోధనకు పరిమిత సమయాన్ని వెచ్చించడం, విద్యలో నాణ్యత లోపించడం వంటి కారణాల వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని నీతి ఆయోగ్ విశ్లేషించింది. పనితీరు సరిగా లేని, డొల్ల ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య నమూనా కింద ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని సూచించింది. విద్యారంగానికి కేటాయించే నిధుల కేటాయింపునకు విద్యార్థుల సంఖ్యను ప్రాతిపదికగా చేయాలన్న లోక్‌సత్తా సూచననూ నీతి ఆయోగ్ సూత్రప్రాయంగా పరిగణలోకి తీసుకుంది. ప్రైవేటు రంగం డొల్ల ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుంటే, ప్రభుత్వం విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులను అందచేయాలని సూచించింది. ఆసక్తి ఉన్న రాష్ట్రాల్లో చేపట్టిన సాహసోపేత ప్రయోగాలను పరిశీలించడానికి రాష్ట్రాల భాగస్వామ్యంతో ఒక కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. ❖

# తప్పక చదవండి ! చదివించండి !!

పేజీలు : 64

వెల : రూ. 20 /-

Lok Satta
People Power

Lok Satta Party



# లోక్‌సత్తా 20 + :
# 100 నిజాలు (విజయాలు)
# మాట్లాడుకుందాం !

Posting Date 22-09-2017
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on September 16th 2017




| Book-Post<br>PRINTED MATTER | To |
|---|---|
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad